ఏప్రిల్, 2010

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 3 పేజీలు: 64 వెల: రూ. 20/-



## అంబేద్కర్ ఆలోచనలు నేటికీ సజీవం



# మహిళా సాధికారతలో ముందడుగు

స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 3

ఏప్రిల్, 2010

ఎడిటర్

**ఫణి కుమార్**



ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**మహమ్మద్ తకీయుద్దీన్**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ ఇ.వి. స్వర్ణలత**

**ఎన్. విజయ కుమార్**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**డాక్టర్ పి. రఘునాధరెడ్డి**

**డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా,
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్



రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail ID : Phanikumar@ap.gov.in


# విషయ సూచిక


సంపాదకీయం ............ 2

పరిపాలనలో నూతన ఒరవడుల ద్వారా అభివృద్ధి సాధిస్తున్న గూగుల్ ఉత్తమ గ్రామాలు ............ 3

మహిళా సాధికారతలో ముందడుగు ............ 5

మన గ్రామం-మన మండల పరిషత్ ............ 9

భారత రాజ్యాంగం-షెడ్యూలు తెగలు ............ 12

నావను నడిపే ముచ్చట కనరే... (హాస్య కథ) ............ 15

భారత దేశపు బడ్జెట్ల విశ్లేషణ, 2010-2011 ............ 18

శ్రీ రమణ పేరడీలు ............ 21

ప్రేమ, క్షమాపణలే యేసుక్రీస్తు జీవన సారాంశం ............ 25

వార్తల్లో 'అపార్డ్' ............ 27

పల్లె ప్రజల గుండె గీతాలు... జానపద గీతాలు ............ 29

పచ్చని చెట్లున్నచోటే పాడే కోయిలలు ............ 32

అంబేద్కర్ ఆలోచనలు నేటికీ సజీవం ............ 36

రాష్ట్రంలో త్వరలో విలేజ్ మాల్స్ ............ 40

స్థానిక సంస్థలకు మరిన్ని నిధులు ............ 41

నేలతో సావాసం (గ్రామీణ కథ) ............ 43

అపార్డ్ ప్రచురణలపై ప్రసంశలు ............ 46

అలతి అలతి పదాల తేట తెలుగుకు నాంది పలికిన తిక్కన సోమయాజి ............ 47

మహనీయుల చతురోక్తులు ............ 51

పంటల్ని ఇట్లా కాపాడుకుందాం ! ............ 52

షెడ్యూల్డ్ కులాలు/జాతుల అభివృద్ధిలో 5 దశాబ్దాలు ............ 55

విజయనగర సామ్రాజ్య సాంఘిక జీవనం వైభవ భరితం ............ 57

భారత క్రికెట్‌కు వైభవోపేత సమయం అది ............ 59

బోరు బావులకు పసి ప్రాణాలు బలిచేయద్దు ............ 62

మహిళల గౌరవానికే భంగం రెండో పెళ్లి ............ 63

ఏప్రిల్, 2010

# సంపాదకీయం..

## మహిళలకు మహోదయం

జనాభాలో సగభాగంగా ఉన్నా, ఆకాశంలో సగం అంటూ మురిసిపోతున్నా, రాజ్యాంగం అన్ని హక్కులను, సమానత్వాన్ని ప్రసాదించినా ఇంకా ఆశించినంత ప్రగతి సాధించని మహిళాలోకానికి ఇది నిజంగా మహోదయం.

పధ్నాలుగు సంవత్సరాలుగా అనేక ఆటుపోట్లను, ఆటంకాలను, సవాళ్లను ఎదుర్కొంటూ పార్లమెంటులోకి ప్రవేశించలేక మరుగున పడి ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లుకి ఈ మార్చి నెలలో మోక్షం లభించింది. పెద్దల సభ పెద్ద మనసుతో ఆమోదించటంతో తొలి అంకం ముగిసింది. లోక్‌సభ కూడా ఆమోదిస్తే, ఇక భారతీయ మహిళలకు సంపూర్ణ రాజకీయ సాధికారత సిద్ధించినట్లే. లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ లభిస్తుంది. మన రాజ్యాంగానికి ఇది 108వ సవరణ అవుతుంది.

భారతదేశ స్వాతంత్ర్య సమరం నాటి నుంచి అనేక మంది మహిళలు చురుకుగా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొంటున్నప్పటికీ, వాస్తవాధికారాన్ని అందుకున్నది అతి కొద్దిమంది మాత్రమే వేళ్లపై లెక్కపెట్టదగినంత మంది మాత్రమే అధికార పదవులను అలంకరించారు. మహిళలకు అత్యున్నత చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లభించ నందునే, మహిళలకు రిజర్వేషన్లు అనే అంశం తెర పైకి వచ్చింది.

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన భారతదేశం చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యంలో మాత్రం ప్రపంచంలో 99వ స్థానంలో ఉంది. నిజానికి అన్నింటా వెనుకబడిన ఆఫ్రికా ఖండంలోని రువాండాలోని చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం 56.3 శాతమని తెలుసుకుంటే ఆశ్చర్యం కలగక మానదు. దక్షిణాఫ్రికా 44.5 శాతంలో మూడవ స్థానంలో ఉంది. ఉత్తర యూరప్ దేశాలైన నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, ఐస్‌లాండ్ కూడా ఈ విషయంలో ముందంజలో ఉన్నాయి. ఈ దేశాలు 40 శాతం వరకూ మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి.

అయితే, ఉన్నత స్థానాల్లోని చట్ట సభల్లో మనదేశంలో మహిళా ప్రాతినిధ్యం 10 శాతాన్ని మించకపోయినా, మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థలో మహిళలు 33 శాతం రిజర్వేషన్లను ఏనాడో పొందారు, తొలిరోజుల్లో అడుగులు తడబడినా, తరువాత వారు స్వయం శక్తి సంపన్నులై మంచి పరిపాలకులుగా ఎదిగారు, తాము ఎన్నికైన గ్రామాలను అభ్యుదయ పథంలో నడిపించటం మనమంతా చూస్తున్నాం. దిగువస్థాయిలోని ఈ మహిళా నాయకత్వం తమ శక్తి యుక్తులను, అంకిత భావాన్ని, పరిపాలనా పాటవాన్ని పై స్థాయిలోని చట్ట సభల్లో వినియోగించటానికి ప్రస్తుత మహిళా రిజర్వేషన్ బిల్లు ఉపకరిస్తుంది. అంతేకాదు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హింస, వారు ఎదుర్కొంటున్న పోషకాహార లోపం, రక్తహీనత, ఆరోగ్య సేవల లోటు, వరకట్న దురాచారాలు వంటి అనేకానేక సమస్యలకు ఎదిగి వచ్చిన మహిళా నాయకత్వం మంగళం పాడే రోజు దగ్గర్లోనే ఉంది. మహిళలకే కాక, ఇది యావత్ సమాజానికే మహోదయం. శుభోదయం.

# పరిపాలనలో నూతన ఒరవడుల ద్వారా అభివృద్ధి సాధిస్తున్న గూగుల్ ఉత్తమ గ్రామాలు

గ్రామీణ ప్రజలు జీవన ప్రమాణాలలో మార్పును తీసుకొని రావటానికి గ్రామపంచాయతీలు చేస్తున్న ప్రయత్నాలకు ప్రోత్సాహకంగా గ్రామ పంచాయతీ పురస్కార్‌ను గూగుల్. ఓఆర్‌జి ప్రవేశపెట్టింది. ఇంటర్నెట్‌తో పరిచయం ఉన్న వారెవరికైనా ఇట్టే గుర్తుకువచ్చే పేరు గూగుల్. ఇంటర్నెట్‌లో మనకు కావలసిన సమాచారాన్ని శ్రమ లేకుండా క్షణాల మీద వెతికిపెట్టే సెర్చి ఇంజన్లలో గూగుల్‌కు మరొకటి సాటి లేదంటే ఆతిశయోక్తి కాదు. ఇంటర్‌నెట్ సమాచార రంగంలోని దిగ్గజమైన గూగుల్‌కి, గ్రామీణాభివృద్ధికి సంబంధం ఏమిటి? గ్రామపంచాయతీలకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాల్సిన అవసరం గూగుల్‌కి ఏమున్నది? అన్న ప్రశ్నలకు సమాధానంగా గూగుల్ ప్రోగ్రామ్ మేనేజర్ సాలిమా శామ్‌జి ఇలా అంటారు. ''క్షేత్ర స్థాయిలో గ్రామపంచాయతీలు చేసే విశేషమయిన కృషివల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నప్పటికీ, పంచాయతీలు చేసే కృషికి సరియైన ప్రచారం లేకపోవటం వల్ల గుర్తింపు రావటంలేదు''. లాభాపేక్షకు తోడు పారిశ్రామిక రంగానికి ఉన్న సామాజిక బాధ్యతలను నిర్వర్తించటంలో భాగంగా గూగుల్‌కు వచ్చే లాభాలలో ఒక్క శాతాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రజాసంక్షేమం కోసం ఖర్చుచేయాలనే సంకల్పంతో గూగుల్ ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసిందనీ, ఈ నిధినుండి కొంతమొత్తాన్ని క్షేత్రస్థాయిలో విద్య, ఆరోగ్యం, పోషకాహారం, మంచినీటి సరఫరా, గ్రామీణ అవస్థాపనా సౌకర్యాలు, గ్రామీణ విద్యుదీకరణ, వనరుల సమీకరణ లాంటి 6 రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న ఉత్తమ పంచాయతీలకు ప్రోత్సాహక బహుమతులు అందచేయటం ద్వారా వాటిని వెలుగులోకి తీసుకొని వచ్చి మరిన్ని గ్రామపంచాయతీలకు స్ఫూర్తిని కలిగించటానికి చేసే తొలి ప్రయత్నమే ఈ గూగుల్ గ్రామ పురస్కారాలను అందచేసే కార్యక్రమమంటారు శ్రీ సాలిమా శామ్‌జీ.

గూగుల్ ప్రారంభించిన తెలియపర్చు-సశక్తీకరించు (ఇన్‌ఫార్మ్-ఎంపవర్) యత్నంలో భాగంగా భారతదేశంలో తొలిసారిగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లలోని 49 జిల్లాలలోని 27,492 గ్రామపంచాయతీలనుండి ఒక్కో రాష్ట్రంనుండి 5 ఉత్తమ గ్రామపంచాయతీలను గుర్తించే ప్రక్రియను 2008 డిసెంబరు-2009 జనవరి మధ్యలో ప్రారంభించిన గూగుల్ ఇటీవల ఉత్తమ గ్రామపంచాయతీల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసింది. ఎంపిక చేయటానికి తీసుకొన్న పరామితులలో (1) గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ప్రజా భాగస్వామ్యం, ముఖ్యంగా ఎస్.సి, ఎస్.టి, బి.సి., మహిళలు వంటి అణగారిన వర్గాలకు చెందిన ప్రజల భాగస్వామ్యం ఏ మేరకు ఉన్నది (2) గ్రామసభల నిర్వహణ తీరు, తీర్మానాల అమలు (3) రికార్డుల నిర్వహణ (4) పంచాయతీ ద్వారా అమలు చేయబడే కార్యక్రమాలకు విడుదలైన నిధుల వినియోగం, పనులలో నాణ్యతా సంబంధ విషయాలపై ప్రజలకు సమాచారం అందుబాటు (5) ప్రజాసేవల కల్పనలో ఇతర పథకాలను/కార్యక్రమాలను వినియోగించుకోవటం వంటివి ముఖ్యమైనవి. వివిధ పంచాయతీలనుండి గూగుల్‌కు అందిన దరఖాస్తులను పైన పేర్కొన్న ప్రమాణాల ప్రకారం పరిశీలించిన అనంతరం మనరాష్ట్రం నుండి గంగదేవిపల్లి (వరంగల్ జిల్లా), కొండాపూర్ (వరంగల్ జిల్లా), పాండురంగాపురం (కర్నూలు జిల్లా), జేగురుపాడు (తూర్పుగోదావరి జిల్లా), మేడేపల్లి (ఖమ్మం జిల్లా) గ్రామపంచాయతీలను గూగుల్ ఉత్తమ గ్రామపంచాయతీ పురస్కారాలకు ఎంపికచేయటం జరిగింది. ఈ పురస్కారం క్రింద ప్రతీ గ్రామపంచాయతీకి రూ 5.00 లక్షలు ప్రోత్సాహక బహుమతులకు గూగుల్ ఇప్పటికే చెక్కుల రూపంలో ఇప్పటికే గ్రామపంచాయతీలకు అందచేసింది కూడా.



అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ ప్రజలకు మౌలిక సేవలదించటంలో ఈ ఐదు గ్రామపంచాయతీలు తమదైన శైలిలో విశేషమయిన సేవలు చేస్తున్నాయి. ఈ పంచాయతీల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

## గంగదేవిపల్లి

వరంగల్ - నర్సంపేట ప్రధాన రహదారిపై వరంగల్ పట్టణానికి 14 కి.మీ దూరంలో గీసుకొండ మండలంలో 1291 జనాభా (2001 జనాభా లెక్కలు)

కల్గిన మైనరు గ్రామపంచాయతీ గంగదేవిపల్లి గడించిన ఖ్యాతి రాష్ట్రవ్యాప్తంగా సుపరితమే ఐనప్పటికీ, గూగుల్ పురస్కారం అందుకొన్న సందర్భంలో ఈ గ్రామం సాధించిన ప్రగతిని గూర్చి మరొక్కసారి చర్చించడటం అప్రస్తుతమేం కాదు. 1993 సంవత్సరానికి పూర్వం మచ్చాపూర్ గ్రామపంచాయతీలో అంతర్భాగంగా ఉండే ఈ చిన్న గ్రామంలోని పరిస్థితులు రాష్ట్రంలోని ఇతర గ్రామాలలో ఉండే విధంగానే ఉండేవి. గ్రామంలో ప్రజల మధ్య అనైక్యత, రాజకీయ ఘర్షణలు తరచుగా తలెత్తటంతో అభివృద్ధి కుంటుబడింది.



SthanikaPalanaTelApril_2010.pmd 9 3/27/2010, 6:11 PM



గ్రామప్రజలు త్రాగునీరు, పారిశుధ్యం, విద్య, రహదారులు, వీధిదీపాలు వంటి మౌలిక వసతులకు కూడా  నోచుకోకుండా దయనీయమైన పరిస్థితులలో జీవనం వెళ్ళదీసేవారు. ప్రజలు త్రాగుడు వంటి వ్యసనాలకు బానిసలై తమకుటుంబాల పట్ల, సమాజం పట్ల బాధ్యతారహితంగా ప్రవర్తించేవారు.

ఇటువంటి పరిస్థితులలో గ్రామంలో చైతన్యవంతులయిన యువత శ్రీ కూసం రాజమౌళి నేతృత్వంలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. తొలుత గ్రామంలో సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలులోకి తెచ్చిన ఈ బృందం, తరువాత గ్రామాన్ని విద్యుదీకరించుకోవటం, వీధిదీపాలు అమర్చుకోవటం, వీధిదీపాలను సజావుగా నిర్వహించుకోవటం వంటి కూడా సమర్ధవంతంగా చేపట్టారు. మద్యపాన నిషేధ కమిటీ, వీధిదీపాల నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసుకొని పనివిభజన ద్వారా గ్రామస్థులను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయటం వల్ల ఈ రెండు కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి.

ఈ రెండు కార్యక్రమాలలో విజయం సాధించటంతో తదుపరి కార్యక్రమంగా గ్రామానికి ఉన్న మంచినీటి సమస్యను తొలగించటానికి రాజమౌళి బృందసభ్యులు బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహకారాన్ని సాధించటంలో కృతకృత్యులయ్యారు. ఐతే బాలవికాస సంస్థ కోరిన 10 శాతం ప్రజావిరాళాన్ని సాధించటానికి ప్రజలను సమీకరించటం, ప్రజలలో చైతన్యం తీసుకొనిరావటంవల్ల గ్రామస్థులలో ఒకరకమయిన సంఘీభావం ఏర్పడి గ్రామమంతా ఒకే తాటిపై పనిచేయటం వల్ల కలిగే లాభాలపై ఏర్పడిన అనుభవం దృష్ట్యా, ఈ కార్యక్రమాలన్నింటికీ నేతృత్వంవహిస్తున్న రాజమౌళి బృందంపై గ్రామస్థులకు ఒక నమ్మకం ఏర్పడమే కాక, గ్రామాన్ని ఒక అభివృద్ధి చెందిన గ్రామంగా మలచటానికి అప్పుడే బీజం పడిందని చెప్పవచ్చు.

అనంతరం గంగదేవిపల్లి ఒక ప్రత్యేక గ్రామపంచాయతీగా ఆవిర్భవించటం, ఆనాటి నుండి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు ఒక్కొక్కటిగా ఊపందుకొని నేడు గంగదేవిపల్లి గ్రామంలో నూరు శాతం మద్యనిషేధం, అన్ని కుటుంబాలకు సురక్షిత త్రాగునీరు ఫిల్ట్రేషను ప్లాంటుద్వారా అందచేయటం, నూరుశాతం ఇంటిపన్నుల వసూలు, నూరు శాతం వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, గ్రామంలో సంపూర్ణ పారిశుద్ధ్యం, అర్హులైన కుటుంబాలలో నూరుశాతం కుటుంబనియంత్రణ పాటించటం, నూరుశాతం పిల్లలు బడిలో నమోదుకావటం, డ్రాప్ అవుట్ విద్యార్థులు లేకపోవటం, 15-50 సం. లోపు వయోజనులందరూ అక్షరాస్యులుగా ఉండటం, బాలకార్మికులు లేకుండా వయోజనులందరూ అక్షరాస్యులుగా ఉండటం, ఈ గ్రామం ప్రత్యేకత. గ్రామ పంచాయతీ ఏర్పడిన తరువాత మొత్తం మూడువిడతలు సాధారణ ఎన్నికలు జరగగా, మొదటి రెండువిడతలలో సర్పంచ్ పదవితో పాటు అన్ని వార్డులకు పూర్తిగా మహిళా ప్రజాప్రతినిధులనే ఎన్నుకొని గ్రామ అభివృద్ధిలో మహిళలకు పట్టం కట్టిందీ ఆదర్శ గ్రామం. మూడవ విడత జరిగిన ఎన్నికలలో సర్పంచ్‌తో పాటు అందరు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రభుత్వం అందచేసిన రూ 5 లక్షల ప్రోత్సాహక బహుమతిని కూడా అందుకుంది.

ప్రజలకు వివిధ సేవలను ఆదర్శవంతంగా అందచేస్తున్న గంగదేవిపల్లి గ్రామపంచాయతీ 1996 సం. నుండి పలు అవార్డులను స్వంతం చేసుకొంది. వీటిలో ప్రధానంగా 1996-97, 1997-98 లో మండల స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు, 1999 లో 100 శాతం కుటుంబనియంత్రణ సాధించిన గ్రామంగా జిల్లా స్థాయి అవార్డు, 2003-04, 2006-07, 2007-08 లలో వరుసగా జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీ అవార్డు, 2006-07లో లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషను ద్వారా బీమాగ్రామ్ అవార్డు, పారిశుద్ధ్య రంగంలో సాధించిన ప్రగతికి గుర్తింపుగా 2007 లో కేంద్ర ప్రభుత్వం నిర్మల గ్రామ పురస్కారం, 2008 లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా శుభ్రం అవార్డు లాంటివి ముఖ్యంగా పేర్కొనవచ్చు.

ప్రజలకు త్రాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్య సేవలు, కేబుల్ టివి సేవలు, వీధిదీపాల నిర్వహణకు, వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి, పచ్చదనం-పరిశుభ్రత సాధనకు, పౌరసరఫరా సేవలు సక్రమంగా జరగటానికి, బ్యాంకుల నుండి రైతులకు ఋణాలు సక్రమంగా అందటానికి, ఋణవసూళ్ళు సక్రమంగా జరిగేలా బ్యాంకులకు సహకరించటానికి, ఆడిట్ లావాదేవీల నిర్వహణకు, మహిళా సమస్యల పరిష్కారానికి, చైతన్యశిక్షణకు, పాఠశాల నిర్వహణకు, అంగనువాడీ సెంటరు నిర్వహణకు, యువజన సంక్షేమానికి, మహిళా సంక్షేమానికి, రైతు సంక్షేమానికి, గ్రామంలో ఐక్యతా సాధనకు ఇలా ప్రతీ పనికీ కమిటీలు వేసుకొని మొత్తం 18 కమిటీల ద్వారా ప్రజలకు సేవలు అందచేయటంలో క్రొత్తపోకడలకు తెరతీసిన గంగదేవి పల్లి గ్రామపంచాయతీ వరంగల్ జిల్లాలోనే కాకుండా దేశ వ్యాప్తంగా మన్ననలను అందుకొంటోంది.

ప్రజలకు మౌలిక సేవలు అందించటానికి గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన పలు కమిటీలలోని సభ్యులను గ్రామ సభ ద్వారా ఎంపిక చేయటం, కమిటీల పనితీరును గ్రామసభలలో సమీక్షించటం ద్వారా గ్రామఅభివృద్ధిలో ప్రజలందరికీ ప్రత్యక్ష భాగస్వామ్యం కల్పించటం గంగదేవిపల్లి ప్రత్యేకత. సమర్థవంతమైన పరిపాలన, ఉత్తమ నాయకత్వం, ప్రజాభాగస్వామ్యం, పారదర్శకత, జవాబుదారీతనం వంటి లక్షణాల వల్ల గంగదేవిపల్లి ప్రజల విశ్వాసాన్ని చూరగొంది.

నాయకత్వం ఏ ఒక్కరి సొత్తుకాదు, అభివృద్ధి సాధనలో సమాజంలో ప్రతీఒక్కరూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ నాయకులుగా ఎదగవచ్చనే విషయాన్ని, గ్రామంలో గల వివిధ కమిటీలు ఋజువుచేస్తూ, ప్రజాస్వామ్య విలువలకు తార్కాణంగా నిలిచిందీ గంగదేపల్లి గ్రామ పంచాయతీ. మరిన్ని వివరాలకు www.gangadevipalli.orgని సందర్శించండి.

*- డా.వి. శివశంకర ప్రసాద్,* జూనియర్ ఫ్యాకల్టీ, అపార్డు

(వచ్చేవారం మరో గూగుల్ ఉత్తమ గ్రామం గురించి తెలుసుకుందాం).



SthanikaPalanaTelApril_2010.pmd 10 3/27/2010, 6:11 PM

పద్నాలుగు సంవత్సరాలుగా ఎదురుచూసిన అడుగు ముందుకు పడింది. ఎన్నో మహిళోద్యమాలు, ఎందరో చేసిన కృషి, పడిన ఆరాటం, కన్న కలలు నేడు ఫలించాయి. కోట్లాదిమంది ఎదురుచూపులు ఫలితమిచ్చాయి.

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లును మార్చి 9వ తేదీన రాజ్యసభ ఆమోదించింది. 186-1 ఓట్ల తేడాతో బిల్లును గెలిపించి, మహిళా సాధికారతకు పెద్దపీట వేసింది. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా యుపిఎ ప్రభుత్వం పట్టుదలగా బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టి కృతకృతురాలైంది. లోక్‌సభ కూడా ఈ బిల్లును ఆమోదిస్తే, ఆ తరువాత 108వ రాజ్యాంగ సవరణ ద్వారా మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. అంతకుముందు నెల ఫిబ్రవరిలోనే కేంద్ర కేబినెట్ ఈ బిల్లును ఆమోదముద్ర వేసింది.

> "బిల్లు ఆమోదం మహిళా సాధికారత దిశగా గొప్ప ముందడుగు. దేశ నిర్మాణంలో తమ జీవితాలను త్యాగం చేసిన మహిళామణులకు ఇదో చిన్న కానుక. స్త్రీత్వానికి ఇదో పండగ. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న గొప్ప మహిళలకు మనం సమర్పించే నివాళి".
>
> *- ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్*

* ఖమ్మం జిల్లా నుంచి 1972 నుంచి 2009 మధ్య ఒక్క మహిళా ఎమ్మెల్యేకు అవకాశం రాలేదు. 27 ఏళ్ల అనంతరం 2009 ఎన్నికల్లో ఇద్దరు మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు.

# మహిళా సాధికారతలో ముందడుగు

## రిజర్వేషన్‌తో రాష్ట్రానికి 97 మంది మహిళా ఎమ్మెల్యేలు

మహిళా బిల్లు లోక్‌సభ ఆమోదం కూడా పొందితే రాష్ట్రం నుంచి కనీసం 97 మంది మహిళలకు శాసనసభలో స్థానం దక్కనుంది. ఇప్పటి దాకా జిల్లాల వారీగా మహిళా ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం వివరాలను విశ్లేషిస్తే, కొన్ని జిల్లాల్లో అడపాదడపా తప్ప మహిళలకు అవకాశం లేదు. ప్రస్తుత శాసనసభ (13వ)లో కరీంనగర్, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి మహిళా ఎమ్మెల్యేలు లేరు. మొత్తం మీద ఈ సభలో 36 మంది మహిళా సభ్యురాళ్లు తమ వాణిని వినిపిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల నుంచి అత్యధికంగా మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఈ రెండు జిల్లాల నుంచి 14 మంది చొప్పున ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు.

> "రాజీవ్ కల, సంకల్పం ఇదే. పురుషుల సాయంతో సాధించిన ఈ ఘనత భారతీయ మహిళలందరిదీ".
>
> *- శ్రీమతి సోనియాగాంధీ, యూపిఎ చైర్‌పర్సన్*

*1952 నుంచి 2009 వరకు జిల్లాల వారీ మహిళా ఎమ్మెల్యేల సంఖ్య:* శ్రీకాకుళం 11; విజయనగరం, 8; విశాఖపట్నం. 11; తూర్పుగోదావరి 14; పశ్చిమగోదావరి 12; కృష్ణా 11; గుంటూరు 14; చిత్తూరు, 12; కడప, 5; అనంతపురం, 8; కర్నూలు, 6; మహబూబ్‌నగర్, 9; హైదరాబాద్, రంగారెడ్డి, 12; మెదక్, 9; నిజామాబాద్, 8; ఆదిలాబాద్ 4; వరంగల్, 7; ఖమ్మం, 4; నల్గొండ, 6; ప్రకాశం, 3; నెల్లూరు, 2; కరీంనగర్, 3.

* ప్రస్తుత సభలో వరంగల్ జిల్లా నుంచి అత్యధికంగా నలుగురు మహిళలు ఎమ్మెల్యేలుగా ఉన్నారు.
* నెల్లూరు జిల్లా నుంచి ఇప్పటి వరకూ ఇద్దరు మహిళలు మాత్రం ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. వీరు నేదురు మల్లి రాజ్యలక్ష్మి, మాగుంట పార్వతమ్మ
* 1998 తర్వాత ఇప్పటి వరకూ కరీంనగర్ జిల్లా నుంచి మహిళా ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించలేదు.
* ప్రకాశం జిల్లా నుంచి 2001 తర్వాత ఇంతవరకూ మహిళా ఎమ్మెల్యేకు అవకాశం దక్కలేదు.

## ఆలోచించవలసిన విషయాలు

* దేశంలోని పలు రాష్ట్రాల శాసనసభల్లోనే కాకుండా పార్లమెంటు ఉభయ సభల్లోనూ మహిళా సభ్యులున్నారు. అయితే. వారిలో ప్రజలపైన ముఖ్యంగా స్త్రీల పైన ప్రగాఢమైన ముద్రను వేసిన వారు ఎందరంటే సమాధానం చెప్పటం కష్టమే. రిజర్వేషన్‌తో సభ్యుల సంఖ్య పెరగటం వల్ల ఈ పరిస్థితిలో మార్పు వస్తుందా?
* దేశంలోని ఒక మారుమూల గ్రామంలో ఉన్న సాధారణ స్త్రీకి రిజర్వేషన్ల వల్ల ఏమైనా ప్రయోజనం ఒనగూరుతుందా? లేదంటే... రాజకీయ కుటుంబాలకు చెందిన మహిళలే మరింత ఎక్కువ సంఖ్యలో చట్టసభల్లో కూర్చోవటానికే పరిమితమా?
* విద్య, వైద్యం, అభివృద్ధి పరంగా స్త్రీల పరిస్థితి గడిచిన కొన్ని దశాబ్దాల్లో గణనీయంగా మారినప్పటికీ, పురుషులతో పోల్చితే ఇప్పటికి వెనుకంజలోనే ఉన్నారు. ఉద్యోగావకాశాల్లో వివక్ష, వేతనంలో వివక్ష వంటి సమస్యలు తొలిగిపోతాయా? మహిళలపై జరిగే హింస అంతమవుతుందా?

## మహిళా రిజర్వేషన్‌తో అనేక ప్రయోజనాలు

* ప్రస్తుత లోక్‌సభలో మహిళా సభ్యుల శాతం పదికి పరిమితం. ఇంత తక్కువ సంఖ్యలో ఉన్నప్పుడు తమకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించటం, వాటికి మద్దతు కూడగట్టడం సాధ్యం కాదు. సభ్యుల సంఖ్య సభలో మూడోవంతుకు చేరుకున్నప్పుడు ఆ సంఖ్యాబలం ఆత్మవిశ్వాసాన్ని కచ్చితంగా పెంచుతుంది.
* ఇల్లాలి చదువు ఇంటికి వెలుగంటారు. అంటే మహిళ చదువుకుంటే ఆమెకొక్కరికే కాదు. ఆ ఇంటి మొత్తానికి ఉపయోగం. చట్టసభలకూ ఇది వర్తిస్తుంది. భ్రూణహత్యలు, పౌష్టికాహారలోపం, శిశుమరణాలు, పాఠశాలల నుంచి పిల్లలు డ్రాపవుట్లు వంటి సమస్యలు పరిష్కారంలో మహిళలు పురుషులు కన్నా ఎక్కువ చొరవ తీసుకుంటారని విశ్లేషకుల అభిప్రాయం.

> "దేశ చరిత్రలోనే సువర్ణాధ్యాయం. ఇది భారతీయ మహిళలు సాధించిన విజయం".
>
> *- శ్రీ కె. రోశయ్య, ముఖ్యమంత్రి*

## ముఖ్యాంశాలు

లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలలో మహిళలకు 33 శాతం స్థానాలను కేటాయించడానికి రాజ్యాంగ 108వ సవరణ చేపట్టే లక్ష్యంతో ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంటు ముందుకు తేగా, రాజ్యసభ ఆమోదించింది. దీని ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన స్థానాల్లోనూ 33 శాతం స్థానాలను ఆయా వర్గాల మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. లోక్‌సభ, శాసనసభలలో నామినేట్ చేసే ఆంగ్లో ఇండియన్ స్థానాలకు కూడా ఈ రిజర్వేషన్ వర్తిస్తుంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మహిళలకు కేటాయించిన స్థానాలను రొటేషన్ పద్ధతిన మారుస్తారు. బిల్లు ఆమోదం పొందాక, పదిహేనేళ్ళ అమలులో ఉంటుంది. అవసరమైతే తర్వాత మళ్లీ పొడిగించుకునే వీలుంటుంది. బిల్లులోని అంశాల అమలు కోసం రాజ్యాంగంలోని 239ఏఏ, 331, 333 అధికరణాలను సవరించి, కొత్తగా 330ఏ, 332ఏ, 334 ఏ అధికరణాలను చేర్చాల్సి ఉంటుంది. తొలిసారి ఈ బిల్లును 1996లో సమీక్షించిన పార్లమెంటరీ కమిటీ, ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని, రాజ్యసభ, శాసన మండళ్లకు వర్తింపజేయాలని సూచించినా, ప్రస్తుత బిల్లులో ఈ అంశాలను చేర్చలేదు.

*గతంలో...*

మహిళా బిల్లు 1996లో అప్పటి ప్రధాని దేవగౌడ హయాంలో పార్లమెంటు ముందుకు వచ్చింది. తర్వాత 1998, 1999లో కూడా మరో రెండుసార్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. మొదటి రెండుసార్లు సభ అర్థంతరంగా రద్దవడంతో బిల్లుకు కాలం చెల్లింది. ముచ్చటగా మూడోసారి ముందుకు వచ్చినప్పుడు ఏకాభిప్రాయం కుదరక ఆమోదం పొందలేకపోయింది. ఇందుకు ములాయం, లాలూ, శరద్‌ల 'యాదవ్ త్రయం' వ్యతిరేకతే కారణం. మహిళల కోటాను 20 శాతానికి తగ్గించాలని, లేకుంటే 33 శాతం కోటాలో ఓబీసీ మహిళలకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించాలన్నదే వీరి డిమాండు. బీఎస్పీ, ఎంఐఎంలదీ ఇదే మాట.

* అనేక రంగాలకు చెందిన స్త్రీలకు ఎన్నికల్లో పోటీపడే అవకాశాలు లభిస్తాయి. దేశవ్యాప్తంగా మహిళా నేతలు వందల సంఖ్యలో ఆవిర్భవిస్తారు. వారిని కేంద్రంగా చేసుకొని వారి వారి నియోజకవర్గాల్లో ఎంతోమంది స్త్రీలు, రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తారు. రాజకీయాలను పురుషులే శాసించే ప్రస్తుత వ్యవస్థలో సమూలమైన, శాశ్వతమైన మార్పులు రానున్నాయని సామాజిక శాస్త్రవేత్తలంటున్నారు.
* స్థానికసంస్థల్లో స్త్రీలకు కల్పించిన రిజర్వేషన్ల ఫలాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. చట్టసభల్లో రిజర్వేషన్లతో ఈ అభివృద్ధి శాసనసభలకూ, పార్లమెంటుకూ విస్తరిస్తుంది.

రిజర్వేషన్ల వల్ల ఏం ఉపయోగం ఉంటుంది? ఇప్పడున్న మహిళా నేతల్లో భర్తను కాదని, తండ్రిని కాదని స్వతంత్రంగా పని చేస్తున్న వారెందరు అన్న విమర్శలున్నాయి ఏ మార్పూ ఆకాశం నుంచి హఠాత్తుగా మీదపడదు. చట్ట సభల్లో ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లే దీనికి స్పష్టమైన ఉదాహరణ. అవి మొదలైన కొత్తలో భూస్వాములు, పెత్తందార్లే డమ్మీ అభ్యర్థులను గెలిపించి అధికారం తాము అనుభవించేవారు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా లేదు. విద్యావంతులు, స్వంత హక్కుల గురించి అవగాహన ఉన్న వాళ్లే ఎస్సీ,ఎస్టీ స్థానాల్లో ఇప్పుడు ఎన్నికవుతున్నారు. మహిళల విషయంలోనూ ఇదే మార్పు క్రమంగా ముందుకొస్తుంది.

మహిళల కోసం మరిన్ని చట్టాలు కార్యరూపం దాలుస్తాయి. ఇప్పటికే అమల్లో ఉన్న చట్టాలు : ప్రసవానంతర ప్రయోజనాల చట్టం-1961, వరకట్న నిషేధచట్టం -1961, అసభ్య నిరోధక చట్టం -1986, సతీ నిరోధక చట్టం -1987, గృహహింస నిరోధక చట్టం -2005, బాల్యవివాహాల నిరోధక చట్టం - 1929, ప్రత్యేక వివాహ చట్టం-1954, స్థానికసంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ 73,74 రాజ్యాంగ సవరణలు - 1993, ఫ్యామిలీకోర్టు చట్టం - 1984, భారత వారసత్వ చట్టం - 1956 (2005లో సవరణ), గర్భవిచిత్తి అనుమతి చట్టం-1971, విడాకుల చట్టం - 1969, అపహరణల నిరోధక చట్టం- 1956.

## సమస్యల పరిష్కారం

చట్ట సభల్లో మహిళలకు 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు క్రమంగా సమసిపోతాయి. ప్రస్తుతం అనేక సమస్యలతో మహిళలు సతమతమవుతున్నారు. ఈ సమస్యల మూలంగా మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా, ఆరోగ్యపరంగా కృంగిపోవాల్సి వస్తోంది. మహిళా బిల్లుకు మోక్షం లభించేందుకే సుదీర్ఘకాలం పట్టింది. మహిళలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. మహిళలకు అధికారం లభిస్తే ఇప్పటి వరకు వారిని సతమతం చేస్తున్న సమస్యలు ఇట్టే పరిష్కారం అయిపోతాయనడంలో సందేహం లేదు.

నేడు ఎదురౌతున్న సమస్యల్లో ప్రధానమైంది అక్షరాస్యత. మహిళల్లో నిరక్షరాస్యతా శాతం ఎక్కువగా ఉంది. ఇది అత్యంత ప్రధానమైన అంశం. ఏ కుటుంబంలో మహిళలు విద్యావంతులై ఉంటారో ఆ కుటుంబం పరిస్థితి చాలా చక్కగా ఉంటుంది. మహిళల పట్ల నేరాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. వరకట్నం, గృహ హింస తదితర అంశాల్లో ఇప్పటి వరకు ఉన్న చట్టాలు సక్రమంగా అమలు కాకపోవడంతో, ఈ చట్టాల వల్ల ఆశించిన ఫలితాలు లభించలేదు. చట్టసభల్లో మహిళల సంఖ్య పెరగడం వల్ల ఇక అలాంటి పరిస్థితి ఉండదు. చట్టాలను అమలు చేసే యంత్రాంగంపై పరిపాలనా పరంగా తీవ్రమైన వత్తిడి తీసుకువచ్చి, వాటిని సమర్థంగా అమలులోకి తీసుకురావచ్చు. వైద్య సౌకర్యాలను మరింత మెరుగు పరుచుకోవచ్చు.

స్త్రీలల్లో పౌష్టికాహారం మరో పెద్ద సమస్య. పాఠశాల స్థాయి నుండే బాలికలు పౌష్టికాహార లోపంతో సతమతమవుతున్నారు. ప్రస్తుత పౌష్టికాహారం కల్పన కార్యక్రమాన్ని మరింత నాణ్యతగా మార్చుకోవచ్చు. ప్రస్తుతం చట్టసభలైన లోక్‌సభ, శాసనసభలకు పోటీ చేసేందుకు మహిళలకు టిక్కెట్లు లభించడం అత్యంత కష్టంగా ఉంటోంది. తప్పదంటేనే ఇప్పటి వరకు పోటీ చేసేందుకు టిక్కెట్లు ఇస్తున్నారు. మహిళా బిల్లు రావడం వల్ల తప్పనిసరిగా 33.33 శాతం సీట్లు మహిళలకు కేటాయించక తప్పదు. సమర్థులైన మహిళలు ఉన్న చోట్ల ఇంతకు మించి మహిళలు పోటీ చేసేందుకు చట్టసభల్లో మరిన్ని ఎక్కువ స్థానాల్లో మహిళలు కూర్చునేందుకు వీలవుతుంది. మహిళల ప్రాతినిధ్యం ఎక్కువగా వుంటే వారి సమస్యలపై చట్టసభల్లో చర్చకు కూడా అదే విధంగా అవకాశం లభిస్తుంది. ఈ సమస్యలను పరిష్కరించుకునేందుకు, అందుకు అనుగుణంగా చట్టాలు రూపొందించేందుకు, అమలు చేసేందుకు, బడ్జెట్ కేటాయింపులు

అధికం చేసుకునేందుకు వీలు కలుగుతుంది. స్థానిక సంస్థల్లో మహిళలు తమ సత్తా ఏమిటో చాటుకున్నారు. చట్టసభల్లోనూ సత్తా చూపించగల ుగుతారు.

## సమర్థత పెరుగుతుంది

చట్టసభల్లో మహిళలకు 1/3 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల ఈ సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. మన శాసనసభలో 98 వరకూ మంది మహిళలకు అవకాశం లభిస్తుంది. లోక్‌సభలో 180 మందికి అవకాశం లభిస్తుంది. ఇంత పెద్ద సంఖ్యలో మహిళలకు ప్రాతినిధ్యం లభించడం ఆషామాషీ కాదు. మహిళలు సమర్థవంతంగా పనిచేయగల ుగుతారని గృహాల్లో నిరూపిస్తూనే ఉన్నారు. ఇదే సూత్రం చట్ట సభలకూ వర్తిస్తుంది. మహిళల రిజర్వేషన్ల వల్ల లింగ వివక్షత తొలిగిపోతుంది. ఇప్పుడు ఎన్నికల్లో మగవారితో మహిళలు పోటీ చేయడం కాస్త ఇబ్బందిగా ఉంది. పోటీలో ఉండే మగవారు కండబలం చూపిస్తున్నారు. హింసకు పాల్పడుతున్నారు. మానవవనరులను ఎక్కువ వాడుకుంటున్నారు. వీటిని సహజంగానే స్త్రీలు తట్టుకోలేకపోతున్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఎక్కువగా పనిచేయడం సర్వసాధారణమైపోయింది. ఎన్నికల్లో మహిళలతో పోటీ పడే చోట్ల పోటీలో ాండే మగవారు తమ ప్రతిష్టకోసం డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. ఇదే సమయంలో పోటీలో ఉండే మహిళలు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేయలేకపోతున్నారు. ఇద్దరూ సమాన స్థాయిలో ాండక పోవడం వల్ల ఈ ప్రభావం ఎన్నికల ఫలితాలపై పడుతుంది. మహిళా రిజర్వేషన్లు అమలులోకి వస్తే మహిళల మధ్యనే పోటీ ాంటుంది కాబట్టి, లింగ వివక్ష సమస్య ఉండదు.

ప్రస్తుతం మహిళల పట్ల నేరాలు అత్యధికంగా కొనసాగుతున్నాయి. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం వల్ల సామాజిక వ్యతిరేక శక్తులను భయం పట్టుకుంటుంది. దాంతో నేరాలు తగ్గుతాయనడంలో సందేహం లేదు. చట్టసభల్లో మహిళల సంఖ్య పెరగడం వల్ల అందుకు అనుగుణంగా మంత్రి వర్గంలో కూడా మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుంది. దాంతో ఎక్కువ శాఖలపై పట్టు లభిస్తుంది. దాంతో పరిపాలన సజావుగా సాగుతుంది. సామాజిక సమస్యను మగవారైతే మెదడుతో మాత్రమే ఆలోచిస్తారు. అదే మహిళా ప్రతినిధులైతే మానవత్వం కోణంలో హృదయంతో ఆలోచిస్తారు. దాంతో సమస్యల పరిష్కారంలో మానవత్వం పరిమళిస్తుంది. వివిధ సమస్యలపై మహిళలకు ాండే అవగాహన మగవారికి ఉండదు. ఇందులో సందేహం లేదు. కుటుంబాన్ని ఎంతో సమర్థతగా నిర్వహిస్తూ వస్తున్న మహిళలు ఇక చట్టసభల్లో కూడా తమ సమర్థతను చాటుతా రనడంలో సందేహం లేదు.

అక్షరాస్యత, ఆరోగ్యం స్వేచ్ఛ... ఇలా ఏ ప్రాతిపదికన చూసినా ఈ దేశంలో స్త్రీలు ఎంతమేర వెనకబడి ఉన్నారో నేడు కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఈ పరిస్థితుల్లో ఏదో స్థాయిలో నిర్ణయాలు తీసుకొనే అధికారం దక్కడంతో పాటు, చట్టసభల్లో నిర్దిష్ట వాటా దఖలు పడటం -సామాజికంగా మహిళల గుర్తింపునూ, గౌరవాన్నీ ఇనుమడింపజేస్తుంది. పంచాయతీలు, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లను కల్పించడం వల్ల గ్రామీణ ప్రాంతాల మహిళల దృక్పథంలో వచ్చిన గుణాత్మక మార్పే ఇందుకు నిదర్శనం. బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్నత వర్గ మహిళల స్థాయిలో కాకపోయినా వెనుకబడిన కులాలకు చెందిన స్త్రీలూ స్థానిక రాజకీయాల్లో చురుగ్గా పురోగమిస్తుండటం ఆహ్వానించదగిన పరిణామం. చట్టం వల్ల ఒనగూడే ప్రయోజనాలను అట్టడుగు వర్గాలకు చేరువు చేయడమే ఎవరి లక్ష్యమైనా కావాలి కాబట్టి కోటాలో కోటా వాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించడమే సబబు.

ఐరోపా సమాజాలతో పోలిస్తే భారత్‌ది భిన్నమైన నేపథ్యం. మన దేశ చరిత్రను పరికిస్తే పితృస్వామ్య ఫ్యూడల్ కుటుంబ వ్యవస్థ సర్వం సహా విస్తరించి కనిపిస్తుంది. స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రతిష్ఠించి దేశ ప్రజలందరికీ, సమాన హక్కులు వచ్చేశాయన్నారు. కానీ, ఆ పేరిట దఖలు పడింది మాత్రం కొందరికి అధికారం మరి కొందరికి ఊడిగం. ఇంకొందరికి దారిద్ర్యం. మొన్న మొన్నటివరకూ

### వివిధ దేశాల్లో మహిళా ప్రాతినిధ్యం

ప్రపంచ దేశాల్లోని చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం ఎక్కడ ఎంత? లెక్కలు తీసి చూస్తే కాస్త వింతగా అనిపించకపోదు. నమ్మశక్యంకూడా కాకపోవచ్చు. ఎందుకంటే, ప్రపంచానికి పెద్దన్నగా, ప్రజాస్వామిక విలువలు వల్లించే ఆమెరికా గానీ, అమెరికా అనుంగు సహచరులైన బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా తదితర సుసంపన్న, సుభిక్ష దేశాలు గానీ, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడంతో తొలి పది స్థానాలలో మచ్చుకైనా లేవు మరి. ఇక అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన మన భారతదేశానికి ఈ జాబితాలో నూటికొక్క స్థానమే తక్కువ. నిజానికి మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తున్న దేశాల్లో వెనుకబడ్డ దేశాలే ముందంజలో ఉన్నాయి.

చీకటి ఖండంలోని వెనుకబడిన దేశాల్లో ఒకటైన రువాండా ఈ జాబితాలో తొలి స్థానంలో నిలుస్తుండటమే ఇందుకు నిదర్శనం. మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తున్న సంపన్న దేశాల్లో 'నార్డిక్' దేశాలైన నార్వే, స్వీడన్, ఫిన్లాండ్ వంటివి ఎంతో నయం. ఇవి తొలి పదిస్థానాల్లోనూ చోటు పొందాయి. ఈ జాబితాలో బ్రిటన్ 62, అమెరికా 74 స్థానాల్లో ఉన్నాయి. వీటికంటే మన పొరుగు దేశాలైన ఆఫ్ఘాన్ (32వ స్థానం), పాకిస్థాన్ (49 వ స్థానం), చైనా (55వ స్థానం) వంటి దేశాలే కాస్తనయంగా ఉన్నాయి. భారత్ వీటికంటే చాలా వెనుకబడి 99వ స్థానంలో నిలుస్తోంది.

#### మహిళలకు దిగువ సభల్లో అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తున్న తొలి పది దేశాలు

**రువాండా- 56.3 శాతం, స్వీడన్ - 46.4 శాతం, దక్షిణాఫ్రికా -44.5 శాతం; క్యూబా- 43.2 శాతం; ఐస్‌లాండ్ -42.9 శాతం, నెదర్లాండ్స్- 42 శాతం, ఫిన్లాండ్స్- 40 శాతం; నార్వే- 39.6 శాతం, మొజాంబిక్- 39.2 శాతం, అంగోలా- 38.6 శాతం.**

చట్టసభల్లో దళిత, గిరిజన వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తుండగా, మహిళలకు ప్రత్యేకంగా ఎందుకు కోటా? అనేది పలువురి ప్రశ్న. కోటా ఎందుకంటే వారికి అధికారంలో సముచితమైన వాటా లేదు కనుక. అధికారంలో సముచితమైన వాటా లేనందునే దళిత, గిరిజనులకు ప్రభుత్వం చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పిస్తోంది. 'ఆకాశంలో సగం... అనంత కోటి నక్షత్రాల్లో సగం' అయిన మహిళలకు మన పార్లమెంటు దిగువసభలో ప్రస్తుతం లభిస్తున్న ప్రాతినిధ్యం పట్టుమని పదిశాతం పైచిలుకు మాత్రమే. కచ్చితంగా చెప్పాలంటే, 10.8 శాతం.

లోక్‌సభలోని మొత్తం 545 స్థానాలలో, మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నవి 59 స్థానాలే. ఇలాంటి పరిస్థితిలో మహిళలకు అధికారంలో సరైన వాటా ఇవ్వాలంటే, వారికి కోటా కల్పించక తప్పదు. వెనుకబడ్డ ఉగాండా సైతం మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేస్తోంది. ాగాండాలోని మొత్తం 39 జిలాల్లో ఒక్కో జిల్లా నుంచి ఒక్కో స్థానాన్ని మహిళలకు కేటాయించారు. అర్జెంటీనా మహిళలకు చట్టసభల్లో 30 శాతం రిజర్వేషన్ కేటాయించింది. 'నార్డిక్' దేశాలు (డెన్మార్క్, ఫిన్లాండ్, నార్వే, స్వీడన్, ఐస్‌లాండ్) 40 శాతం వరకు మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి.

## ప్రపంచ వ్యాప్తంగా ఇదే నినాదం

నేడు మహిళా సాధికారత అనేది ప్రపంచం మొత్తం అర్థం చేసుకుంటున్న, ఆహ్వానిస్తున్న పరిణామం. 1995 నాటికల్లా ప్రపంచంలోని పార్లమెంట్లలో కనీసం 30 శాతం మహిళా సభ్యులు ఉండాలని ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలి ఏనాడో పిలుపునిచ్చింది. కానీ ప్రపంచం మొత్తం పార్లమెంట్లలో మహిళలు సాధించుకున్న స్థానాలు కేవలం 18 శాతమని ఐక్యరాజ్యసమితి రెండేళ్ల క్రితం ఒక సందర్భంలో పేర్కొన్నది. 1995-2008 మధ్య కాలంలో వచ్చిన మార్పుల ను బట్టి చూస్తే, ఈ పెరుగుదల 60 శాతమని అర్థం చేసుకోవచ్చు. 54 దేశాల పార్లమెంట్లకు ఎన్నికైన సభ్యుల వివరాలు చూసిన తరువాత ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ 1995లో 11.3 శాతం ఉన్న మహిళా ప్రాతినిధ్యం, 2008 నాటికి 18.3 శాతానికి పెరిగినట్లు తేల్చింది. ఏమైనా దేశ అత్యున్నత శాసన నిర్మాణ సభలలో పురుషులతో స్త్రీలు కూడా సమహోదా పొందాలంటే ఇంకా చాలా సమయం పడుతుందని యూనియన్ ఒక నివేదికలో వెల్లడించింది.

అంటే రాజకీయాలలో మహిళల ప్రవేశానికి ఇప్పటికీ ఎన్ని అడ్డంకులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అయినా అత్యున్నత శాసన నిర్మాణ వ్యవస్థలలో మహిళలకు సమహోదా ఇచ్చే విషయంలో వస్తున్న మార్పు మాత్రం విప్లవాత్మకమేననిపిస్తుంది. ఆఫ్రికాలో నిరంతరం సంఘర్షణలతో మనుగడ సాగించే రువాండా కూడా ఈ విషయంలో ముందంజ వేసింది. అక్కడ 50 శాతం స్థానాలు స్త్రీలకు కేటాయించారు. 1992 తరువాత మళ్లీ ఇన్నాళ్లకు (2008లో) అంగోలాలో ఎన్నికలు జరిగినా 37 శాతం మహిళలు పార్లమెంటుకు ఎన్నిక కాగలిగారు. మొజాంబిక్, దక్షిణాఫ్రికా, నమీబియా, టాంజానియా దేశాలు 25 శాతం మహిళా సభ్యులను ఎన్నుకున్నాయి. లాటిన్ అమెరికాలోని క్యూబా, గ్రెనెడా కూడా చాలా పురోగతి సాధించాయి. అమెరికాలో కూడా ఎగువ, దిగువ సభలలో సగటున పదిహేడు శాతం మహిళలకు చోటు లభించింది. అయినా అమెరికా మహిళలకు దక్కిన ఈ ప్రాతినిధ్యం ప్రపంచ పార్లమెంటులలో కన్పించే సగటు మహిళా ప్రాతినిధ్యం కంటే తక్కువే.

ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ నివేదికలో ఇంకా కొన్ని కీలకాంశాలు కూడా ఉన్నాయి. స్వీడన్, ఫిన్లాండ్, నెదర్లాండ్స్, ఐరోపాలు మహిళలకు చట్టసభలలో స్థానం ఇచ్చిన తొలితరం దేశాలుగా పేరుపడ్డాయి. బేలారస్, స్పెయిన్, మేసిడోనియా, మొనాకో, ఫ్రాన్స్ ఎగువసభ ఒక పద్ధతి ప్రకారం మహిళా ప్రాధాన్యాన్ని నిలబెట్టుకుంటున్నాయి. కానీ రుమేనియా, మాల్టా, సెర్బియాలలో మాత్రం మహిళా ప్రాధాన్యం తగ్గుతోంది. అయితే గడచిన పదిహేను సంవత్సరాల ుగా ఆసియా మాత్రం ఈ విషయంలో బాగా వెనుకబడింది. ఇక్కడి దేశాలలో సగటున 17.8 శాతం మాత్రమే మహిళలు పార్లమెంట్లలో అడుగుపెడుతున్నారు. మన పొరుగున ఉన్న నేపాల్ పార్లమెంటులో 32.8 శాతం స్థానాలను మహిళలు గెలుచుకున్నారు. ఇది గరిష్ట సంఖ్య కాగా, కనిష్టంగా ఇరాన్ పార్లమెంటు కేవలం 2.8 శాతం మహిళా సభ్యులకు చోటు ఇచ్చింది. మొత్తం అరబ్ పార్లమెంటులో మహిళలకు దక్కిన స్థానాలు 9 శాతం. భారత్‌కు అటు ఇటు ఉన్న దేశాలు పాకిస్థాన్, బంగ్లాలు కూడా అంతో ఇంతో పురోగతి సాధించాయి. పాకిస్థాన్‌లో 22 శాతం మహిళలు, బంగ్లాలో 14 శాతం మహిళలు పార్లమెంటులో స్థానం సంపాదించారు.

భారత పార్లమెంటులో మహిళలకు లభించిన స్థానాల శాతం స్థిరంగా లేదు. 1952 నాటి తొలి లోక్‌సభలో 4.4 శాతం (మొత్తం 499 స్థానాలలో 22 మహిళలు గెలిచారు), 2009 నాటి పదిహేనవ సభలో 10.1 శాతం (543 స్థానాలలో 59 మంది మహిళలు ఉన్నారు) వారికి లభించాయి. రాజ్యసభలో 1952-2002 మధ్య గణాంకాలు చూస్తే మొత్తం 160 మంది మహిళలకి సభ్యత్వం లభించిన సంగతి గమనించవచ్చు. ప్రస్తుతం పెద్దల సభలో మహిళల సంఖ్య 25. అయితే ఒక్క 1980 సంవత్సరంలోనే అత్యధికంగా 29 మంది రాజ్యసభకు వచ్చారు.

1995 నాటికి ప్రపంచ దేశాల పార్లమెంట్లలో 30 శాతం మహిళా సభ్యులు ఉండాలని ఐక్యరాజ్యసమితి పిలుపునివ్వడానికి ముందే అలాంటి యోచన చేసిన ఘనత మన రాజీవ్‌గాంధీకి దక్కుతుంది. పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంటు వరకు మహిళా ప్రాతినిధ్యానికి చట్టబద్ధత కల్పించాలన్న ఆలోచన తొలిసారిగా రాజీవ్ హయాంలోనే వచ్చింది. 1988లో నేషనల్ పర్స్పెక్టివ్ ప్లాన్ ఫర్ ఉమెన్ సంస్థ ప్రజలు ఎన్నుకునే అన్ని వ్యవస్థలలోను మహిళలకు 30 శాతం రిజర్వేషన్ కల్పించాలని సూచించింది. అక్కడ నుంచి వాస్తవంగా భారతదేశంలో మహిళా రిజర్వేషన్ ప్రస్థానం ప్రారంభమైంది. 1993 స్థానిక సంస్థలలో మహిళలకు రిజర్వేషన్ కల్పించడానికి ఉద్దేశించినవే 73, 74 రాజ్యాంగ సవరణలు. కారణాలు ఏమైనా రాజకీయ స్థిరత్వం ఉన్న కాలంలో ఈ బిల్లు రూపు దాల్చలేదు. అప్పుడు వచ్చిన యోచన సంకీర్ణ ప్రభుత్వాల యుగంలో కార్యరూపం దాల్చవలసి వచ్చింది. 1995లో అత్యున్నత చట్టసభ పార్లమెంటుకు కూడా దీనిని విస్తరించాలన్న ఆలోచన వచ్చింది. 1996లో మొదటిసారి హెచ్‌డీ దేవగౌడ నాయకత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశ పెట్టడానికి యత్నించి విఫలమైంది. ఇప్పుడు ఆయనే ఈ బిల్లును యథాతథంగా ప్రవేశపెట్టడానికి వ్యతిరేకమని ప్రకటించారు. ఆయన కూడా ప్రత్యేక కోటా ఉండాలని కోరుతున్నారు. 1998లో మరోసారి జరిగిన ప్రయత్నం కూడా అలాగే విఫలమైంది. తరువాత యూపీఏ ప్రభుత్వం 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను తన కనీస ఉమ్మడి ప్రణాళికలో చేర్చింది. 2008లో మరోసారి పార్లమెంటులో ప్రవేశపెట్టే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు.

---

మన ప్రజాస్వామ్యంలో నిజానికి మహిళలకు దక్కింది ఊడిగం చేసే స్థానం. ఈ పరిస్థితుల్లో చట్టం కట్టుబాటు పెట్టకుండా.. మహిళల రాజకీయోద్ధరణను పార్టీలకు అప్పగిస్తే జరిగేది అన్యాయమే. గతానుభవాలూ ఇదే విషయాన్ని నిరూపిస్తున్నాయి. తాము ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవడానికి అవకాశంలేని స్థానాల్లో మహిళలను నిలిపి చట్టసభల్లో వారి ప్రవేశాన్ని విజయవంతంగా అడ్డుకొనే చాణ్యక్యాన్ని పార్టీలు ప్రదర్శించబోవన్న పూచీ ఎవరిస్తారు?

అపారమైన సృజనాత్మక శక్తి సామర్థ్యాలు ఉండీ కుంగిపోయిన ఒకజాతి మనోధైర్యాన్ని నిలబెట్టేందుకు. సరికొత్త నైతిక శక్తితో అది పురోగమించేందుకు ఇప్పుడు ఒక అండ కావాలి. వంటింటిని అలంకరించిన పరికరంలా మారిన జాతి గొంతు పెగుల్చుకొని సొంత అస్తిత్వాన్ని చాటుకొనే క్రమంలో ఇప్పుడు ఒక చేయూత కావాలి.

సంకెళ్లు తెగతెంచుకునే పోరాటంలో... ఇప్పుడు ఒక దన్ను కావాలి. అవినీతి పెరుగుతుందనీ, పాలన దక్షత కొరవడుతుందనీ, చేత కాదనీ, చేవ లేదనీ, ఇంకా ఇలాంటి కుంటి సాకులతో మోకాలడ్డి మహిళా మహోదయాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే భావి తరాలు క్షమించవు. ఒకజాతిగా మన దృక్పథంలో, మన విశ్వాసాల్లో, మన జీవితవిధానంలో ఏ లోపమూ లేదని, ఎలాంటి దౌర్బల్యమూ లేదని, ఏ మూలా కర్కశత్వం దాగిలేదని నిరూపించుకొనే అరుదైన సందర్భాన్ని వృథాపోనిస్తే అంతకుమించిన చారిత్రక తప్పిదం మరొకటి ఉండదు. సాధ్యమైనంతవరకూ విమర్శలకు, లోపాలకు అతీతంగా మహిళా బిల్లును తీర్చిదిద్దడం ద్వారా సర్కారూ ఆ దిశగా తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. దేశ జనాభాలో సగం మందికి సాధికారతను ప్రసాదించే ఈ ప్రస్థానం వంద రోజుల్లో పూర్తయ్యేది కాకపోవచ్చు. పదేళ్లలోనూ సంపూర్ణం కాకపోవచ్చు మన జీవిత కాలంలోనూ ఆ స్వప్నాన్ని మనం చూడలేకపోవచ్చు. కానీ ఆ దిశగా ఇప్పుడు మొదటి అడుగు మాత్రం పడే తీరాలి. ☆



# మన గ్రామం - మన మండల పరిషత్తు

**73వ రాజ్యాంగ సవరణ ద్వారా మన రాజ్యాంగంలో మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థ పొందు పరచబడింది. భారత రాజ్యాంగంలోని 243 బి అధికరణ పంచాయితీల ఏర్పాటు గురించి పేర్కొంటుంది. దీని ప్రకారం ప్రతి రాష్ట్రంలోనూ పంచాయితీలను గ్రామ, మధ్యంతర, జిల్లా స్థాయిల్లో ఏర్పాటు చేయాలని చెప్పబడింది.**

**గ్రామస్థాయికి – జిల్లా స్థాయికి మధ్యంతర వ్యవస్థగా మండల పరిషత్‌ల ఏర్పాటు, వాటికి గల అధికారాలు, వాటి నిర్వాహణకు సంబంధించిన అంశాలను ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994 లోని 3వ భాగంలో (పార్టు III) పేర్కొన్నారు.**

**అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ఎన్నికైన సభ్యుడు లేదా కోఆప్టెడ్ సభ్యుడు తన పదవికి నిర్దేశించిన పద్ధతిలో రాజీనామా చేయవచ్చునని ఈ చట్టంలోని 157వ సెక్షనులో పేర్కొన్నారు.**

కలెక్టరు, మండల పరిషత్ పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీల సర్పంచులు, ఈ చట్టంలోని 177వ సెక్షను 3వ సబ్ సెక్షను క్లాజ్ (i) ప్రకారం అట్టి మండలం నుండి ఎన్నికైన జిల్లా పరిషత్ సభ్యుడు, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మండల పరిషత్ సమావేశాలకు శాశ్వత ఆహ్వానితులు. వారు అట్టి సమావేశాల్లో మాట్లాడటం, ఇతరత్రా పాల్గొనటం చేయవచ్చు గానీ ఈ సెక్షనును అనుసరించి ఓటు వేయరాదు.

మండల పరిషత్ అధ్యక్షుడు, సంప్రదింపులు కొరకు మండల పరిషత్తు పరిశీలనలో ఉన్న ఏదేని అంశం గురించి అనుభవం, ప్రత్యేక అవగాహన ఉండి ఏ రాజకీయ పార్టీ ఆఫీస్ బేరర్ కానటువంటి వ్యక్తిని మండల పరిషత్ సమావేశానికి ఆహ్వానించవచ్చునని ఈ చట్టంలోని 159వ సెక్షనులో పేర్కొన్నారు. అట్టి వ్యక్తి మాట్లాడే హక్కు కలిగి ఉండి, సమావేశంలో ఇతరత్రా పాలు పంచుకోవచ్చు. కానీ ఈ సెక్షనును అనుసరించి అట్టి మీటింగులో ఓటు వేయటానికి వీలు లేదు.

ఆ విధంగా హాజరైన వ్యక్తి నిర్దేశించిన విధంగా అలవెన్సులు తీసుకొనటానికి అర్హుడు.

ప్రతి మండల పరిషత్తు తన సమావేశాలను రూపొందించిన రూల్సు ప్రకారం జరపాలని ఈ చట్టంలోని 160 సెక్షనులో పేర్కొన్నారు.

మండల పరిషత్ అధికారాలను, విధులను ఈ చట్టంలోని 161వ సెక్షనులో పేర్కొన్నారు.

ఈ చట్టంలోని అంశాలకు లోబడి మండల పరిపాలనను మండల పరిషత్తు నిర్వహిస్తుంది. ప్రతి మండల పరిషత్తు తన పరిధిలోని ప్రజల్లో స్వయం సేవా (Self help) స్ఫూర్తిని, చొరవను, జీవన ప్రమాణాలు మెరుగు పర్చుకోవడంలో వారికి గల ఉత్సాహాన్ని ప్రేరేపించటానికి కృషి చేసి ఈ చట్టం ప్రకారం తనకు గల అన్ని అధికారాలను వినియోగించి, విధులను నిర్వహించి, ప్రభుత్వం ఇచ్చిన అన్ని ఇతర బాధ్యతలను నిర్వహించాలి. కానీ ఈ చట్టం ప్రకారం లేదా ఏదేని ఇతర చట్టం ప్రకారం అధ్యక్షునికి లేదా మండల పరిషత్తు అభివృద్ధి అధికారికి లేదా జిల్లా పరిషత్ లేదా ఏదేని ఇతర అథారిటీకి దాఖలు పరచబడిన అధికారాలను, విధులను నిర్వహించరాదు. మండల స్థాయిలో విధుల నిర్వహణను సమీక్షిస్తూ విస్తరణకు శక్తివంతంగా కృషి చేయాలి.

ప్రభుత్వ ముందస్తు ఆమోదంతో, నిర్దేశించిన షరతులకు లోబడి, ఈ చట్ట ప్రయోజనాలకు అవసరమైన డబ్బును అప్పు తీసుకొనవచ్చును.

ఈ చట్టం ప్రకారం తనకు బదలాయించబడిన జిల్లా బోర్డు విధులను, పన్నులు లేదా ఫీజు విధించటం వంటి వాటితో సహా నిర్వహించ వచ్చును.

ప్రతి మండల పరిషత్తు షెడ్యూలు – I లో పేర్కొనబడిన అంశాలకు సంబంధించి నిబంధనల ప్రకారం అప్పగించబడ్డ అధికారాలను, విధుల ను నిర్వహించాలి. షెడ్యూలు–IIలో పేర్కొనబడ్డ అధికారాలను, విధులను మండల పరిషత్తు నిర్వహించాలి.

రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్లో పేర్కొన్న ఈ అంశాలను వివరించి వాటినే పంచాయితీ రాజ్ చట్టం 1994 షెడ్యూలు–I పునర్లిఖించిన విషయాన్ని **స్థానిక పాలన** సెప్టెంబరు 2009 సంచికలోని 'మన గ్రామం– మన రాజ్యం' వ్యాసంలో పేర్కొనటం జరిగింది.

***షెడ్యూలు–II లో ఈ క్రింది అంశాలున్నాయి :***

***సముదాయక అభివృద్ధి:*** పంచాయితీలు, సహకార సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు ప్రజలతో కలసి సముదాయ అభివృద్ధికి కార్యక్రమాలను నిర్వహించటం.

*వ్యవసాయం :* వ్యవసాయ ఉత్పత్తిని అభివృద్ధి చేయటానికి అవసరమైన అన్ని చర్యలను చేపట్టటం, నిర్దిష్టంగా ః

(i) మేలు రకం విత్తనాల అభివృద్ధి (Multiplication) పంపిణీ;

(ii) ఎరువుల పంపిణీ;

(iii) మెరుగైన సాంకేతిక నైపుణ్యం, పద్ధతులు, ఆచరణ (Practice), మేలు రకం పరికరాల గురించి ప్రచారం;

(iv) సేంద్రీయ ఎరువులు (green menure), compositing of formy yard స్వయం సమృద్ధిని సాధించటం;

(v) మేలు రకం విత్తనాల అభివృద్ధి, పండ్లు, కూరగాయల వ్యవసాయాన్ని ప్రోత్సహించటం;

(vi) భూవినియోగం, భూమి సారము;

(vii) వ్యవసాయ అవసరాలకు అప్పులను ఏర్పాటు చేయటం;

(viii) సస్యరక్షణ (Plant protection) పద్దతుల్లో సహకరించటం, ప్రచారం చేయటం;

(ix) భూవినియోగం, భూమి సారం;

(x) మరింత ఎక్కువ ఎకరాలను నీటి సౌకర్యం క్రిందకు తేవటానికి పునరుద్ధరణ, బావుల త్రవ్వకం, ప్రైవేటు చెరువులను త్రవ్వటం, బాగు చేయటం, ప్రభుత్వ చిన్న నీటి పారుదల వనరుల ద్వారా కాలువల ద్వారా సరఫరాలను నిర్వహించుట;

(xi) వ్యవసాయ అవసరాలకు మరింత విద్యుత్తును వినియోగించటం;

(xii) బావుల త్రవ్వకం, filter points, గొట్టపు బావుల ద్వారా భూగర్భ జలాలను వినియోగించటం;

(xiii) చెట్లు నాటటం;

(xiv) గ్రామీణ అడవులను పెంచటం;

*పశు సంవర్ధక, మత్స్యసంపద*

(i) మేలు రకం సంతతి ఆంబోతులను ప్రవేశపెట్టడం, Scrub bullsను శక్తివంతం (Castrating) చేయడం ద్వారా పశుసంపదను అభివృద్ధి చేయడం;

(ii) మేలు రకం సంతతి పశువులను, గొర్రెలను, పందులను, కోళ్ళను ప్రవేశ పెట్టటం;




(iii) ప్రణాళికాబద్ధమైన రక్షణ ద్వారా అంటు వ్యాధులను అరికట్టటం;

(iv) మెరుగైన పశువుల మేతను, ఆహారాన్ని ప్రవేశపెట్టటం;

(v) కృత్రిమ గర్భధారణ కేంద్రాలను, ప్రథమ చికిత్సా కేంద్రాలను, చిన్న తరహా పశువైద్యశాలలను ఏర్పాటు చేయటం;

(vi) పాలు, draught కొరకు మెరుగైన పశువుల అవశ్యకత గురించి ప్రజలను విజ్ఞాన వంతులను చేయటం;

*ఆరోగ్యం గ్రామీణ పారిశుధ్యం*

(i) ఉన్న వైద్య, ఆరోగ్య సేవలను విస్తరింపజేయటం, వాటిని ప్రజలకు చేరువచేయటం;

(ii) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, ప్రశూతి కేంద్రాలను ఏర్పాటు చేయటం, నిర్వహించటం;

(iii) రక్షిత మంచినీటి సౌకర్యాలను ఏర్పాటు చేయటం;

(iv) ప్రణాళికా బద్ధమైన రోగనిరోధక చర్యలు ధృవపరచటం;

(v) అంటు వ్యాధుల నివారణ;

(vi) గ్రామ, గృహ డ్రైనేజీకి డ్రైన్‌లను, ఇంకుడు గుంటలను Soakage pits ఏర్పాటు చేయటం;

(vii) శానిటరీ పద్ధతిలో మరుగుదొడ్ల ఏర్పాటును, మానవ వ్యర్థాల వినియోగాన్ని ప్రోత్సహించటం;

(viii) పొగరాని పొయ్యిలను ప్రచారం చేయటం;

(ix) ప్రభుత్వ ఆసుపత్రులలో పనిని పర్యవేక్షించటం;

(x) అట్టి ఆసుపత్రుల అభివృద్ధి కొరకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచటం;

(xi) వైపరీత్యాల సమయంలో ప్రజలు, గ్రామ పంచాయితీల సహకారాన్ని తీసుకోవటం;

(xii) పర్యావరణ పారిశుధ్యం, (ఎ) న్యూట్రిషన్ (బి) ప్రశూతి, శిశు ఆరోగ్యం (సి) అంటు వ్యాధులు (డి) కుటుంబ నియంత్రణ గురించి ప్రచార కార్యక్రమం నిర్వహించటం;

(xiii) సంబంధిత జిల్లా అధికారుల సాంకేతిక అజమాయిషీ (Control) కు లోబడి ఆరోగ్య కార్యక్రమాలను అమలు జరుపటం.

*విద్య :* ప్రాథమిక, మౌలిక (basic) పాఠశాలల నిర్వహణ, విస్తరణ నిర్దిష్టంగా

(i) ప్రభుత్వ, taken over ఎయిడెడ్ ఎలిమెంటరీ, హయ్యర్ ఎలిమెంటరీ పాఠశాలల నిర్వహణ;

(ii) వయోజన విద్యా కేంద్రాలను, వయోజన అక్షరాస్యతా కేంద్రాలను ఏర్పాటు చేయటం;

(iii) ప్రజల పాత్రతో పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరచటం;

(iv) ప్రస్తుత ప్రాథమిక పాఠశాలలను basic schools గా మార్చటం;

(v) 14 సంవత్సరాలలోపు పిల్లలందరికీ విద్య నేర్పేందుకు అవసరమైన చర్యలను చేపట్టటం;

*సామాజిక విద్య :* ప్రజలలో నూతన దృక్పథాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, కష్టపడి పనిచేయటాన్ని, సముదాయ కార్యక్రమాలకు ప్రతిస్పందించటాన్ని పెంపొందించటం, నిర్దిష్టంగా;

(i) సమాచార, సముదాయ, ఆహ్లాదకర కేంద్రాలను ఏర్పరుచుట;(ii) యువజన సంఘాలను, మహిళా మండళ్ళను, రైతు క్లబ్బులను మొదలైన వాటిని ఏర్పాటు చేయటం;

(iii) గ్రంథాలయాలను ఏర్పాటు చేయటం, ప్రచారం చేయటం;

(iv) కాపలా నిర్వాహణ (Organization of watch and ward)

(v) శారీరక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించటం;

(vi) స్వచ్ఛంద పారిశుధ్య స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయటం;

(vii) గ్రామ సహాయకులకు శిక్షణ ఇవ్వటం, వారి సేవలను వినియోగించుకోవటం;

*కమ్యూనికేషన్లు :*

(i) గ్రామాల మధ్య రోడ్లను వేయించటం, వాటిని నిర్వహించటం;

(ii) గ్రామాల్లో ఫీడర్ రోడ్లు వేయటానికి వాటిని నిర్వహించటానికి అవసరమైన సహాయాన్ని అందించటం.

*సహకారం:* వివిధ రకాల పద్ధతుల్లో సహకార వ్యవస్థను వర్తింపచేయటం ద్వారా ప్రజాతంత్రయుతంగా ఆర్థికాభివృద్ధిని సాధించటం, నిర్దిష్టంగా –

(i) సాధ్యమైనంత ఎక్కువ కుటుంబాలకు సహకరించటానికి కోఆపరేటివ్ క్రెడిట్, పారిశ్రామిక, నీటి, వ్యవసాయ, బహుళ ప్రయోజన (Multipurpose) సొసైటీలను ఏర్పరచటం;

(ii) చిన్న మొత్తాల పొదుపును ప్రోత్సహించటం;

*కుటీర పరిశ్రమలు :* మెరుగైన ఉద్యోగ అవకాశాలను, తద్వారా జీవన ప్రమాణాలను పెంపొందించడానికి కుటీర, గ్రామ, చిన్న తరహా పరిశ్రమల ను అభివృద్ధి చేయటం నిర్దిష్టంగా:

(i) ఉత్పాదక, శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి, నిర్వహించటం;

(ii) చేతి వృత్తులు, ఇతర వృత్తిదారుల నైపుణ్యాన్ని పెంచటం;

(iii) మెరుగైన పరికరాలను ప్రచారం చేయటం;

(iv) ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమీషన్, అన్ని ఇతర భారతీయ బోర్డుల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేయబడిన కుటీర, గ్రామ, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి పథకాలను అమలు జరుపటం;

*స్త్రీ సంక్షేమం:* మహిళా శిశు సంక్షేమం కోసం ప్రత్యేకంగా రూపొందించిన పథకాలను అమలు జరుపటం, నిర్దిష్టంగా మహిళా శిశు సంక్షేమ కేంద్రాల ను, అక్షరాస్యతా కేంద్రాలను, హస్తకళలు, దుస్తుల తయారీ కేంద్రాలు, తదితర వాటిని ఏర్పచటం.

*సాంఘిక సంక్షేమం:*

(i) షెడ్యూలు తెగలు, షెడ్యూలు కులాలు, వెనుకబడిన తరగతుల ప్రయోజనం కోసం ప్రభుత్వ సబ్సీడీతో ఉన్న వసతి గృహాలను (హాస్టల్స్) ను నిర్వహించటం;

(ii) గ్రామీణ గృహ పథకాలను అమలు జరపటం;

(iii) వ్యాధిగ్రస్థులైన భిక్షకులను (beggers) పోషించటం, స్థిరనివాసం గానీ పని గానీ లేని వారిని(vagrancy) నియంత్రించటం;

(iv) స్వచ్ఛంద సాంఘిక సంక్షేమ సంస్థలను శక్తివంతం చేయటం, వాటి కార్యకలాపాలకు సమన్వయం చేయటం;

(v) సహనాన్ని, మధ్య నిషేధాన్ని (prohibition) ప్రచారం చేయటం;

(vi) అంటరాన్ని తనాన్ని నిర్మూలించటం;

*అత్యవసర సహాయం :* అగ్ని ప్రమాదాలు, వరదలు, అంటు వ్యాధులు, ఇతర విస్తృత ప్రభావంగల వైపరీత్యాలకు స్వచ్ఛంధ కృషి ద్వారా అత్యవసర సహాయాన్ని ఏర్పాటు చేయటం.

*గణాంకాల సేకరణ :* ప్రభుత్వం లేదా జిల్లా పరిషత్ లేదా మండల పరిషత్ అవసరమని భావించిన గణాంకాలను సేకరించి సమకూర్చటం;

*స్వయం సహాయక కార్యక్రమం:* ప్రజలకు సౌకర్యాలను కల్పించటానికి, పారిశుధ్యాన్ని మెరుగు పరచటానికి జీవన ప్రమాణాలను, ఆదాయాన్ని పెంచటానికి, ఉత్పాదకతను పెంచటానికి అనుగుణమైన కార్యక్రమాలను రూపొందించటం, అమలు జరుపటం;

*ట్రస్టులు :* మండల పరిషత్ నిధులు వర్తించే లక్ష్యాలను ముందుకు తీసుకు వెళ్ళేందుకు ట్రస్టులను నిర్వహించటం;

జిల్లా పరిషత్తు ముందస్తు ఆమోదంతో మండల పరిషత్తు మండలంలోని గ్రామపంచాయితీ నిధి నుండి కంట్రిబ్యూషన్స్‌ను విధించవచ్చును.

ప్రతి మండల పరిషత్తు ముందుగా ప్రభుత్వ ఆమోదం పొంది తన పరిధిలోని గ్రామ పంచాయితీ విధించిన పన్ను లేదా భూమి సెస్సు లేదా లోకల్ సెస్సుపై సర్‌ఛార్జిని విధించవచ్చును.

రెండు లేదా అంతకంటే ఎక్కువ గ్రామపంచాయితీలు బట్టలు ఉతకటం, స్నానం వంటి అవసరాలకు నీళ్ళను, త్రాగటానికి అవసరమైన రక్షిత మంచి నీరును సరఫరా చేయటానికి అవసరమైన వాటర్ వర్క్సును నిర్మించి నిర్వహించటానికి,

మండల పరిషత్ ఆమోదంతో అంగీకరించబడిన షరతులకు ఏదేని సంస్థ నిర్వహణను లేదా ఏదేని పనిని నిర్వహించటాన్ని మండల పరిషత్తుకు అప్పగించవచ్చునని ఈ చట్టంలోని 162వ సెక్షనులో పేర్కొన్నారు.

ఈ చట్టం ప్రకారం రూపొందించబడిన నిబంధనలను అనుసరించి రెండు లేదా అంతకంటే ఎక్కువ మండల పరిషత్తులు ఉమ్మడి ఆసుపత్రుల ను, శిశు సంక్షేమ కేంద్రాలను, అట్టి ఇతర రకాల సంస్థలను నిర్దేశించిన విధంగా ఏర్పాటు చేసి నిర్వహించవచ్చును.

మండల పరిషత్తు అభివృద్ధి అధికారి స్వాదీనంలో ఉన్న ఏదేని డాక్యుమెంటును సమర్పించమని మండల పరిషత్తు ఆదేశించవచ్చునని, అట్టి అధికారి, ప్రతి ఆదేశాన్ని అమలు జరపాలని ఈ చట్టంలోని 163వ సెక్షనులో పేర్కొన్నారు.

మండల పరిషత్తు తన పరిధిలోగల గ్రామ కార్యనిర్వాహణాధికారిని, అట్టి గ్రామానికి లేదా ఆస్థికి లేదా వ్యక్తికి సంబంధించిన సమాచారాన్ని సమర్పించమని ఈ చట్ట ప్రయోజనాల కొరకు అవసరమైనప్పుడు కోరవచ్చునని ఈ చట్టంలోని 164వ సెక్షనులో పేర్కొన్నారు.

*- వి.రఘు,* న్యాయవాది





# భారత రాజ్యాంగం-షెడ్యూలు తెగలు

మన వాడుక భాషలో గిరిజనులు, ఆదివాసీలు గా పిలువబడే వారు రాజ్యాంగ పరంగా షెడ్యూల్డు తెగలుగా పిలువబడుతారు. భారత రాజ్యాంగం షెడ్యూలు తెగల రక్షణ, అభివృద్ధికోసం ఎన్నో అంశాలను పొందు పరిచింది. మన దేశంలో 700 షెడ్యూలు తెగలు ఉన్నాయి. 2001 జనాభా లెక్కల ప్రకారం వీరి జనాభా 8.43 కోట్లు, దేశ జనాభాలో 8.12 శాతం.

భారత రాజ్యాంగంలోని 46 ఆర్టికల్ (ఆదేశిక సూత్రాలు) ప్రకారం షెడ్యూల్డు జాతులు, షెడ్యూల్డ్ తెగల విద్య, సామాజికాభివృద్ధి, అన్ని రకాలైన అన్యాయాలు, దోపిడీల నుంచి రక్షణ బాధ్యత రాజ్యంపై ఉంచబడింది. అసలు షెడ్యూల్డు తెగలను ఎవరు ప్రకటిస్తారు? వారిని ఎలాగ గుర్తిస్తారు? అనేది తెలుసుకోవలసిన విషయం. ఆర్టికల్ 342 (1) ప్రకారం, భారత రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌తో సంప్రదించిన తరువాత ఏదైనా తెగను కాని, దాని లోని ఉప తెగను కాని షెడ్యూల్డు తెగగా ప్రకటించవచ్చును. అయితే వారు నివశించే రాష్ట్రాల వరకే ప్రకటించే అధికారం ఉంది. షెడ్యూల్డు తెగలను గుర్తించేందుకు ఐదు నిర్ణయ ప్రమాణాలు ఉన్నాయి. అవి 1) బాగా పురాతన సంస్కృతి కలిగి ఉండడం, 2) ప్రత్యేక జీవన విధానం కలిగి ఉండడం 3) ఒకే ప్రాంతానికి పరిమితి అవటం 4) బయటి వారితో కలవడానికి ఇష్టపడకపోవటం 5) ఆర్థికంగా బాగా వెనుకబడి ఉండటం. అయితే రాష్ట్రపతి ప్రకటించిన లిస్టులోంచే ఏదైనా షెడ్యూలు తెగను లేక ఉపతెగను తొలగించేందుకు కాని, ఆ లిస్టులో కొత్తగా చేర్చేందుకు కాని పార్లమెంటుకు అధికారం ఉంది. అలాగే షెడ్యూల్డు తెగల సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలను షెడ్యూల్డు ప్రాంతాలుగా గుర్తించేందుకు కూడా అధికారం ఉంది. తదుపరి వాటి సరిహద్దులను మార్చేందుకు కూడా రాష్ట్రపతికి అధికారం ఉంది.



మనదేశంలో షెడ్యూల్డు తెగలు ఎక్కువగా నివశించే ప్రాంతాలు, 5వ షెడ్యూలు, ఆరవషెడ్యూలు ప్రాంతాలుగా ప్రకటించబడ్డాయి. దేశంలోని 9 రాష్ట్రాలలో అంటే ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, ఒరిస్సా,రాజస్థాన్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘఢ్, జార్ఖండ్ రాష్ట్రాలలో 5వషెడ్యూల్డు ప్రాంతాలు ఉన్నాయి. అలాగే ఈశాన్య ప్రాంతాలలో 6వషెడ్యూలు ప్రాంతాలు ఉన్నాయి.

మనరాష్ట్రంలో 35 షెడ్యూల్డు తెగలు ఉన్నాయి. వాటి జనాభా (2001)లో 50.24 లక్షలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి,



SthanikaPalanaTelApril_2010.pmd 2 3/27/2010, 4:32 PM





పశ్చిమగోదావరి, ఖమ్మం, వరంగల్లు, ఆదిలాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలలో ఈ షెడ్యూల్డు ప్రాంతాలు ఉన్నాయి. రాష్ట్ర షెడ్యూల్డు తెగల జనాభాలో 60 శాతం పైగా షెడ్యూలు తెగలలో 31 తెగలు షెడ్యూలు ప్రాంతాలలోనే నివశిస్తున్నారు. అందువల్ల షెడ్యూల్డ్ ప్రాంతాలలో రక్షణ, అభివృద్ధి కార్యక్రమాలను చాలా ముఖ్యమని భావించి, రాజ్యాంగంలో అయిదవ షెడ్యూలును ప్రత్యేకంగా పొందుపరిచారు.

అయిదవ షెడ్యూలు ప్రకారం ఆయా రాష్ట్ర గవర్నర్లకు ప్రత్యేక అధికారాలు ఉన్నాయి. 5(1) ప్రకారం పార్లమెంటుకాని, రాష్ట్రశాసన సభ ఆమోదించిన చట్టం షెడ్యూల్డు ప్రాంతాలలో పూర్తిగా కాని, పాక్షికంగా కాని, కొన్ని మార్పులతో కాని అమలు జరపాలని ఆదేశించవచ్చు. మనరాష్ట్రంలో షెడ్యూలు ప్రాంతాలలో ఉపాధ్యాయ పోస్టులు 100% స్థానిక గిరిజనులచే నింపాలని ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు ఈ అధికారాలతోనే ఇచ్చినదే. ఒక కేసులో, గవర్నరుకు ఈ అధికారాలు ఉన్నాయని హైకోర్టు వారు దృవీకరించారు. ఇలాగే అంగన్‌వాడి, నర్సులు, అటెండర్లు, డ్రైవర్లు, ఫారెస్టు గార్డు లాంటి చాలా ఉద్యోగాలు, షెడ్యూల్డు ప్రాంతంలోని కాలేజీల్లో 50శాతం సీట్లు స్థానిక షెడ్యూల్డు తెగలకే ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేయబడ్డాయి. షెడ్యూల్డు తెగలకు విద్యా సంస్థలందు, స్థానిక సంస్థలు, శాసనసభ, పార్లమెంటులోనూ జనాభా ప్రాతిపదికపై రిజర్వేషన్లు రాజ్యాంగంలో కొన్ని ప్రకరణలు ఉన్నాయి.



రాజ్యాంగం అయిదవ షెడ్యూలు ప్రకారం షెడ్యూలు ప్రాంతాలలో శాంతి, సుపరిపాలన నెలకొల్పే దిశలో కొత్త చట్టాలను కూడా రాష్ట్రపతి చేయవచ్చు. ముఖ్యంగా భూమి బదలాయింపు, వడ్డీ వ్యాపారంపై ఈ చట్టాలు చేయవచ్చు. అయితే గిరిజన సలహా మండలితో సంప్రదించి, రాష్ట్రపతి ఆమోద పొందితేనే కాని ఈ చట్టాలు చెల్లవు. మన రాష్ట్రంలో షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు చట్టం, 1959, దానికి 1970,1971,1978లోని సవరణలు, వడ్డీ వ్యాపారంపై చట్టం 1960, ఋణ విమోచనపై చట్టం, 1960 కూడా ఈ ప్రకరణ క్రింద ఇచ్చినదే. ఇలాగే ముట్టాదారి, మహల్ దారి లాంటి వ్యవస్థల రద్దు, రైతు వారీ వ్యవస్థ అమలు లాంటివి షెడ్యూల్డు ప్రాంతాలలో నెలకొల్పేందుకు 1969-1970లో రెగ్యులేషన్లు ఇవ్వబడ్డాయి.

పంచాయితీ రాజ్ చట్టం 1998లో సవరించి షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తించేలా చేసే చట్టంలో గ్రామ సభలకు చిన్నతరహా అటవీ ఉత్పత్తులపై అస్థిహక్కు, భూమి బదలాయింపు, గ్రామీణ మార్కెట్లు లాంటి వాటి యాజమాన్యానికి ఎన్నో హక్కులు కల్పించబడ్డాయి. అలాగే ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులైన వారికి పునరావాసం కల్పించే విషయంలో గ్రామసభను, మండళ్ళను సంప్రదించాలని ఉంది. అలాగే షెడ్యూలు ప్రాంతాలలో నివశించే షెడ్యూల్డు తెగలు, సంప్రదాయంగా ఈ ప్రాంతంలో నివశించే (75 ఏళ్ళకు పైగా)



SthanikaPalanaTelApril_2010.pmd 3 3/27/2010, 4:32 PM

ఇతర జాతులు వారి అటవీ హక్కులను గుర్తించే చట్టం, 2006 షెడ్యూలు ప్రాంతాలకే ప్రత్యేకంగా వర్తిస్తుంది.

షెడ్యూల్డు తెగలకు రిజర్వుచేసిన విద్య, ఉద్యోగావకావాలు కాజేసే ఉద్దేశంతో నకిలీ కుల సర్టిఫికెట్లుపొందిన గిరిజన నేతలను నిరోధించేందుకు 1993 ఒక చట్టం జారీ చేయబడింది. ఇది షెడ్యూలు ప్రాంతాలతో సహా రాష్ట్రం అంతకూ వర్తిస్తుంది.

షెడ్యూల్డు తెగలు, షెడ్యూల్డు ప్రాంతాల అభివృద్ధి బయటి జనాభా, బయటి ప్రాంతాలతో సమానంగా తీసుకువచ్చేందుకు ఆర్టికల్ 275 (1) ద్వారా ప్రత్యేకనిధి రాష్ట్రాలకు ప్రతి సంవత్సరం విడుదల చెయ్యబడుతుంది. ఇదేకాకుండా షెడ్యూల్డు తెగల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు, ప్రతి సంవత్సరం రాష్ట్రపతికి ఒక రిపోర్టు పంపేందుకు జాతీయ షెడ్యూల్డ్ తెగల కమీషన్ ఉంది.

కొత్త సి.ఆర్.పి.సి. 1973 లో అమలులోకి వచ్చింది కాని 1974లో గవర్నరు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తింపచేయలేదు. అయితే 2004 సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం కొత్త సి.ఆర్.పిసిను 2004 నుంచి షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తింపచేసింది. దానితో కోర్టులు కూడా వచ్చాయి.

***- డా॥ వి.ఎస్.వి.కె. శాస్త్రి***
సలహాదారు, ప్రచురణలు, అపార్డు









SthanikaPalanaTelApril_2010.pmd 4 3/27/2010, 4:32 PM

# నా మనసు నడిపే ముచ్చట కనరే...

శంకు

*'ఇచ్చుటలో వున్న హాయీ . . .వేరెచ్చటనూ లేనే లేదనీ . . .*
*లేటుగా తెలుసుకున్నాను ... నా లోటును దిద్దుకున్నానూ . . .'*

స్వర్గీయ గానలీల, మన ఘంటసాల వారి శ్రావ్యగళం నుంచి జాలువారుతున్న బాపు 'బుద్ధిమంతుడి' పాట ఎఫ్.ఎం. రేడియోలోంచి వినవస్తోంది. లంచ్‌టైమ్‌లో స్టాఫ్ క్యాంటీన్‌కొచ్చి, రెండు మసాలా దోశెలార్డరిచ్చిన సుదర్శనం-కేశవరావుల్ని ఆ పాట ఎక్కడెక్కడికో లాక్కెళ్ళిపోయింది. తీయటి గతాన్ని గుర్తు చేసుకుంటూ సుదర్శనం - "ఏం పాడాడు గురూ ! అంతకుమించి మన కవిగారు సాహిత్యాన్ని అదరకొట్టేశారు గదూ!" అన్నాడు, ఓ గుటక మంచినీళ్ళు తాగి, గ్లాసు కిందపెడుతూ.

"అవునవును ఆత్రేయ బాగా రాశాడు!" సమర్థించినట్టు అన్నాడు కేశవరావు.



"నీ బొంద - అది రాసింది ఆత్రేయ కాదు - ఆరుద్ర. ఐనా అది వింటుంటే ఇప్పుడు నీకేమనిపిస్తోంది. ఒక్కసారి ఆలోచించు - 'ఇచ్చుటలో వున్న హాయీ . . . వేరెచ్చటనూ లేనేలేదనీ !' - అంటే ఏవిటో గ్రహించావా?" గద్దించాడు సుదర్శనం.

"ఆహా - చక్కగానే అర్థమౌతోంది నాయనా! గ్రహిస్తోంది నువ్వే! పుచ్చుకొనుటలో నీకు హాయిగా వుందేమోగానీ - నెలనెలా నీకు చేబదుళ్ళిచ్చుకోడం నా వంతు, వాటిని గ్రహించడం నీ వంతుగా కొనసాగీ, నా బుర్ర బొప్పికట్టి, నా జేబులు చిరిగిపోయాక, ఆ 'ఇచ్చుటలో వున్న హాయేమిటో బాహానే తెలిసి వస్తోంది. బాబూ ! ఇప్పుడు నువ్వీ పాటని అడ్డం పెట్టుకొని మరోసారి టెండరు పెట్టాలనుకుంటే మాత్రం సస్సేమిరా నడవదు - సమ్జె!" అంటూ గుండె చెరువయ్యే ఏడుపు రేంజీలో జవాబిచ్చాడు కేశవరావు. విషయం అర్థం చేసుకున్న సుదర్శనానికి నవ్వాలో, ఏడవాలో తోచలేదు.

ఇంతలో సర్వర్ వేడివేడిగా రెండు మసాలా దోశెలు తెచ్చి వాళ్ళముందుంచాడు. సుదర్శనం ఓ గుటక మంచినీళ్ళు లాగించి "ఓరి అపార్థ సారథీ - అంత మంచి పాట వింటుంటే నీకు చేబదుళ్ళ భయం కమ్మేయడం, దాంతో 'హాయి' అనే పదానికి వున్న వేల్యూ తెలియకపోడం - వాటే పిటీ - అది నిజంగానే దౌర్భాగ్యం!" అంటూ సానుభూతి ప్రకటించాడు. అక్కడితో ఆగక - "ఐనా, ఇప్పుడు నీకా భయం అఖ్ఖర్లేదులే ! నన్నడిగితే - 'ఇచ్చుటలో వున్న హాయి' అంటే - ఎవరికైనా, ఏదైనా మనస్ఫూర్తిగా గిఫ్ట్‌నో లేదా డొనేషన్‌గానో ఇవ్వడంలో వుండే హాయిని గురించి - అని అర్థం చేసుకో - అంతేగానీ అప్పు ఇచ్చి చెయ్యి కాల్చుకోడంలో - అని కాదు!" అంటూ తన దోశెని మెత్తగా అందుకున్నాడు.

"హేవిటీ - గిఫ్ట్‌నివ్వడంలోనా? అంటే అసలెప్పుడు తిరిగిరాని అప్పుగానా? అదే - ఓ బాడ్ డెట్‌గా దేన్నయినా ఇవ్వడంలో 'హాయి'- 'ఆనందం' ఎలా వుంటాయో నాకస్సలు అర్థం కావడంలేదు!" అని అనేకసార్లు దెబ్బలు తిన్న రుణదాతగా కేశవరావు తన అమాయకత్వాన్ని చాటుకున్నాడు.

"అవున్లే - ఎందుకర్థమౌతుందీ ఎవడికైనా, ఏ సందర్భంలోనైనా పిసరంత ఓ గిఫ్ట్‌గా ఇచ్చి వుంటే గదా - అదేవిటో అర్థం కాడానికి!" అన్న సుదర్శనం ఒక్క క్షణం ఆగి సడన్‌గా ఏదో గుర్తొచ్చినవాడిలా-

"పోనీ ఓ పని చెయ్యి. నీకు గనక, నిజంగా ఆ 'హాయి' ఏమిటో తెలుసుకోవాలని సీరియస్‌గా వుంటే గనక ఎల్లుండి మన కొలీగ్

**హాస్య కథల పోటీ విభాగంలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ**

రామనాథం గాడికి నీ చేత్తో ఓ మంచి గిఫ్ట్ ఇచ్చి చూడు - అప్పుడు తెలుస్తుంది" అని ఓ ఉచిత సలహా ఇచ్చాడు.

దాంతో కాస్త అయోమయంలో పడ్డ కేశవరావు - "అవునూ మధ్యలో ఆ రామనాథం గాడెందుకూ? ఐనా, నేనిప్పుడు ఏదైనా వాడికెందుకివ్వాల్ట?" అంటూ సుదర్శానాన్ని నిలదీశాడు.

"వోర్నీ - అప్పుడే మర్చిపోయావా? నిన్న పొద్దున్నే గదా - వాడు మనందర్నీ కొత్తగా కొనుక్కున్న తన ఫ్లాట్ గృహప్రవేశానికి ఆహ్వానించిన విషయం గుర్తు లేదా?" అని, రాబోయే శుక్రవారం రామనాథం ఇంటికి తామందరూ విందు భోజనానికి వెళ్ళాల్సిన విషయం గుర్తు చేశాడు.

"అవునవును - ఇప్పుడు గుర్తొచ్చింది" అన్నాడు కేశవరావు సర్దుకుంటూ.

"అదీ - అదన్నమాట. ఆ సందర్భంగా వాడికి నువ్వో మాంచి గిఫ్ట్ కొనిచ్చావనుకో. ఆ తర్వాత దాన్ని వాడి కొత్త ఇంట్లో అలంకరించుకొని, ఆ విషయాన్ని పరమానందంతో వాడు నీకు చెప్తున్నప్పుడు ఆ 'హాయి' - అదే ఇచ్చుటలో వున్న ఆ 'హాయి' ఏమిటో నీకు బాగా అర్థమౌతుంది ! ట్రై వన్స్ !" అన్నాడు సుదర్శనం.

"నో నో - ఇవ్వకివ్వక ఆ రామనాథం గాడికా? వాడో పెద్ద యూజ్‌లెస్ ఫెలో ! లాస్ట్ టైమ్ మా చంటాడి 'బర్త్‌డే పార్టీకి తన పెళ్ళాం పిల్లల్తో, ఖాళీగా చేతులూపుకుంటూ వచ్చి, నాలుగు డిన్నర్ ప్లేట్లు ఉల్ఫాగా నాకేసి వెళ్ళిన ఆ వెధవకి నేను గిఫ్ట్ ఇవ్వడమంటే - నో ఛాన్స్ ! ఛస్తే ఇవ్వను!" తెగేసి చెప్పేశాడు కేశవరావు.

"అదే మరి! నువ్వన్నట్టు వాడుత్త యూజ్‌లెస్ ఫెలోనే ! నీకులాగే వాడిక్కూడా జీవితంలో రుచి చూడాల్సిన కొన్ని మధురానుభూతుల్ని పొందే జ్ఞానంగానీ, అవకాశంగానీ లేక వాడు అలా ఉండిపోయాడు ! కానీ, నీ విషయం అలా కాదు. నువ్వు చాలా యోగ్యుడవనీ, ఎదుటి వాణ్ణి సంస్కరించే గుణం, శక్తి కూడా నీలో వున్నాయని నా నమ్మకం. అది నిరూపించుకోడానికి నీకిదో మాంచి అవకాశం ! కాదనకు. అంతేకాదు - ఇప్పుడు నువ్వు వాడికో గిఫ్టిచ్చావనుకో - దాంతో వాడి మొహాన చెప్పుదెబ్బ కొట్టినంత ఎఫెక్ట్ కలిగి, దాని రిజల్టు నువ్వూహించిన దానికన్నా పదిరెట్లు అమోఘంగా వుండి తీరుతుంది. దీనికి నేను గ్యారంటీ కూడా ఇవ్వగలను" అంటూ తిరగబడ్డాడు సుదర్శనం.

ఇంక వాదించే ఓపిక నశించో, నిజంగానే సుదర్శనం చెప్పిన దానివల్ల తనలో కాస్త కుతూహలం ఉదయించో రామనాథానికి ఓ చిన్న గిఫ్టని కొనివ్వడానికి కేశవరావు కాస్త మొగ్గు చూపాడు. అదే తడవుగా, ఆ సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటి కెళ్తూ, సుదర్శనంతో పాటు మెయిన్ బజార్‌లో వున్న ఓ నాలుగైదు నావల్టీ గిఫ్ట్ షాపులు, హస్తకళల ఎంపోరియాలు, ఆఖరికి, ఏదైనా ఏభైరూపాయలకే, అని బోర్డు




తగిలించుకున్న చైనా సరుకుల దుకాణాలకీ వెళ్ళాడన్న మాటేగానీ దేన్నీ మనసుపెట్టి కొనలేకపోయాడు. ఐతే తను చూసిన వాటిలో తనకెక్కువ బాగా అనిపించిన ఓ ఐటమ్ గురించి ఇంటికెళ్లే దోవలో సుదర్శనంతో చర్చించాడు.

"ఇందాక ఆ కేరళ హాండిక్రాఫ్ట్స్ షాపులో చూశాం గుర్తుందా! ఆ వోణం బోటు బొమ్మ - అదేరా మూడడుగుల వెడల్పు, అడుగున్నర ఎత్తు వున్న నల్లటి సిల్క్‌క్లాత్ బ్యాగ్రౌండ్ మీద, అందంగా గ్రాస్‌తో డిజైన్ చేసిన వోణం బోటు బొమ్మ - పెద్దగా, అందంగా కనబళ్లేదూ! దాన్ని ఏ గదిలోనైనా, ఏ గోడకైనా అలంకరిస్తే అద్భుతంగా వుంటుంది గదా! ఐ థింక్ అది మంచి గిఫ్ట్ అవుతుందని నా కనిపిస్తోందిరా!" అన్నాడు కేశవరావు.

కానీ ఆ సాయంత్రం తాము చూసిన వాటన్నిటికన్నా అతి తక్కువ ధరకి, అదీ డిస్కౌంట్‌లో వచ్చే అతి తక్కువ ధరకి, కేవలం నలభై రూపాయలకే దొరుకుతున్న ఐటమ్ అదొక్కటే కావడం కేశవరావుని ప్రధానంగా ఆకర్షించిందన్న విషయం సుదర్శనం గ్రహించినా, అసలు ఆ మాత్రం ముందుకొస్తున్న అతని బుద్ధికి హర్షించి, అవునన్నాడు. కేశవరావు మొహాన నవ్వు మెరిసింది.

అనుకున్న ప్రకారం శుక్రవారం రానే వచ్చింది. కేశవరావు తన భార్యా పిల్లల్తో రామనాథం ఇంటికి వస్తూ, తనవెంట తళతళ మెరిసే, మెటాలిక్ రాపర్‌తో ప్యాక్ చేయించిన త్రీ బైటూ సైజు గిఫ్ట్ పాకెట్‌తో రామనాథం కొత్త ఇంట్లోకి అడుగు పెట్టడం, ఒక్క సుదర్శనాన్ని తప్ప, తక్కిన వార్నందర్నీ ఆనందాశ్చర్యాల్లో ముంచెత్తింది. పైకి ఎవరూ ఏమీ అనకపోయినా, వాళ్ళ ఎక్స్‌ప్రెషన్స్‌లో వెలిగిన వెలుగును కేశవరావు దంపతులు గమనించి 'ఇచ్చుటలో వున్న హాయి' ని కొంత పొందగలిగారు.

చివరికి సుదర్శనాన్ని ప్రత్యేకంగా దగ్గరికి పిలిచిన కేశవరావు, అతను చూస్తుండగా రామనాథానికి ఆ గిఫ్టినిస్తూ, చిరు గర్వంతో కన్నెగరేశాడు. సుదర్శనం నవ్వుకున్నాడు.

అందరి దృష్టినీ ఆకర్షించిన అంత పెద్ద గిఫ్ట్ పాకెట్‌ని అందుకున్న రామనాథం బోలెడు సంబరపడిపోతూ, తన చేతికందిన ఆ పాకెట్‌ని పక్కనున్న భార్య చేతికందిస్తూ, కేశవరావుని గాఢంగా తన గుండెల కి హత్తుకున్నాడు. 'చూశావా.. అదీ.!' అన్నట్టు సుదర్శనం చూసిన చూపును కేశవరావు గమనించి తృప్తిగా నవ్వాడు, ఐతే, అసలు కథ అక్కడ మొదలైంది.

అదెలాగంటారా ఆ సంఘటన జరిగి నెల తిరిగే లోపే కేశవరావు వాళ్ళ మేనేజరు కూతురిపెళ్ళి జరిగింది. అర్ధరాత్రి ముహూర్తం కావడం వల్ల ఆయన ఆ రోజు సాయంత్రమే ఓ త్రీస్టార్ హోటల్లో రిసెప్షన్ ఏర్పాటు చేస్తే, దానికి దాదాపు ఆఫీసు స్టాఫంతా కుటుంబాల్తో హాజరయ్యారు. ఐతే, తమకన్నా కాస్త ముందే వచ్చిన రామనాథం దంపతులు - కాబోయే నూతన వధూవరుల్ని ఆశీర్వదించే క్యూలో కనబడ్డం, నిజానికి తాము చాలా దూరంగా వున్నా - కేశవరావు దంపతులకి రామనాథం భార్య చేతిలో వున్న 'త్రీ బైటూ' గిఫ్ట్ పాక్ తళతళ మెరుస్తూ స్పష్టంగా కనబడ్డం చిత్రంగా జరిగింది.

"ఏవండీ. అది చూశారా! మీ ఫ్రెండు భార్య పట్టుకున్నది. వాళ్ళకి మన మిచ్చిన గిఫ్ట్‌పాకెట్టులా లేదూ!" అంటూ కేశవరావు భార్య అతని చొక్కా పట్టుకొని లాగుతూ అడిగింది. "అవును మమ్మీ - అది మనమిచ్చిందే - మన మిచ్చిందే!' అంటూ పిల్లలు అరవబోతుంటే - "ష్ - గట్టిగా అరవకండి వింటే బాగోదు!" అంటూ కేశవరావు వాళ్ళని వారించబోయాడు.

"ఏవిటండీ - మీరు వాళ్ళనంటారు! అసలు మీ ఫ్రెండ్ చేసిన పని మటుకు బావుందా? చాతనైతే అతన్ని నిలదీయండి!" అని తిరగబడ్డ భార్య భవానీకి ఏం చెప్పాలో అర్థంకాక అవాక్కయి పోయాడు కేశవరావు.

ఆ తదనంతరం, అంటే మరో అర్నెల్ల తర్వాత, సుదర్శనం కన్వేచేసిన 'బ్రేకింగ్ న్యూస్' కేశవరావుని బోల్తాపడేలా చేసింది, లంచ్ బ్రేక్‌లో కలిసినపుడు మాట్లాడుతూ "సుదర్శనం నీకీ విషయం తెలుసా? ఆ మధ్య రామనాథం గాడి గృహప్రవేశానికి నువ్విచ్చిన గిఫ్ట్‌పాకెట్ లాంటిదే మక్కికి మక్కీగా అలాంటిదే, నిన్న రాత్రి మా కాలనీలో జరిగిన ఓ పెళ్ళి రిసెప్షన్‌లో మన మేనేజర్ గాడు వెడ్డింగ్ గిఫ్ట్‌గా వాళ్ళ మీదికి తోసెయ్యడం నేను చూశాను! అది చూసి నవ్వాపుకోలేక చచ్చాననుకో!" అన్నాడు కేశవరావుతో.

"అలాంటిదే కాదు. అదే నేనిచ్చిందే - దాన్ని రామనాథం గాడు వాడి కూతురికిస్తే, దాన్ని కూతురు దగ్గర్నుంచి కాజేసి, ఆ వెధవ ఇలా ఇంకొడికి అంటగట్టాడన్నమాట!" అంటూ కసిగా అనేసి - "ఐనా, నాకు తెలీకడుగుతా ఈ వెధవలంతా ఇలా ఎందుకు చేస్తున్నారంటావ్? మనస్ఫూర్తిగా నాలాగే ఓ మంచి గిఫ్ట్, ఇంకోటి కొనివ్వచ్చుగా! ఒకసారి అందుకున్న గిఫ్ట్‌ని ఇంకొరికి ఇచ్చేయడమేమిటీ? అసలు నేనిచ్చిన దాన్ని వాడకపోడవేంటీ!" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

"ఏం లేదు! ది ఆన్సరీజ్ వెరీసింపుల్! నువ్విచ్చిన ఆ ఓణం నావ బొమ్మను వాడాలంటే దానిమీద ఓ వందో రెండొందలో ఖర్చు పెట్టి దట్టమైన ఫ్రేమ్ కట్టించాలి! దాన్ని ఏ గోడకన్నా తగిలిస్తే ఎంతదూరం నుంచైనా ఆ నలుపు రంగుని డెకరేషన్‌గా పెట్టుకోడానికి చాలా మందికి సెంటిమెంటు పీకుతుంది! అదీకాక ఆ గడ్డిపోచలు కొద్దికొద్దిగా రాలిపోతుంటే, దాని మీద పోసిన శ్రమంతా దండగే కదా! ఈ కారణాల న్నిటి వల్లా, బుద్ధున్నవాడెవడూ దాన్ని వాడుకోడానికి ట్రై చెయ్యడు, ఇలాగ మరో దౌర్భాగ్యుడి మీదికి తోసేసి చేతులు దులుపుకుంటారన్నమాట! ఇప్పుడర్థమైందా!" అంటూ సందేహ నివృత్తి చేశాడు సుదర్శనం.

"అసలిదంతా నీ నిర్వాకమే కదా! 'ఇచ్చుటలో వున్న హాయీ' అటూ నా ప్రాణాన్ని పూదరగొట్టి, నా చేత ఈ పని చేయించావ్! ఇప్పుడు చూడు ఏం జరుగుతోందో, హాయీ లేదూ - పిండా కూడు లేదు! ఇలా జరుగుతోందని తెలిసినప్పుడల్లా నాకెంత హ్యూమిలియేటింగ్ వుంటోందో తెలుసా?" అని బోరుమన్నాడు కేశవరావు.

"అదే మరి! చూడు మిస్టర్ కేశవ్‌రావ్! ఏదైనా మనం చూడ్డంలో వుంటుంది.! అసలు నువ్వా గిఫ్ట్ కొనేటపుడు లోలోపల ఎంత బాధపడుతూ, అదో 'బాడ్‌డెట్'గా భావిస్తూ కొనడం, అందునా, అర్భకంగా, చౌకగా, స్పెషల్ డిస్కౌంట్‌లో కొనేసి, పెద్ద గిఫ్ట్ నిచ్చేశానన్న క్రెడిట్‌ని కొట్టేయాలనుకోడంలోనే లోపం వుంది.! ఐనా, ఇప్పుడు మటుకు, నీకు జరిగిన అన్యాయం గానీ హ్యూమిలియేషన్ గానీ ఏ ముందీ? నువ్వు జరిగిన విషయాన్ని ఇంకో కోణంలో చూడ్డానికి ట్రై చేస్తే, నీ ధర్మవాని, ఆ 'ఓణం నావ' ఒకరి చేతి నుంచి ఇంకొకరికి, వాళ్ళనుంచి మరొకరికి చేరుకుంటూ ఎంతోమందికీ 'ఇచ్చుటలో వున్న హాయి' ని కలిగించడం లేదూ? ఆ పుణ్యవంతా నీదే కదా!"

"చట్టు బండలేం కాదూ! సొమ్మొకడిది, సోకొకడిది అన్నట్టుంది! అసలు నీ వేదాంతం ఫాలో కావడం నాదీ, నా బుద్ధి తక్కువే! ఇంకెప్పుడూ, చచ్చినా నీ మాట విననంతే" అని తలబాదుకున్నాడు కేశవరావు.

★ ★ ★ ★ ★

అంతలోనే మాఘమాసం వచ్చింది. పన్నెండు దాటి పదమూడో యేట అడుగు పెడుతున్న తమ పెద్దబాయికి కేశవరావు దంపతులు ఉపనయనం చెయ్యాలనుకున్నారు. తమ ఇంట్లో జరుగుతున్న తొలి శుభకార్యంగా భావిస్తూ, ఇంటిముందూ, పైన డాబా మీద రెండు షామియానాలు వేయించి, ఇటు తమ కాలనీలో వుండే కుటుంబాలనీ, అటు తన ఆఫీసులో కొలీగ్స్‌నీ దాదాపు నూట యాభై రెండొందల మంది గెస్టుల్ని ఆహ్వానించాడు కేశవరావు. అంతా బాగానే జరిగింది. ఐతే, ఆ ఫంక్షన్‌కి రామనాథం ఫ్యామిలీ వస్తే, ఏం గిఫ్ట్ తీసుకొస్తాడో చూడాలన్న చిన్నపాటి కుతూహలం కేశవరావు దంపతుల మనసుల్లో దాక్కొని వుంది. అనుకున్నట్లుగానే రామనాథం దంపతులు వచ్చారు. ఐతే ఆ లోగానే తమ కాలనీ ఫ్రెండ్స్, తమకి అంతంత మాత్రమే పరిచయమున్న ఓ ఫ్యామిలీ దంపతులు ముందు కొచ్చి, ఖర్మ - గతంలో కేశవరావిచ్చిన గిఫ్ట్ పాకెట్‌నే - అదే రాపర్‌తో - మళ్ళీ కేశవరావ్ చేతికే, మొహవంతా 'హాయి' ని పులుముకుంటూ ఇచ్చేశారు. దాన్నందుకుంటున్న కేశవరావు కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరగడం, అది చూస్తున్న రామనాథం దంపతుల మొహాలు పాలిపోవడం, ఇదంతా గమనించే సుదర్శనం నవ్వాపుకోలేక చతికిలబడ్డం ఒకేసారి జరిగాయి.

☆

# భారతదేశపు బడ్జెట్ల విశ్లేషణ 2010 –11

**ఫి బ్రవరి నెల భారతదేశంలో బడ్జెట్ల మాసం-సాధారణంగా ప్రభుత్వాలు పన్నులు విధించే వేళ / సమయం. అసలు బడ్జెటు అంటే ఏమిటి? దాని అసలు అర్థం - తోలు సంచి. బ్రిటిష్ దేశపు ఆర్థిక మంత్రి, ఆ దేశపు సాంవత్సరిక ఆదాయ వ్యయాలకు సంబంధించిన డాక్యుమెంట్లను ఓ తోలు సంచిలో తెచ్చే వారు, పార్లమెంటుకు తెచ్చే వారు. కాల క్రమేణా బడ్జెట్ అనే పదం తోలు సంచికి బదులు, అందులో ఉన్న డాక్యుమెంట్లకు సూచికగా మారింది.**

అసలు బడ్జెట్ అనే పదం భారతదేశ రాజ్యాంగంలో లేదు. ప్రతి ఆర్థిక సంవత్సర ప్రారంభంలో (ఏప్రిల్ నెల ఒకటి నుండి మార్చి 31వరకు) ఆర్థిక మంత్రి ప్రభుత్వానికి సంబంధించిన ఆదాయ వ్యయాల వార్షిక పట్టికలను, సంబంధిత వివరాలను పార్లమెంట్‌కు సమర్పించి వారి ఆమోదం పొందాలని భారత రాజ్యాంగం నిర్దేశించింది. పార్ల మెంట్‌లోనూ, రాష్ట్ర అసెంబ్లీలలోనూ ఆమోదం లేకుండా యూనియన్ ప్రభుత్వంగాని, రాష్ట్ర ప్రభుత్వాలు గాని ప్రభుత్వ ధనాన్ని ఖర్చు పెట్టరాదు. పన్నులు కూడా ప్రజాప్రతినిధుల సభల ఆమోదంతోనే విధించాలి. రాజ్యాంగంలో కేంద్ర ప్రభుత్వం అనే పేరు లేదు. దాని అసలు పేరు యూనియన్ ప్రభుత్వం. దానికి అనుగుణంగానే భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రి యూనియన్ ప్రభుత్వ ఆదాయ వ్యయాల వివరాలను ఫిబ్రవరి నెల 26వ తేదీ పార్లమెంటుకు సమర్పించారు. సాధారణంగా ఫిబ్రవరి నెల చివరి రోజు అంటే 28వ తేదీ గాని, లీప్ సంవత్సరంలో 29వ తేదీ గాని బడ్జెట్‌ను సమర్పించడం ఆనవాయితీ. అయితే ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో 27, 28 వ తేదీలు సెలవు దినాలు కావడం వల్ల, ప్రణబ్ ముఖర్జి గారు 26వ తేదీ ఉదయం 11.00 గంటలకు సమర్పించారు. గతంలో బడ్జెట్‌లను సాయంత్రం 5.00గం.లకు సమర్పించేవారు.

భారత దేశపు ఆర్థిక వ్యవస్థ మూడంచల ఫెడరల్ వ్యవస్థ. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా మొదలైన దేశాలు ఫెడరల్ ఆర్థిక వ్యవస్థలే. భారత దేశంలో యూనియన్ ప్రభుత్వంతో బాటు / 28 రాష్ట్ర ప్రభుత్వాలు / యూనియన్ ప్రభుత్వ రాజధాని ఢిల్లీ / 6 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉన్నాయి. మూడో అంచెలో పంచాయతీ రాజ్ వ్యవస్థ / మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లు ఉన్నాయి. ఈ మూడంచల ప్రభుత్వాలు తమ తమ బడ్జెట్‌లను ప్రజా ప్రతినిధుల ఆమోదంతోనే నిర్వహించాలి. ప్రభుత్వ ధనం, దుర్వినియోగం కాకుండా, సక్రమంగా సమర్థంగా, సామాజిక శ్రేయస్సు గరిష్టంగా ఉండేట్లుగా ఖర్చు పెట్టడంలోనే బడ్జెట్‌ల సార్థకత ఉంటుంది.

ఆర్థిక మంత్రులు భవిష్యత్ తరాలకు కూడా ట్రస్టీలు. మూడంచెల ఫెడరల్ వ్యవస్థ సమిష్టి కుటుంబంలోని తాత, కుమారుడు, మనవడుల అనుబంధాలను స్ఫురింపచేస్తుంది. 13వ ఆర్థిక కమీషన్ భారత దేశపు ఫెడరల్ వ్యవస్థను హరితాభివృద్ధికి దోహదం చేసే సమ్మిళిత వ్యవస్థగా వర్ణించింది. బడ్జెట్‌లను ఏనాడూ అంకెలగారడిగా భావించలేదు. ఇది ఒక విధాన ప్రకటన పత్రం కూడా. బడ్జెట్‌లకు అందులోని ప్రసంగాలకు గతంలో ఎంతో ప్రాముఖ్యం ఇచ్చేవారు.

1991 జూలైలో అప్పటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ప్రపంచీకరణ, ఆర్థిక సంస్కరణలు, సరళీకృత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ఎన్నో కీలక ప్రకటనలు చేశారు. ఆర్థిక వ్యవస్థ రూపు రేఖలు మారడానికి ఇవి ఎంతో దోహదం చేశాయి. పని వేళలు ముగిశాక సాయంత్రం 5 గంటలకు బడ్జెట్ ప్రసంగం ప్రారంభించేవారు. అంటే బడ్జెట్‌లో ప్రతిపాదించే పరోక్ష పన్నుల ప్రభావం తరువాతి రోజు నుండి, అంటే ఆ రోజు అర్థ రాత్రి తర్వాత కనిపించేది. కాగా ఇటీవల సంవత్సరాలలో ఇది ఉదయం 11 గంటలకు ప్రవేశ పెట్టబడుతున్నది. మన బడ్జెట్‌లు మధ్యాహ్నం సూర్యుడి బాగా ప్రకాశిస్తాయని ఆశిద్దాం. అనాలోచిత పథకాలకు, ఉద్రేక నిర్ణయాలు సమగ్ర ఆలోచన, విశ్లేషణ లేకుండా తీసుకునే నిర్ణయాలకు, ఓటు బ్యాంకు రాజకీయాలకు, బడ్జెట్‌లు బలికారాదు. నాలుగు కాలాల పాటు సమాజ ప్రయోజనానికి తోడ్పడే పథకాలు మాత్రమే బడ్జెట్‌లలో చోటు చేసుకోవాలి. అందుకే ఆర్థిక మంత్రులు భవిష్యత్ తరాలకు ట్రస్టీలుగా వ్యవహరించాలంటారు. పబ్లిక్ ఫైనాన్స్‌కు సంబంధించిన మౌలిక సూత్రాలను, సిద్ధాంతీల ను విస్మరిస్తే, ఆర్థిక వ్యవస్థకు గండం తప్పదు. కాబట్టి భవిష్యత్ తరాలకు కూడా ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టులు, ఆస్తుల నిర్మాణానికి దోహదం చేయగల ప్రణాళికావ్యయం, మూలధన వ్యయం (కాపిటల్ ఎక్స్‌పెండీచర్)

## సెక్షన్- 2

ఫిబ్రవరి నెల 26వ తేదీన, ప్రణబ్ ముఖర్జీ ప్రవేశ పెట్టిన యూనియన్ ప్రభుత్వ బడ్జెట్‌కు సంబంధించిన వివరాలు ఇప్పుడు మనం గమనిద్దాం. గత 13 నెలల కాలంలో వారు పార్లమెంట్‌కు సమర్పించిన మూడవ బడ్జెటు ఇది. 2009 బడ్జెట్‌లలో సమర్పించిన బడ్జెట్‌లలో మొదటి దాంట్లో కొంత రాజకీయ అనిశ్చిత, రెండవ దాంట్లో ఆర్థిక గమనం పట్ల ఆందోళన ద్యోతకమయ్యాయి. కాగా 2010 ఫిబ్రవరి నాటికి రాజకీయ సుస్థిరత్వం ఏర్పడడమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకు కమ్ముకున్న కారుమబ్బులు కూడా చాలా వరకు తొలగిపోయాయి. ఆర్థిక వ్యవస్థకు సంబంధించి, ఇంద్ర ధనుస్సులు తళుక్కుమని మెరుస్తున్నాయి.

ఆర్థికంగా అగ్రగామి దేశంగా భావించే అమెరికాలో, వృద్ధిరేట్లు వెనుకడుగు వేస్తుంటే మనం ముందుకు, ధీమాగా పోగలుగుతున్నాం.

ఆర్థికాభివృద్ధి రేటు 2008-09లో సుమారు 6.4 శాతం కాగా, 2009-10లో 7.2 శాతానికి పెరగవచ్చన్న సంకేతాలు ఉన్నాయి. అంతేకాదు, రానున్న 2010-11 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 8.5 శాతానికి పెరగవచ్చనే శుభశకునాలు కనిపిస్తున్నాయి. 2008 సంవత్సరంలో భారత ప్రభుత్వం, ప్రకటించిన కొన్ని విధాన నిర్ణయాలు ఉద్దీపన పాకేజీలు, ఆర్థిక వ్యవస్థ బలంగా పుంచుకోవడానికి దోహదం చేశాయి. అందుకే ఆర్థిక మంత్రి మరింత ధీమాగా బడ్జెట్‌ను 2010లో ప్రతిపాదించారు.




2010-11 సంవత్సరంలో యూనియన్ ప్రభుత్వ రాబడి వ్యయాలను సుమారుగా 11 లక్షల 9 వేల కోట్ల రూపాయలుగా అంచనా వేశారు. ఇందులో పన్నుల ద్వారా వచ్చే రాబడి సుమారు 7 లక్షల, 47 వేల కోట్ల రూపాయలు. ఈ గణాంకాలను మనం వాడుక భాషలో అర్థంచేసుకుందాం. భారత దేశ జనాభా 2010-11లో సుమారు 118 కోట్ల 60 లక్షలు అనుకొంటే, భారత ప్రభుత్వం సగటున సంవత్సరకాలంలో సుమారుగా ఒక్కొక్క పౌరుడిని నుండి పన్నుల ద్వారా స్వీకరించేది సుమారు రూ. 6294 కాగా వ్యయం చేసేది 9347 రూపాయలు.

అంటే ప్రభుత్వం వ్యయం చేసేది రూపాయి అనుకుంటే పన్నుల ద్వారా సేకరించేది 67 పైసలు మాత్రమే. మిగిలిన 33 పైసలను పన్నేతర ఆదాయం ద్వారాగాని, అప్పుల ద్వారా గాని సేకరించవలసి వస్తున్నది. పన్నేతర ఆదాయాన్ని సుమారుగా లక్షా 48 వేల కోట్లు అనుకొంటే, పన్నేతర రాబడి రూపాయలో సుమారు 13 పైసలు మాత్రమే. కేంద్ర ప్రభుత్వం పన్నుల ద్వారా స్థూలంగా సుమారు 7లక్షల 47 వేల కోట్ల రూపాయలు సేకరించినా అందులో సుమారు 2 లక్షల 9 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేయవలసి ఉంటుంది. అంటే సుమారు 28 శాతం బదలీ చేయాలి.

అంతేగాక యూనియన్ ప్రభుత్వం, రాష్ట్రాలకు కొంత గ్రాంట్ల రూపంలో కూడా బదలీ చేయాలి. 2010-11 సంవత్సరంలో కేంద్రం ద్వారా, రాష్ట్రాలకు లభించగల ప్రణాళికేతర గ్రాంట్లు సుమారు 46 వేల కోట్లు, ప్రణాళికా గ్రాంట్లు రూ.88,808 కోట్లు. అంటే యూనియన్ ప్రభుత్వ వ్యయం / రాబడి, 2010-11లో సుమారు రూ. 11 లక్షల కోట్లు కాగా వివిధ రూపాలలో రాష్ట్రాలకు లభించిన ఆర్థిక సహాయం మొత్తం రూ. 3 లక్షల 69 వేల కోట్లు. అంటే 33.3 శాతం. రూపాయి రాబడిలో మూడు వంతు.

కేల్కర్ గారి అధ్యక్షతన గల పదమూడవ ఆర్థిక సంఘం డిసెంబరు 2009 లో నివేదిక సమర్పించారు. ఈ నివేదికను భారత ప్రభుత్వం యథాతథంగా ఆమోదించింది. కేంద్ర ఆర్థిక సంఘాల నివేదికను భారత ప్రభుత్వం, మార్పులు లేకుండా ఆమోదించిన విధంగానే, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా, రాష్ట్ర ఆర్థిక కమీషన్‌ల నివేదికను కూడా యథాతథంగా ఆమోదించాల్సిన అవసరం ఉంది. యూనియన్ ప్రభుత్వ నికర పన్నుల రాబడిలో 32 శాతం రాష్ట్రాలకు బదలీ చేయాలని 13 వ ఆర్థిక కమీషన్ సిఫారసు చేసిందని ఈ సందర్భంలో మనం గుర్తుంచుకోవాలి. ఇందులో ఆంధ్రప్రదేశ్ వాటా 6.937 శాతం. సబ్సిడీలను క్రమబద్ధీకరించే లక్ష్యంతో ఎరువుల సబ్సిడీని నేరుగా రైతులకు ఇచ్చే విధానం అమలు చేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు.

రైతులకు ఇచ్చే పంట రుణాల మొత్తాన్ని రూ. 3 లక్షల 75 వేల కోట్లకు పెంచుదామని కూడా ఆర్థిక మంత్రి ప్రకటించారు. గత ఏడాది కంటే ఇది రూ. 50 వేల కోట్లు అధికం. మెట్ట ప్రాంతాలలో నీటి సరఫరాకు రూ.2400 కోట్లు కేటాయించారు. ఆహార భద్రతకు, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, ఆహార భద్రతకు సంబంధించిన బిల్లును త్వరలో ప్రవేశపెడతామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. గ్రామీణాభివృద్ధికి రూ.66 వేల కోట్ల రూపాయలు కేటాయిస్తామని ప్రకటించి అందులో ఉపాధి హామీ పథకం వాటా రూ.40 వేల కోట్లుగా తెలియజేశారు. భారత్ నిర్మాణ్‌కు 48 వేల కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు.

ఆదాయపు పన్ను చెల్లించే వారికి కొంత వెసులు బాటు కలిగించారు. ఆర్థిక మంత్రి లక్షా అరవై వేల ఆదాయం వరకు ఆదాయపు పన్ను చెల్లించనవసరం లేదు. లక్షా అరవై వేల నుండి - ఐదు లక్షల ఆదాయం వరకు పన్ను రేటు పది శాతం మాత్రమే. 5 లక్షల నుండి 8 లక్షల వరకు, రూపాయి ఆదాయంలో 20 పైసల చొప్పున చెల్లించాలి. 8 లక్షల ఆదాయం తర్వాత, రూపాయకు 30 పైసలు చొప్పున పన్ను చెల్లించాలి. కాగా వ్యవసాయాభివృద్ధికి బడ్జెట్ ఒక చతుర్ముఖ వ్యూహం అవలంబించ తలచింది.

- ❖ వ్యవసాయోత్పత్తి పెంచేందుకు చర్యలు-వర్షాధార ప్రాంతాలలో పప్పులు, నూనెగింజల విత్తన ఉత్పత్తికై గ్రామాలు ఎంపిక చేయటానికి, అభివృద్ధి పరచటానికి రూ.300 కోట్లు కేటాయింపు - హరిత విప్లవ లాభాల పరిరక్షణకు రూ.200 కోట్లు.
- ❖ వ్యవసాయ పంటల నిల్వల స్టోరేజి సామర్థ్య పెంపుదల, వృధా నివారణచర్యలు.
- ❖ రైతు రుణాల పరిమాణ పెంపు

❖ వ్యవసాయోత్పత్తుల ప్రాసెసింగ్ అభివృద్ధికి చర్యలు.

***అభివృద్ధికి చర్యలు :*** స్థూలంగా చెబితే ఆర్థిక మంత్రి ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న కొన్ని సవాళ్ళను ప్రస్తావించి వాటిని ఎదుర్కొనే వ్యూహం సూచించారు. స్థూల దేశీయాభివృద్ధి రేటు, ప్రపంచ దేశాలతో పోల్చినప్పుడు మెరుగుగా ఉన్నప్పటికి 9 శాతం కనీస వృద్ధి రేటు సాధించాల్సిన అవసరం ఉంది. కాలక్రమేణా దీనిని 10, అంతకంటే హెచ్చుగా పెంచాలి. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు, అన్ని ప్రాంతాలకు అందేట్టు చూసి, సమగ్రమైన సమ్మిళితమైన అభివృద్ధి సాధించడం, వెనుకబడి ప్రాంతాల అభివృద్ధికై వర్తమాన సంవత్సరంలో బి.ఆర్.జి.ఎఫ్. కు కేటాయింపును రూ. 5800 కోట్ల నుండి రూ.7300 కోట్లకు పెంచారు. అన్నిటి కంటే ముఖ్యమైనది పరిపాలనా సామర్థ్యం పెంచడం, ఆశించిన రీతిలో అభివృద్ధి ఫలాలు అందేటట్టు చూడటం. ప్రభుత్వ పథకాలలో వృధాను అరికట్టడం. ఈ లక్ష్యాలను సాధించటంలోనే బడ్జెట్ సార్థకత ఆధారపడుతుంది.

## సెక్షన్- 2

సీనియర్ సిటిజన్ అయిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిత్వ శాఖను గూడా నిర్వహిస్తున్నందున రోశయ్యా గారు, తన పదహారో బడ్జెట్‌ను ఫిబ్రవరి నెల 20వ తేది శాసన సభకు సమర్పించారు. నేపథ్యం ఏమైనా, పదహారనగానే, నైరాశ్యానికి అడ్డుకట్టవేసి, ఆశల పల్లకిలో ఊగడం సహజం. 2009-10లో రాష్ట్రంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. కరువు పరిస్థితులు ఏర్పడి సామాన్య జన జీవనాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. లక్ష కోట్ల బడ్జెట్ గురించి మూడు సంవత్సరాలుగా ప్రకటిస్తున్నా, లక్ష కోట్ల లక్ష్యం నెరవేరలేదు. ప్రపంచ వ్యాప్తమైన ఆర్థిక మాంద్యం తాకిడి, రాష్ట్రంలో పునర్విభజన ఆందోళనలు ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేశాయి.

ఈ నేపథ్యంలో 2010-11 బడ్జెటును 20/02/2010 ప్రవేశపెట్టారు. రాష్ట్రం తిరిగి పూర్వ వైభవం సాధించి ఇతరులకు మార్గదర్శకంగా నిలఎస్తుందనే విశ్వాసంతో 2010-11 సంవత్సరంలో లక్షా 13 వేల 660 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదించారు. ఇందులో ప్రణాళికేతర వ్యయం రూ.73,347 కోట్లు, ప్రణాళికావ్యయం రూ.40,313 కోట్లు. రెవెన్యు మిగులు రూ.3 వేల 548 కోట్లు ద్రవ్య లోటు (అంటే కొత్త అప్పులు) 12 వేల 983 కోట్లు. ఆర్థిక వృద్ధితో పాటు, వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతను కొనసాగించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 3 ఉద్దీపన ప్యాకేజీలు సత్ఫలితాలు ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. సంకల్పబలమే లక్ష్యాల సాధనకు ముఖ్యమైన బలమని చెప్పారు.

2004-2009 మధ్య కాలంలో సుమారు 19 లక్షల ఎకరాలకు సాగు నీటి సామర్థ్యాన్ని కల్పించినట్లు, సుమారు 3 లక్షల ఎకరాలను స్థిరీకరించినట్లు చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద రూ.8 వేల 182 కోట్లు వ్యయ పరచినట్లు - 201-11లో రాష్ట్ర వాటా క్రింద రూ.300 కోట్లు కేటాయించినట్లు తెలియజేశారు. కాగా ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతి ఎలా ఉన్నది అనేది మనకు ముఖ్యమైన విషయం. 13వ ఆర్థిక కమీషన్ వారు తులనాత్మకంగా ఉండే తలసరి ఆదాయ వివరాలను పొందుపరచారు. ఆ గణాంకాలను పరిశీలిస్తే 2004-2007 మధ్య గల 3 సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్ వార్షిక సగటు తలసరి ఆదాయం 30,561 రూపాయలు.

కాగా భారత దేశ రాష్ట్రాల సగటు తలసరి ఆదాయం 30,902 రూపాయలు. అంటే భారత దేశపు తలసరి ఆదాయాన్ని 100 అనుకొంటే, దానికంటే కొంచెం తక్కువగా 99 వ సూచి సంఖ్యతో 11వ స్థానంలో ఉన్నాం. 28 రాష్ట్రాలలో గోవా 90,848 రూపాయలతో అగ్రగామి కాగా, బీహార్ 8851 రూపాయలతో చివరి స్థానంలో ఉంది.

ఫెడరల్ ఆర్థిక వ్యవస్థలో మూడో స్థానంలో ఉన్న మన పంచాయతీ రాజ్ సంస్థలు, మునిసిపాలిటీలు గమనించాల్సిన మరో విషయం - ప్రజా సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత వ్యయం చేస్తున్నాయో గమనించండి. 2007-08 సంవత్సరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి వ్యయం రూ. 14,65,056 కోట్లు . అంటే తలసరి వార్షిక వ్యయం రూ.12,874. 2008-09 సంవత్సరంలో సమిష్టి వ్యయం రూ.18,24,381 కోట్లు. అంటే తలసరి వార్షిక వ్యయం రూ.15,809. 2009-10 సంవత్సరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి వ్యయం రూ.20 లక్షల 77 వేల 325 కోట్లు - ఒక్కొక్క పౌరుడిపై పెట్టే సగటు వ్యయం రూ. 17,755.




పై గణాంకాలు పంచాయతీ రాజ్ వ్యవస్థలకు ప్రేరణ, మార్గదర్శకం కావాలి. పంచాయతీ రాజ్ సంస్థలు, ఒక్కొక్క పౌరునిపై సగటున ప్రతి సంవత్సరం ఎంత ఖర్చు పెడుతున్నాయో లెక్క వేసుకొని మరింత సంకల్ప బలంతో ముందుకు సాగాలి. అప్పుడే గ్రామ కళ్యాణం, ప్రజాసంక్షేమానికి మరింతగా కంకణ బద్ధులు కావాలి.

***- ప్రొ.ఎం.ఎల్. కాంతారావు,***
*కన్సల్టెంట్ (అవార్డ్)*

# ఫీచర్ వ్యాస వ్యాసులు అను కాలమిస్టులు

***అ**ణువులో అనంత విశ్వాన్ని దర్శించగలవారు మాత్రమే ఫీచర్ వ్రాసి నెగ్గగలరు. అల్ప విషయంపై అనల్పంగా చర్చించగల చతురత వుండాలి. తెలుగుదేశంలో అలాంటివారు ఎందరో వున్నారు. వారిలో కొందరి ఫీచర్ రచనలను అనుకరిస్తున్నాను యీ పేరడీలో -*

*కృష్ణానది పుష్కరాలు వచ్చినప్పుడు -ఒక్కొక్కరి కలం కదలికలు ఎలా వుంటాయో ఊహించి ఈ పేరడి వ్రాయడం జరిగింది.*

## కాలక్షేపం బఠాణీలు

**పా**తికేళ్ళ క్రితం దాసు వామనరావుగారి 'కాలక్షేపం' శీర్షిక తెలుగు పాఠకులను యెంతగానో అలరించింది. వామనరావుగారి వ్యాసాలు నిడివి యెక్కువగా వున్నా విసుగు కల్గించేవి కావు. పాతికేళ్ళ తర్వాత కూడా ఆనాటి వారి ప్రాసంగిక వ్యాసాలు నేటికీ పాఠకుల నెమరుకు అందుతాయి.



*పై సందర్భంలో వారి రచన!*

*దాన కళా కలాప సముదంచిత*
*సార వివేక సంపదన్*
*మానిత యాచమాన జన మానస*
*వృత్త్యభి పూర్తి బుద్ధి యె*
*వ్వానికి లే దొకింతయును, వాడొక*
*రుండు భరంబు ధాత్రికిని*
*గానలుగావు శైలములుగావు*
*వయోధులు గావు భారముల్.*

"దీనారటంకాల తీర్థ మాడించితి దక్షణాధీశు ముత్యాలశాల" అని చెప్పుకున్న శ్రీనాధుడు శృంగార నైషధంలో నలునికి చెప్పించిన నీతి వాక్యమిది.

అర్థులకు దానం చెయ్యనివాడు భూమికి బరువుచేటు. నిజంగా పుడమికి అడవులు, కొండలు, సముద్రాలు వాని కంటే భారం కాబోవు. మనదేశం కర్మక్షేత్రం కనుక దానధర్మాలు చేయండనే ప్రచారం ఎక్కువ. ఒక సందర్భం సన్నివేశం కల్పిస్తే కాని కొందరు చేయి వదలరు. కనుక తీర్థాలు, శ్రాద్ధాలు కల్పించబడి వారికి మెడమీద కత్తులుగా వుంచబడినవి. ద్వాదశ వర్షాలకొక మారైనా బంధుజనమంతా పవిత్ర నదీ తీరాన పరస్పరం పలకరించుకుంటారనేది కూడా ఈ పుష్కరాల అంతర్యం కావచ్చు.

కర్మణ్య దేశంలో మూఢనమ్మకాలకు అగ్ర సింహాసనం వుండడం సహజం. పుష్కరాల తీర్థానికి వచ్చిన ఒక బ్రాహ్మణుడు నదిలోకి స్నానానికి దిగుతూ తన రాగి చెంబును నది వొడ్డున ఇసుకలో జాగ్రత్తగా నిక్షిప్తం చేశాడు. గుర్తుకోసం పైన తడి ఇసుకతో లింగాకారాన్ని తయారు చేశాడు. ఆయన వీరశైవుడు కూడా!

"అయ్యవారు చేశారు- మనమూ చెయ్యాల్సిందే" నని తీర్థానికి వచ్చిన వారంతా తడి ఇసుకతో లింగాకారాలను తయారుచేసి నదిలోకి దిగడం మొదలు పెట్టారు. వీర శైవుడు స్నానం ముగించి ఒడ్డుకు వచ్చేసరికి ఏ ముంది? వేల సంఖ్యలో శివలింగాలు సాక్షాత్కరించినై. తన రాగి చెంబు ఏ లింగం క్రిందవుందో గుర్తింపలేక పోయాడు. కేవలం ప్రజల వేలంవెర్రి వలన బంగారం లాంటి రాగి పాత్ర పోయింది.... ... ☆

## ఆషామాషీ వడగళ్ళు

**అ**సలు వడగళ్ళకి రావూరివారి వడగళ్ళకి స్వరూప స్వభావాల్లో సారూప్యం లేదు. ఇవి కరిగిపోని రుచిగల వడగళ్ళు.

ఆనాడు 'కృష్ణాపత్రిక'లో అందిన మసాల గుగ్గిళ్ళు. తర్వాత అవే 'ఆషామాషీ' లోకి పరకాయ ప్రవేశం చేసినై. రెండు పుష్కరాలకు పైగా వ్రాస్తున్నా రావూరు వెంకట సత్యనారాయణగారి పాళి నిగ్గు తేలిందే గాని రవ్వంతైనా అరిగిపోలేదు. వారి సున్నిత హాస్య ధోరణి చిరులాస్యానికి ప్రాణదాత. ☆




## కొంప కొల్లేటి సంత

"ముందుగా చెప్పి వచ్చేది తిథి. చెప్పకనే దిగితే అతిథి. తిథినీ అతిథినీ కూడా ఆదరించడం గృహస్థ విధి" అని మల్లినాథ సూరిగారు అంటే "తిథులూ విధులూ ఏమోగాని ఈ అకాల పుష్కరం నా పాలిట అధిక మాసమై కూర్చుంది. సరిగంగ

స్నానాలకోసం సకుటుంబంగా చుట్ట పక్కాలంతా దిగితే కొంప కొల్లేటి సంత కాక ఏమౌతుంది?'' అని వాపోయాడు బంధులోకం ప్రాప్తించిన ఒక పెద్ద మనిషి.

ఒక బ్రతక నేర్చినవాడు తీర్థం సాకుతో పిల్లా మేకతోసహా ఒక గృహస్తు యింట తిష్ట వేశాట్ట. పిన్నిగారూ, బాబాయిగారూ అని వాళ్ల వరసలు పెట్టి పిలుస్తుంటే, కాబోలునంటే కాబోలునని చాలా మర్యాద చేశారట విడిది దిగిన దంపతులు. శ్రావణ భాద్రపదాల బాపతని తేలేసరికి కొంప గుండమైందిట. ''తీర్థానికి వచ్చిన వారికి యింత ప్రసాదం పెట్టామన్న తృప్తి కంటే రుణభారం అధికమైందని'' విలవిల్లాడాడు ఆ గేస్తు. ☆

# కూసేవాడు మేసేవాడు

పుష్కర పర్వదినం కదా ప్రేత తృప్తికోసం తర్పణులు విడుద్దామంటే - పురోహితుల గిరాకీ పెరిగిపోగా, వాళ్ళంతా చెట్లెక్కి కూర్చున్నారట.



''కూసేవాడికి పది, మేసేవాడికి అయిదు ఇచ్చుకోవాల్సి వచ్చిందని'' ఒక మిత్రుడంటే నాకు బోధపడింది కాదు. తర్వాత చెప్పాడు భాష్యం. కూసేవాడంటే మంత్రం చెప్పేవాడనీ. మేసేవాడంటే భోక్త అనీ. పోనీ అంత కష్టంగా వుంటే మానెయ్యకపోయారా అంటే ''పితృ దేవతలు నక నక లాడరుటండీ! మళ్ళీ పన్నెండళ్ళకు కదా! పాపం'' అని జాలిని ప్రదర్శించాడు. ☆

# పుష్కరాలు - శుష్కప్రియాలు

ఎన్నడూ ఉత్తరం వ్రాయని మా దూరపు బంధువొకాయన నన్ను తెగ పొగిడేస్తూ ఉత్తరం వ్రాస్తే నా మనసు వెల్లువైపోయింది.

ముగింపులో ''పుష్కరాలలో పుష్కలంగా దొరుకుతాయ్ కనుక అరడజను విబూది పళ్ళు, నాలుగు యజ్ఞోపవీతాలు, లధూపహారతి, కుందుల జత -దర్భాసనం, గంధపు చెక్క కొని వుంచితే తనకు తీరి నపుడు వచ్చి తీసుకు వెళ్తా'' ననే ముక్కలు వ్రాశాడు. నా గుండె స్నానఘట్టమైపోయింది.

# అత్తగారూ - భానుమతి

**శ్రీమతి భానుమతీ రామకృష్ణ గారి అత్తగారి కథలు ఒక ఫీచర్ లాంటివే. వినోదాన్ని కలిగించే ఈ కథలు తెలుగునాట బాగా పాప్యులర్ అయినాయి. వీటి సాహిత్య స్థాయిని కొందరు సాహితీ వేత్తలు ప్రశంసించారు. కథ క్లుప్తంగా ఇలా వుంటుంది.**

## అత్తగారూ- పుష్కరాలు

నిద్రలేచి బాల్కనీలోనుంచి చూసేసరికి పెరట్లో ఒక ఒక్క చిక్కిన ఆవూ - హారతి పళ్ళెంతో అత్తగారూ కన్పించారు. దిగి వచ్చి ఆరా చేస్తే ''పుష్కర తీర్థం నాడు నదివొడ్డున గో దానమిస్తే రేపు దాని తోక పట్టుకుని తేలిగ్గా వైతరణి దాటవచ్చు. అందుకే యీ తతంగమంతా. పాపం మన తంగవేలు వూరంతా తిరిగి కొనుక్కొచ్చాడు. అయిదు వందలు చౌకే కదా?'' అన్నారు అత్తగారు.

ధర విని అదిపడ్డా పైకి ''ఔనౌను చాలా చౌక'' అన్నాను.

తంగవేలు అతి వినయంగా పెద్దమ్మగారి పక్కన నిలబడి వున్నాడు. ఆవుకి పసుపూ, కుంకుమా అలంకారం చెయ్యాలని అత్తగారి ప్రయత్నం. అదేమో బెదురుచూపుల్తో అత్తగారిని కుమ్మడానికి ప్రయత్నిస్తోంది. ఇంతలో మా పని కుర్రాడు రెడ్డి రావడంతో అత్తగారికి ఆ గండం తప్పింది.

''దీనితోపాటు బంగారు కొమ్ము, వెండి గిట్ట కూడా దానం ఇవ్వాలి లేకపోతే ఫలితం వుండదట'' అన్నారు అత్తగారు.

''దానికేం భాగ్యం, అలాగే ఇద్దాం'' అన్నాను.

ఈ ఆవుని నది వొడ్డుకి చేర్చడం ఎట్లాగా అనేది పెద్ద సమస్య. అసలే పోట్లగొడ్డులా కన్పిస్తోంది. వూరంతా తీర్థ ప్రజతో కిటకిటలాడిపోతోంది. జనం మీద విరుచుకు పడితే పుణ్యం మాట ఎట్లా వున్నా శాపనార్థాలు మాత్రం తప్పవు. ఇంతలో నాకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వెంటనే ఫైర్ స్టేషన్‌కి ఫోనుచేసి విషయమంతా చెప్పి హెల్ప్ కావాలని అడిగాను.



"అది మా డ్యూటీ కాదండీ" అని ఖచ్చితంగా చెప్పడమే కాకుండా నేను వాళ్ళనేదో న్యూనత పరచడానికి ఫోన్ చేశానని ఫీలై, అనరాని మాటలూ ఫోన్‌లో అనేశారు ఫైర్ స్టేషన్ వాళ్ళు.

ఏమీ పాలుపోక మావారికి సంగతంతా ఫోన్‌చేసి చెప్పాను. ఓ గంటకల్లా స్టూడియోలో వున్న అంబులెన్స్ వాన్‌తో సహా హజరైనారు. నా ప్రాణం కుదుట పడింది.

డ్రైవర్ సింగూ, మేనేజరు, రెడ్డి, తంగవేలూ చాలా హైరానపడి ఆ పోట్ల ఆవుని వాన్‌లోకి నెట్టేసి డోర్ లాక్ చేశారు. మేమంతా కాబిన్‌లో కూర్చున్నాం. దారి పొడుగునా హటారి పిక్చర్ చూస్తున్నట్టు ఫీల్ అయ్యాం. కొమ్ము పోట్లకు వాన్ అద్దాలు రెండు పగిలిపోయి పెంకులు రోడ్డంతా పడ్డాయి. వాన్ గోమయంతో పునీతమైంది. దానం పుచ్చుకునే బ్రాహ్మణ్ణి కూడా తంగవేలే మాట్లాడి నది దగ్గరకు తెచ్చాడు. ఎట్లాగో క్రతువు అయిందనిపించాం అతి కష్టం మీద.

నిజంగా వైతరణి దాటినట్లే సంతృప్తి చెందారు అత్తగారు. వెయ్యి రూపాయలు ఖర్చయినా ఆమె తృప్తిని చూసి సంతోషించాం నేనూ, వాళ్ళ అబ్బాయి.

మర్నాడు తెలిసిందేమంటే -వీధుల్లో కాయితాలు, సినిమా పోస్టర్లు, ఫిలిమ్ ముక్కలూ తింటూ తిరిగే ఆవుని  తంగవేలు పట్టుకొచ్చి ఈ కథ నడపాడనీ, దానం పుచ్చుకొన్న సద్బ్రాహ్మణుడు తంగవేలు తమ్ముడేననీ. అయితే యిప్పటికీ ఈ నిజాన్ని మా అత్తగారి చెవిని వెయ్యలేదు నేను. గోదానంలో కలిగిన ఆమె సంతృప్తిని పోగొట్టడం యిష్టం లేక.

☆

## రాజహంసలు

**చిత్ర సమీక్షకులు ఎందరున్నా అందరిదీ ఒకే వాణి -ఒకే బాణి. వీరు టాకీల్లోకి గుణాలను మాత్రమే స్వీకరించే మాన్యులు. సినీ మానససరోవరంలో యీదులాడే రాయంచలు- వారి సమీక్ష యిలా సాగుతుంది -**

ఆశేష ప్రజానీకం ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్న కృష్ణా పుష్కరాలు ఆంధ్రుల అభిమాన నగరమైన విజయవాడలో భారీయెత్తున ప్రారంభమైనాయ్. ఈ పుష్కరాలు భారతీయ సాంప్రదాయాలకు అద్దం పట్టే తీరులో జరుగుతున్నాయ్. భక్తి, ముక్తి, రక్తి మేళమించుకున్న ఈ సన్నివేశం కృష్ణానది చరిత్రలో ఒక మైలురాయి కాగలదనడంలో సందేహం లేదు. కిక్కిరిసిన యాత్రికులతో నగరం మనోహర దృశ్యకావ్యం వలె వున్నది.

ఆరోగ్య సిబ్బంది, పోలీసుదళాలు, హోంగార్డులు తమ అవధుల మేరకు కృషి చేస్తున్నారు. ఇతర స్వచ్ఛందసంస్థలు కూడా తమ తమ ధ్యేయాలకు న్యాయం చేకూర్చినవి.

పన్నెండేళ్ళ తర్వాత వచ్చిన ఈ తీర్థం అందరూ సకుంటుంబంగా సేవించతగింది.

☆

## పురాణం ముచ్చట్లు

**సుబ్రహ్మణ్యశర్మ గారి ఇంటిపేరు 'పురాణం' అయినా మనం భయపడాల్సిన పనిలేదు. రచనలో ఆ ఛాయలేవీ కన్పించక 'ఇది కేవలం నేతి బీరకాయలాంటిదేస్మీ' అని హాయిగా గాలి పీల్చుకుంటాడు ఆసాంతం చదివిన పఠిత . తెలుగు జనం "నే నేది వ్రాసినా చదివేస్తారోచ్" అనుకుని వ్రాసినవి బహు కొద్దే అయినా వాటిల్లో కూడా కొసమెరుపు వుండనే వుంటుంది. వీరిశైలి మా చెడ్డ సరదాగా వుంటుంది.**

'అసలు వింటర్‌లో తీర్థాలు, వేసవిలో తిరునాళ్ళు రావడం ఏమీ బాగోదు. తారుమారైతే లబ్జుగా వుంటుందని ఘంటాపథంగా చెప్పగలను. దీనికి కారణాలు తీర్థ ప్రజలలాగా అనేకం. అవన్నీ చెప్పాలంటే పుష్కర కాలం పడ్తుంది.



పుష్కర తీర్థం వల్ల పుణ్యలోక ప్రాప్తి మాటయేమోగాని నా మట్టుకు నాకు కాలమానంలో కొంటె గుర్తుగా వుండి చాలా సర్వీస్ చేస్తోంది. మా నానిగాడు పుట్టి సరిగ్గా పుష్కరం. మా ఇంటాయన వెల్ల వేయించింది క్రిందటి పుష్కరాల్లోనే. పక్కింటి మాస్టారు రిటైరై పుష్కరం (ఇంకా పింఛను మంజూరు కాలేదు). పుష్కరంగా ట్రై చేస్తున్న ఎదురింటి కామాక్షికి వరుడు దొరికాడు కాదు. (పాపం సంగీతం కూడా నేర్చుకుంటోంది.) 'అద్యతన భవిష్యత్తులో' అనే పెద్దల నిఘంటువులో పుష్కరం అంటే అట్టే దీర్ఘకాలం కాదు గాని సిన్మాతారల పంచాంగంలో పుష్కరం అంటే రెండేళ్ళు (ట). బృహస్పతి రెండో విడత కన్యరాశిలోకి వస్తున్నా సోమయాజిగారి జేష్టుడు ఆంధ్రా మెట్రిక్ గట్టెక్కలేదు.

"పుష్కరం నాడు కొన్నారు జత కట్టుడు చీరెలు మహా తెంపుగా" అంటుంది సంసారం చిత్రం సెకండ్‌హాఫ్‌లో వో బెటర్‌హాఫ్,. "ఇంకా నయం జన్మకో శివరాత్రి కాలేదు - సంతోషించు" అనగలిగిన హీరోలు అరుదుగా లేకపోలేదు. పుష్కరం నాటి వూహలూ, ఆలోచనలూ నైరూప్యంగానే మస్తిష్కంలో పడి వుండడం మామూలు సంగతే! ఓ కార్డుముక్క, గుడివాడ నుంచి బెజవాడ రావడానికి పుష్కర కాలం పట్టిందంటే మీరు ముక్కుమీద వేలు వేసుకోవాల్సిన పని లేదు.

బంధువుల తాకిడికి తట్టుకోలేని ఓ అల్పప్రాణి "ఈ నదుల్ని కూడా కంకర రోడ్డులాగా, కరెంటు తీగల్లాగా వాడ వాడలకీ విస్తరింప చేయాలనీ, లేకపోతే నదీతీర వాసులకు తిప్పలు తప్పవనీ చేసిన

ప్రతిపాదనకు రెండు పుష్కరాల్లో సాధ్యం కావచ్చునని" సానుభూతితో కూడిన హామీ ఇచ్చాను.

అసలీ తీర్థాల వెనుక బోలెడు సామాజిక స్పృహ నిండివుందని నా ఐడియా, ఆడా -మగా; కలిమి -లేమి; పండితుడూ - పామరుడూ ఒకే రేవులో స్నానం చేస్తుంటే 'సోషలిజ స్థాపనకు' పుష్కరాలు మాత్రమే ఏకైక మార్గమని నా అంతరాత్మ వుద్ఘోషించింది.

తీర్థం సందర్భంగా ఓ హస్తం ఖర్చుతో డకోటా విమానం ఎక్కి కుతి తీర్చుకున్నప్పుడు "నీది విమానం ఎక్కాల్సిన జాతకంరా సుబ్బులూ" అంటుండే మా నాయనమ్మ మాట చెల్లినందుకు నా కళ్లు చెమర్చినై.

☆



## ఊహాలత

**ఒక వార పత్రిక ద్వారా ధారవాహినిగా అయిదేళ్ళపాటు తన ఊహాగానాన్ని వినిపించి పాఠక శ్రోతల్ని మైమరింప చేశారు శ్రీమతి లత. ప్రస్తుతం ఆమె 'తల' తిరగబడిందని కొందరి ఆరోపణ, అయినా 'లతే' అవుతుంది కదా! ఆమె గానం ఇలా వంశీమోహనుని రవంలా సాగిపోతుంది.**

*'తలపులు గొల్లలాడి మిగులన్ భ్రమయించి యవ వ్రజంబుచే నెల లధికంబుగా గానుచు వేడుక నమ్మిరి పువ్వులంగడన్'.*

ఆనాటి కుర్రకారు పూలకై కాదు కందువ మాటలకు, చిరునవ్వులకు, సిగ్గులకు, చిడి ముడి పాట్లకు కూడా ధర చెల్లించే వారట. పుష్కరాల సందర్భంగా వేల సంఖ్యలో షాపులు వెలిసినై. నాకు నచ్చింది కొండపల్లి బొమ్మలమ్మేషాపు. బొమ్మలమ్మే పిల్ల కొండపల్లి బొమ్మల్లో కలిసి పోయేంత ముచ్చటగా వుంది. కుర్రవాళ్ళకు షాపు వదలి రావడానికి కాళ్ళు ఆడడం లేదంటే విశేషం లేదు - బొమ్మల ధర చాలా యెక్కువ అన్పించింది. వెలదులు వున్నచోట వెలలు అధికంగానే వుంటాయ్ మరి.

అబ్రహాం లింకన్ ఒక ఎగ్జిబిషన్‌కు వెళ్ళి వో కప్పు కాఫీ తాగాడట. అక్కడ అమ్మాయిలు నడుపుతున్న క్యాంటిన్‌లో కప్పు కాఫీ వెల చాలా అధికంగా వుందట. అక్కడ నుంచి తిరిగివస్తూ సేల్స్‌గరల్ చేయిని చూసి "ఇది మీ చెయ్యా? కాలేమో అనుకున్నాను. ఇక్కడ అన్ని వస్తువులూ ఆకాశాన్ని చూస్తున్నాయి కదా!" అని తన సహజమైన హాస్య ధోరణిలో చురక వేశాడట లింకన్.




కిక్కిరిసిన జన సందోహంలో నా కళ్లు యెవరి కోసమో వెదుకు తున్నాయ్. ప్రక్కన నడుస్తున్న మామయ్య హెచ్చరికలు చేయడం, వినుక్కోవడం దాకా వచ్చింది. అయినా, నా చూపులు యెక్కడో యెవరి కోసమో.... "సంకలో పిల్లోడు సంబ్రాలు పడుతుంటే" ఎంకి, నాయుడు బావ తీర్థానికి వచ్చారేమో చూడాలని నా ఆశ - ఆ మాట మామయ్యతో అంటే చాలా యీజీగా తీసుకొని 'ఓసి వెర్రిదానా' అనేస్తాడని నాకు తెలుసు.....

☆



# ప్రేమ, క్షమాపణలే యేసుక్రీస్తు జీవన సారాంశం

సృష్టిలోకెల్లా అద్భుతమైనది ప్రేమ. దానికి అనుబంధమైనది క్షమాపణ. ఈ రెండూ లేని లోకాన్ని ఊహించుకోవడమే అసాధ్యం. లోక గమనానికి ఈ రెండూ ఇరుసుల్లాంటివి. ప్రేమ, క్షమాపణ అక్కాచెల్లెళ్ళలాంటి లక్షణాలు. ఒక దానితో మరొకటి పెనవేసుకుపోయిన మధురమైన భావనలు. ఈ రెండూ అన్నింటిలాగే ఈ రెండింటికీ కూడా ప్రాప్తిస్థానం దేవుడే. అందుకే ఎంత యాంత్రిక జీవనశైలికి అలవాటు పడినా, మానవుడు మాత్రం ఈ రెండింటి కోసం ప్రభువు తట్టు చూడవలసిందే!

యేసుక్రీస్తు జీవితాన్ని ఆయన బోధనలు, సారాంశాన్నంతటినీ చిలికి రెండు ముక్కల్లోకి కుదిస్తే అది ప్రేమ, క్షమాపణలే అవుతాయి. దేవుడు లోకాన్ని ఎంతో ప్రేమించాడని, తన ఏకైక కుమారుడైన యేసుక్రీస్తును నిత్య జీవన ప్రదాతగా ఈ లోకానికి పంపించేంతగా దేవుడు లోకాన్ని ప్రేమించాడని బైబిలు చెబుతోంది.(యోహాను 3:16) దేవుడు తన అద్వితీయ కుమారున్ని ఈలోకానికి రక్షకుడుగా పంపి ఉండకపోతే ఆయన ప్రేమ ఎంత లోతైనదో, ఉత్కృష్టమైనదో మానవాళికి అర్థం అయిఉండేది కాదు... ప్రేమకు పూర్తిగా వ్యతిరేక భావనగా చెప్పుకోదగిన 'స్వార్థం'లో 'తీసుకోవడం' మాత్రమే ఇమిడి ఉంటుంది. ఎంత సేపూ 'తీసుకోవడానికి' మాత్రమే అలవాటు పడిన పాప భూయిష్టమైన యాంత్రికమైన, స్వార్థశక్తులతో కూడిన లోకానికి దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా 'ఇవ్వడం' అనే పరలోక లక్షణాన్ని నేర్పించాడు.

ఆయన్ని ఈ లోకానికి రక్షకుడిగా ఇవ్వడం ద్వారా ఆ దైవి లక్షణాన్ని మొదట దేవుడే ఆచరించి చూపించాడు.

ఈ లోకంలో పుట్టి, నడయాడి, తమదంటూ ఒక ముద్రను వదిలివెళ్ళిన వారందరి పరలోక వైభవాన్ని, అనునిత్యం, అనుక్షణం దేవదూతల ఆరాధనలు, పొగడ్తలతో విలసిల్లే ఆనందమయ జీవితాన్ని వదిలి తండ్రి ఆజ్ఞ పాలనకోసం యేసుక్రీస్తు ఈ లోకంలో మరియమ్మ గర్భంలో రక్షకుడిగా అవతరించాడు. అసలు జనన మరణాలకు అతీతుడైన, పరలోకానికి మాత్రమే పరిమితమైన దేవుడు ఈలోకానికి రావాలనుకోవడం, అందులోనూ మరియమ్మ లాంటి ఒక పేద మహిళ గర్భాన జన్మించాలనుకోవడమే మానవాళి పట్ల దేవునికున్న ప్రేమను చాటిచెప్పే లక్షణం.

యేసుక్రీస్తు బాప్తిస్మం తీసుకొని దేవుని ప్రత్యక్ష పరిచర్యలోనికి ప్రవేశించేంత వరకూ ఒక నిరుపేదగా, అతి సామాన్యుడిగా, అన్నింటినీ మించి ఒక తన ఇహ లోకపు తండ్రి అయిన యోసేపు కులవృత్తి అయిన వడ్రంగి పనివాడుగా జీవనాన్ని గడిపాడు. ఇశ్రాయేలు దేశంలోని గలిలీయ ప్రాంతంలో ఉన్న నజరేతు అనే పల్లెటూరులో ఆయన బాల్యం, యవ్వనం గడిచింది. వివాదాలకు దూరంగా, తల్లిదండ్రుల ఆజ్ఞాపాలనే ధ్యేయంగా సాగిన ఆచరణీయమైన, ఆదర్శప్రాయమైన జీవితం యేసుక్రీస్తుది. అయితే తన జీవిత పరమోద్దేశ్యాన్ని, పరలోకపు తండ్రి సంకల్పాన్ని నెరవేర్చడానికి పూనుకున్న





SthanikaPalanaTelApril_2010.pmd 7 3/27/2010, 6:11 PM

తరువాత యేసుక్రీస్తు కేవలం మూడున్నరేళ్ళ పాటు ప్రత్యక్షంగా ప్రభువు సేవలో గడిపాడు.

తనకంటూ పన్నెండు మంది అనుచరగళాన్ని తయారు చేసుకొని వారితో పాటు ఇశ్రాయేలు దేశంలోనే అనేక ప్రాంతాలు సందర్శించి ప్రేమ, క్షమాపణ వంటి దైవిక సద్భావనలను ప్రజల్లో పెంపొందించేందుకు బోధనలు చేశాడు. నిన్ను నీవు ఎంత ప్రేమించుకుంటావో నీ పొరుగువారిని కూడా అంతే ప్రేమించాలంటూ ఆయన చేసిన బోధ అప్పుడూ ఇప్పుడూ కూడా ఆత్మీయ విప్లవాన్ని తీసుకువచ్చింది. ఎవరికి వారే యమునాతీరే అన్న విధంగా బతుకుతున్న మానవాళిని భుజం తట్టి నిద్రలోంచి లేపిన ప్రేమసూత్రం అది. అమాయక ప్రజలను దోచుకోవడం, వారిపైన దౌర్జన్యం చేయడమే లక్ష్యంగా సాగుతున్న రోమా సామ్రాజ్యపు పునాదుల్ని ఆయన బోధలు కదిలించాయి. ఆయన ఎక్కడికి వెళ్ళినా వేలాదిమంది ఆయన్ను అనుసరించారు. బాధాతప్తులు, శోకగ్రస్తులైన కష్టాలు, కన్నీళ్ళు కలతలతో నిండిన జీవితం నుండి తమకు విముక్తిని ప్రసాదించే 'మెస్సీయా' (రక్షకుడు)ను ఆయనలో చూశారు. దేవుడంటే అక్కడెక్కడో దూరంగా పరలోకంలో కూర్చొని మానవుడు చేసే మంచి చెడు కార్యాల మీద తీర్పు చెప్పి దండించే కఠినుడంటూ అంతకాలంగా చలామణిలో ఉన్న భావనను దూరం చేస్తూ, ఆయన మానవాళికి ముఖ్యంగా పేద ప్రజలను స్పర్శిస్తూ దగ్గరగా బతికాడు.



ఆనాటి యూదు మతస్థులకు, మతనాయకులకు మాత్రం ఆయన బోధలు మింగుడు పడలేదు. దేవుని పేరిట ప్రజల్ని నిలువుకొంటున్న మతాచార్యులు యేసుక్రీస్తును తమదారి నుండి అడ్డుతొలగించుకుంటే తప్ప తమకు భవిష్యత్తు లేదని గ్రహించి రోమా పాలకులతో కలిసి ఆయన మీద కుట్ర చేశారు. రోమా ప్రభుత్వం కూడా ఇశ్రాయేలు దేశంలో తమ మనుగడ కోసం యూదుల మీద యూదుమతాధిపతుల మీద పూర్తిగా ఆధారపడి ఉంది.

అందుకే యూదుమతాచార్యులు దైవ ద్రోహ నేరాన్ని దేశ ద్రోహ నేరాన్ని ఆయన మీద మోపి, వత్తిడి చేసి రోమా గవర్నర్ అయిన పిలాతు ద్వారా ఆయనకు మరణదండన విధింపజేశారు. సమాజానికి బెడదగా, పీడగా, ప్రమాదంగా పరిణమించిన కరడు గట్టిన నేరస్తులకు విధించే 'సిలువ' మరణ దండనను ఆయనకు విధించారు. ఆ విషయం విన్న సామాన్యుల గుండెలు చెదిరిపోయాయి. ఆయన అనుచరణమంతా చెలాచెదురై పోయింది. కాని ఆయన మాత్రం చలించలేదు. ఆయన స్థాపించబోయే పారలౌకిక ప్రేమ సామ్రాజ్యానికి పునాది తన రక్తంతోనే పడుతుందన్న వాస్తవాన్ని ఎరిగిన వాడుగా, శాశ్వత విజయం కోసం తాత్కాలిక అపజయం తప్పదని గ్రహించి ఆయన మౌనంగా సిలువ శిక్షను భరించాడు.

తనను సిలువవేస్తున్న వారినుద్దేశించి, తండ్రి వారేం చేస్తున్నారో వారికి తెలియదు గనుక వారిని క్షమించు అంటూ తన తండ్రికి ప్రార్థన చేసి 'క్షమాపణ' లో అత్యున్నతమైన ప్రమాణాలను నెలకొల్పాడు. ఆ ప్రార్థన అప్పుడూ ఇప్పుడూ కూడా ఈ లోకంలో ప్రతి చోటా ప్రతిధ్వనిస్తూనే ఉంది. 'కంటికి కన్ను, పంటికి పన్ను' అన్న విద్వేష సూత్రంతో నడిచిన లోకానికి' ఒక చెంపకొడితే మరో చెంప చూపించు అన్న యేసుక్రీస్తు బోధ అందులోని ప్రేమ మండుటెండలో మట్టికుండలోని చల్లని నీటిని తాగిన అనుభూతి నిచ్చింది. అలా బోధించడమే కాదు, యేసుక్రీస్తు ఆచరించి చూపించాడు కూడా. అందుకే చరిత్రలో యేసుక్రీస్తు తనదైన ఒక ప్రత్యేక ముద్ర వేయగలిగాడు.

అయితే మరొక వాస్తవం కూడా ఉంది. యేసుక్రీస్తు చరిత్ర, ప్రభావం సిలువ దండనతో అంతం కాలేదు. నిజానికి మానవాళిపై ఆయన తాలూకు ప్రభావం సిలువతో ఆరంభమయింది. కులాలు, మతాలు, వర్గాలు, దేశాల సరిహద్దులు దాటి అందరినీ స్పృశిస్తోంది. సిలువ తో మరణించిన యేసుప్రభువు మూడవ రోజు పునరుద్ధానుడై పరలోకానికి ఆరోహణుడయ్యాడు. ఆయన అనుచరులైన వారు మాత్రం ఆ సువార్తను ప్రపంచం నలుమూలలకూ తీసుకువెళ్ళారు. ఆ శిష్యుల్లోనే ఒకరైన థామస్ ఇండియాకు క్రీస్తు శకం 53లోనే సువార్తను తెచ్చాడు. సువార్త కెరటం ఇండియాలో మొదట కేరళను తాకింది. ఆయన కేరళలో సువార్త ప్రభోధం చేసి తమిళనాడుకు వచ్చాడు. తమిళనాడులోనే ఈనాటి చెన్నై సమీపంలో ఒక కొండ మీద నాటి ఛాందస మతవాదలు థామస్‌ను హత్యచేశారు.

అంటే ఇండియాలో యేసుక్రీస్తు సువార్త సౌరభాలు రెండువేల ఏళ్ళుగా పరిమళిస్తూనే ఉన్నాయి. ఎక్కడ బాధాతప్తులుంటారో అక్కడ యేసుప్రభువుంటాడు. ఎక్కడ కన్నీళ్ళు, దోపిడి, దౌర్జన్యం ఉంటుందో అక్కడ ఆయన సామ్రాజ్యానికి పునాదులు పడ్డాయి. దీనత్వం, సాత్వికత్వం, ప్రేమ, క్షమాపణ, దాతృత్వం, దయాళుత్వం, కనికరం, శాంతం, సహనం ఇవన్నీ కలబోసిన మూర్తిత్వం యేసుప్రభువుది. అందుకే ఆయన మానవాళికి ఆరాధ్యదైవం, కొందరికి ప్రత్యక్షంగా, చాలా మందికి పరోక్షంగా!!

- *రెవ.టి.ఎ. ప్రభుకిరణ్*





SthanikaPalanaTelApril_2010.pmd 8 3/27/2010, 6:11 PM

# శతవార్షిక అంతర్జాతీయ మహిళా దినోత్సవం




## వార్తల్లో 'అపార్డ్'

శతవార్షిక అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అపార్డ్ సిబ్బంది అందరికీ మార్చి 8, 2010 నాడు ఓపెన్ సెషన్‌ను నిర్వహించడం జరిగింది. సమావేశంలో డా. ఆర్. అరుణ్‌జ్యోతి మహిళా దినోత్సవ చరిత్రను, ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈనాటి దినోత్సవం ఒక చారిత్రాత్మక దినోత్సవమని శ్రీ సోలిపేట రామచంద్రారెడ్డి మాజీ పార్లమెంటు సభ్యులు చెబుతూ, మహిళలకు పార్లమెంటులోను, చట్ట సభల్లోను 1/3వ వంతు రిజర్వేషన్ బిల్లు గురించి వివరించారు. తదుపరి ప్రొ. కాంతారావు గారు, ఆర్థిక శాస్త్ర వేత్త, జెండర్ బడ్జెటింగ్ గురించి వివరించారు. అలాగే శ్రీమతి సుమామాలిని, అపార్డు ఫ్యాకల్టీ గారు మహిళా సాధికారత, లక్ష్యాలు, నైపుణ్యం ఆవశ్యకతను వివరించారు.

# 'అపార్డ్'ను సందర్శించిన డాక్టర్ జె.ఎం. ఫాతక్

రాష్ట్రంలో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అమలుచేస్తున్న వివిధ కార్యక్రమాలను కేంద్ర పంచాయితీరాజ్ మంత్రిత్వ అదనపు కార్యదర్శి డాక్టర్ జె.ఎం.ఫాతక్ మార్చి 2న సమీక్షించారు. 'అపార్డ్' కార్యాలయంలో రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ ఎం.వి.పి.సి. శాస్త్రి, శాఖ కమీషనర్ శ్రీ చంద్రమౌళి, 'అపార్డ్' కమీషనర్ శ్రీ ఫణికుమార్, గ్రామీణాభివృద్ధి కమీషనర్ శ్రీ రావత్, ఇతర అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.



# కౌన్సిలర్లకు శిక్షణ



ప్రభుత్వ - స్వచ్ఛంధ సంస్థల సమన్వయ సంఘం, మహిళ, శిశు అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో కౌన్సిలర్లకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం అపార్డులో నిర్వహించారు. ఫిబ్రవరి 16 నుంచి 26 వరకు జరిగిన ఈ కార్యక్రమంలో 60 మంది ( రెండు బృందాలుగా) పాల్గొన్నారు. ప్రభుత్వ - స్వచ్ఛంధ సంస్థల సమన్వయ సంఘం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ శ్రీ టి. గోపాల్ రావు, ఐ.ఏ.ఎస్ (రిటైర్డు) ఈ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, మహిళలకై ప్రత్యేకంగా అమలుపరుస్తున్న చట్టాల గురించి నిష్ణాతులలైన వక్తలు : ప్రొ. మాడభూషి శ్రీధర్, మహిళా శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి రాజ్యలక్ష్మి, డా. ఇ.వి. స్వర్ణలత, డిప్యూటీ డైరెక్టర్,అపార్డు, డా. సరోజ్ ఆర్య, డా. నాగసాయిమాలతీ, ప్రొ. నస్‌రీన్ భాను, శ్రీమతి అరుణారెడ్డి, శ్రీ గోపీనాథ్, ముజీబ్ కుమార్ న్యాయవాదుల ద్వారా వివరించారు.



SthanikaPalanaTelApril_2010.pmd 3 3/27/2010, 6:11 PM

## సంపూర్ణ పారిశుధ్యంపై వర్క్‌షాప్



'అ'పార్డ్'లో 16-02-2010 తేదీన 'సంపూర్ణ పారిశుద్ధ్యం'పై జరిగిన వర్క్ షాప్‌కు గ్రామీణ నీటి సరఫరా శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీమతి చిత్రా రామచంద్రన్ ముఖ్య అతిధిగా హాజరు అయ్యారు. UNICEF, RWS, WASSAN< HMRI (104), NIRD ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామాలలో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించేందుకు మార్గదర్శక సూత్రాలను, ఆచరణ ప్రణాళికను సూచించాలని ప్రతినిధులకు ముఖ్య అతిధి సూచించారు. ప్రతినిధులు మూడు గ్రూపులుగా విడిపోయి వ్యర్థ పదార్థాల నిర్వాహణ, ప్రణాళిక, శిక్షణ, ప్రసారమాధ్యమాల వినియోగం లాంటి విషయాలపై విపులంగా చర్చించి ఆచరణ ప్రణాళికను సూచించారు. దీనిలో భాగంగా 240 మంది శిక్షకులను తయారు చేసి వారి ద్వారా పంచాయితీరాజ్ సంస్థల ప్రతినిధులకు 'సంపూర్ణ పారిశుద్ధ్యం ఉద్యమం' పై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

## మహిళా ప్రజా ప్రతినిధుల శిక్షణా అవసరాలపై వర్కుషాపు



పంచాయితీరాజ్ సంస్థల మహిళా ప్రజా ప్రతినిధుల శిక్షణ అవసరాలపై ఒక రోజు వర్కుషాపు 05-03-2010న అపార్డు నందు నిర్వహించబడింది. దీనిలో ఒక్కొక్క జిల్లా నుండి ఇద్దరు వార్డు సభ్యులు, సర్పంచులు, యం.పి.పి.లు, జడ్.పి.టి.సి సభ్యులు, ఎస్.జి.ఓలు చొప్పున, ఐదు జిల్లాల నుండి ఈ వర్కుషాపులో పాల్గొన్నారు.

శిక్షణా అవసరాలు తెలుసుకోవడమే కాకుండా ఈ శిక్షణను ఎక్కడ జరపాలి, ఎప్పుడు జరపాలి అనే అంశాలపై కూడా చర్చించి, కార్యాచరణ ప్రణాళిక తయారుచేసేందుకు కావలసిన వివరాలు అన్నీ ఈ ఒక్క రోజు వర్కుషాపులో సేకరించడం జరిగింది. అపార్డు తరుపున శ్రీమతి. ఎస్. శారదాదేవి, ఫ్యాకల్టీ, సి.డి.పి&ఎ ఈ వర్కుషాపును అనుసంధానం చేశారు.

## సాక్షర భారత్‌పై వర్క్‌షాప్



జాతీయ అక్షరాస్యతా మిషన్, జాతీయ పాఠశాల, అక్షరాస్యత విద్యాశాఖ, కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా 'అపార్డ్'లో ఫిబ్రవరి 20న ఒక రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించాయి. 'సాక్షర భారత్' అమలుకు సంబంధించిన వివిధ అంశాలపై సంబంధిత అధికారులను, ఉద్యోగులను సమాయుత్తం చేయటానికి ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్రంలోని వయోజన విద్యాశాఖ, పంచాయితీరాజ్, మహిళా, శిశు అభివృద్ధి, ఎన్ఐఆర్‌డి, అపార్డ్‌ల నుంచి పలువురు ఈ వర్క్‌షాప్‌కి హాజరయ్యారు. జాతీయ అక్షరాస్యతా మిషన్ డైరెక్టర్ జనరల్ శ్రీ జగ్‌మోహన్ సింగ్ రాజు కార్యక్రమ అమలు వ్యూహాలపై సవివరంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలుకు సంబంధించిన విషయాలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ జె.సి. శర్మ వివరించారు.

## శ్రీ మాథ్యూ సి. కున్నంకల్ సందర్శన



శ్రీ మాథ్యూ సి. కున్నంకల్, ఐ.ఎ.యస్., జాతీయ గ్రామీణాభివృద్ధి, రాజేంద్రనగర్‌లో డైరక్టర్ జనరల్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత 'అపార్డ్'ను 17-03-2010న సందర్శించారు. పంచాయితీరాజ్ సంస్థల ప్రతినిధుల పరిపాలనా సామర్ధ్యాలను పెంచేందుకు 'అపార్డ్' నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను ప్రశంసిస్తూ, మున్ముందు జాతీయ సంస్థ, 'అపార్డ్' కలిసి ఎన్నో కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.



SthanikaPalanaTelApril_2010.pmd 4 3/27/2010, 6:11 PM



# పల్లె ప్రజల గుండె గీతాలు . . . జానపద గీతాలు

**పల్లెల్లోని జన సామర్థ్యం నుండి పుట్టుకొచ్చిన పదాల ప్రవాహమే 'జానపదం'. ప్రజలు తమ భాషలో, తమలోని భావాలకు అక్షరరూపం ఇచ్చి, తమ గళంతో ఆ భావాలకు ప్రాణం పోసే ప్రక్రియ ఈ జానపదం. మనకున్న అన్ని కళల్లో ఇదీ ఒక కళే. బాగా చదువుకున్న వారికి ఆంధ్ర సాహిత్యంలో ఎన్నో గ్రంథాలు కోకొల్లలుగా బయలుదేరి వారిని సాహిత్యపథం వైపు మళ్ళిస్తే, పల్లెల్లో పనులు చేసుకుంటూ వుండే ప్రజల్ని ఆకట్టుకున్న ఆంధ్ర సాహిత్యమందలి రెండో రంగం జానపద సాహిత్యం.**

జానపద గీతాలు ప్రజల్లో వాడుకలో ఉండే పదాలను కలిగియుండి ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుని ఆంధ్ర సాహిత్యంలో మన వైశిష్ట్యాన్ని చాటుకున్నాయి. ప్రబంధ సాహిత్యకాలంలో కూడా ఈ జానపద సాహిత్యం దాని కన్నా ఎక్కువగా కాకున్నా ఇంచుమించు సరిసమానంగా ప్రజలలోకి చొచ్చుకుపోయింది. నన్నెచోడుని, పాలకుర్కి సోమనాధుని కాలంలోని దేశీయ కవిత్వపు పోకడలు ఈ జానపద సాహిత్యంలో మనకు విశేషంగా కనబడతాయి.

ఆంధ్ర సాహిత్యంలో కూడా ఈ దేశీయ పోకడలు విశేషంగా







ఉన్నాయి. దేశీయ కవిత్వం విస్తృతంగా ఉన్న ఆ కాలంలో పాటలు, గీతాలు, ఏలలు, యక్షగానాలు, రగడలకు విశేష ప్రాచుర్యం ఉండేది. ఆనాటి కాలంలో కఠిన పదాలతో జానపద సాహిత్యం జన సామర్థ్యం నుండి క్రమేపి దూరమైంది.

నేటి కాలంలో పెరుగుతున్న విజ్ఞానం దృష్ట్యా ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి, పరిశోధించి బయల్పరచాలనే తృష్ణ ప్రతి ఒక్కరిలో నెలకొని ఉంది. పైగా ప్రభుత్వం రేడియో, టీ.వి. లాంటి ప్రచార సాధనాలు ఈ జానపద గీతాలపై శ్రద్ధ చూపడంతో ఎంతోమంది ఉత్సాహవంతులు పల్లెల్లోకి వెళ్ళి మరుగున పడిన జానపద సాహిత్యాన్ని గీతాలు, పాటల రూపంలో సేకరించి బయల్పరుస్తున్నారు.

ఈ జానపద గీతాలు విద్యావంతులలో దాదాపు తొంభై శాతం మందిని అలరిస్తున్నాయంటే కారణం ఆ పాటలు, గీతాలలోని పదాలు, నిజాలు, సూక్తులు, హెచ్చరికలు ఎన్నో ఉండడం. పైగా విద్యావంతులు వాటిపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ, ఆదరణ వలన మరుగునపడిన ఈ జానపద సాహిత్యం బయల్పడి అందరినీ అలరించి వారి మనసుల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నదంటే అందరికీ సంతోషమే మరి.



జానపద గీతాలకు, పాటలకు రచయితలు ప్రజలే. తమలో ఎగిసే భావాలకు అక్షరరూపాన్ని క్రమంగా అమర్చి పాటలను కట్టేది రచయితలైన ఆ ప్రజలే. కాబట్టి ఈ జానపద గీతాలకు, పాటలకు రచయితలంటూ ప్రత్యేకంగా లేరు. కాని నేటి ఆధునిక కాలంలో నాటి జానపద ప్రక్రియల ఆధారంగా పాటలు, గీతాలు చాలామంది రాస్తున్నారు.

ఈ జానపద సాహిత్యంలో శృంగార గీతాలు, ధవళములు, ఏలలు, జోలలు, తత్వములు, దరువులు, మంగళహారతుల లాంటి ఎన్నో పదాల పొందికతో కూడిన వివిధ గీతాలతో కూడిన ప్రక్రియలు కోకొల్లలు. వీటిని వివాహాలలో, నోములలో, పండుగలలో, పొలాలలో, కలుపుతీసే సమయాలలో, కపిలె తోలేప్పుడు, పెరుగు తీసేప్పుడు, బియ్యాన్ని రోళ్ళల్లో దంచేప్పుడు. విసిరేప్పుడు, అందరూ ఒకచోట కలిసేప్పుడు, రోజువారీ కార్యక్రమాలలో పాడతారు. పవిత్రమైన రోజులలో పాడుకునే పాటలు,











వారు 'కోలాటం' చేస్తారు. స్త్రీలలోని అందచందాలను, అంగాంగాల్ని వర్ణిస్తూ పాడే కోలాటపు పాట, ఇతరాలు ఇందులో ముఖ్యమైనవి.

పల్లెల్లోని స్త్రీలు పొద్దంతా కష్టించి పనిచేసి అలసిపోయి వుంటారు. ముందు ముందు చేయబోయే పనులలో అలసట కనిపించకుండా ఉండడానికి కోడలుతో కలిసి పాడే దంపుళ్ళ పాట జనంలో విశేషంగా ప్రచారంలో ఉంది. జొన్న, మొక్కజొన్న పంటలను విలువైన వస్తువులతో పోలుస్తూ అందులో తమ జీవన విధానాలను, సామెతల ను జీవన విధానాలను, సామెతలను జోడించి తెలియపరచడం మీద కూడా అనేక రీతులలో జానపద ప్రక్రియలున్నాయి. రైతులు ప్రభాత సమయాన నిద్ర నుండి లేవగానే పాట, ఎద్దులకు పేర్లు పెట్టుకుని పాడే పాట, పొలాలలో కలుపు తీసేటపుడు పాడేపాట, వయస్సులో ఉన్న పల్లెయువతుల్ని ఆ పల్లెల్లోని యువకులు తమని ఆకర్షించడానికి పాడే పాటలు ఇప్పటికే ప్రజల్లో ప్రచారంలో ఉన్న జానపద ప్రక్రియలు.



జానపద సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లోని విషయాలు, సందేశాలూ ఎన్నో నగ్న సత్యాలను, మనలోని దోషాలను ఎత్తి చూపుతుంటాయి. ఇది ఒకందుకు మంచిదే. మనలోని లోపాలను మనం తెలుసుకోగలము. నాటికీ, నేటికీ ఈ జానపద సాహిత్యం పల్లెసీమల్లో తన స్థానాన్ని పదిలంగా నిలపుకుంది.



పల్లెల్లోని పచ్చదనమే దేశసౌభాగ్యం కనుక, పల్లెల్లోని ప్రజల అవిశ్రాంత శ్రమని మరచిపోవడానికి దోహదపడుతుంది ఈ జానపద సాహిత్యం. ఈ సాహిత్యం వేగంగా అభివృద్ధి నొందుతున్న కాలచక్రం ఇరుసుల క్రింద మరుగు పడిపోకుండా ప్రతి ఒక్కరూ శ్రద్ధ కనబరచడం హర్షణీయం.

మన రాష్ట్రంలో ఈ రంగంలో తెలుగు విశ్వవిద్యాలయం కృషిని చేస్తున్నది. ఏది ఏమైనా పల్లెల్లోని ప్రజల్లో నిరాశానిస్పృహలను పారద్రోలి వారిలో చైతన్యాన్ని నింపి వారిని కర్తవ్యోన్ముఖులుగా తీర్చిదిద్దుతున్న ఒకే ఒక సాధనం ఈ జానపద సాహిత్యం.

*-ఎ.ఎమ్. ఫీచర్స్*

వృక్షో రక్షతిః రక్షతః అని అంటారు. అంటే, మనం వృక్షాలను పెంచితే, కాపాడితే అవి మనను కాపాడతాయని అర్థం. ఒక తరం మనుషులు చెట్టు నాటితే, అవి రెండోతరం మనుషులకు నీడనిస్తాయని చైనా సూక్తి చెప్తుంది. అంటే, మనం మొక్కలు నాటితే, అవి వెంటనే మనకు తక్షణమే ఉపయోగపడకపోవచ్చు కానీ, మన తరువాతి తరానికి అవి ఖచ్చితంగా, రక్షణ కవచాలుగా ఉపయోగపడతాయని చైనా సూక్తికి అర్థం.

మన వాతావరణ సమతుల్యతను కాపాడటంలో, పర్యావరణ పరిరక్షణలో చెట్లకున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. అందుకే చెట్లపై వివిధ దేశాల్లోని మహానుభావులు ఎన్ని సూక్తులు చెప్పారో అంతేలేదు.

ఒక చెట్టు ముందు నిలబడి తదేకంగా ఆ చెట్టును చూస్తే, భగవంతుడ్ని చూసినట్టేనని జోసెఫ్ కేంప్‌బెల్ అనే ఆయన అంటారు.



# పచ్చని చెట్లున్న చోటే

చెట్టు ఎంత ఎత్తుకు ఎదిగినా, దాని ఆకులు తిరిగి చెట్టు పాదాల (వేర్లు) చెంతకే చేరుకుంటాయని మలేసియా సూక్తి.

మీ హృదయంలో ఒక పచ్చని చెట్టును ఊహించుకోండి. అక్కడికి ఒక పాడే కోయిల కూడా వచ్చేస్తుందని మరొక చైనా సూక్తి చెప్తుంది.

భగవంతుడి ప్రథమ దేవాలయాలు చెట్లేనని విలియం కలిన్ బ్రియాంట్ అనే మహానుభావుడు అంటారు.

ఒక మొక్కను నాటితే, ఆ దేవుడికి సేవచేసినట్లే. ఎందుకంటే అనేక తరాల పాటు ఆ చెట్టు ఎందరో మనుషులకు సేవ చేస్తుంది. వారందరినీ ఆ చెట్టు నాటిన మనిషి చూడకపోయినా, వారంతా ఆ మనిషిని దీవిస్తారని హెన్రీవాన్‌డైక్ అంటారు.

“చెట్లు, పొదలు పాడే గుసగుసల పాటతోనే నేను పెరిగాను.







పూల ద్వారానే ప్రేమించటం నేర్చుకున్నాను'' అని ఫ్రెడరిక్ హోల్డర్‌లిన్ అంటారు.

మనిషి తన పుట్టుక సమయంలో మొదటిసారి ఊపిరి పీల్చడానికి ముందు గడిపిన 9 నెలల కాలంలో తప్ప, తన సొంత వ్యవహారాల ను ఎప్పుడూ ఒక చెట్టు మాదిరిగా చక్కబెట్టుకోలేడని ప్రసిద్ధ బ్రిటిష్ రచయిత జార్జ్ బెర్నార్డ్ షా అనేవారు.

చెట్ల గురించి తెలుసుకోవటం ద్వారా ఓర్పుకి అర్థం తెలుసుకున్నానని, గడ్డి గురించి తెలుసుకోవటం ద్వారా ఓపికకు అర్థం తెలుసుకున్నానని హాల్ బోర్లాండ్ అంటారు.

ఒక చెట్టు మరణిస్తే, అది ఉండిన చోటులోనే మరొక మొక్క నాటాలని లినాయుయస్ చెప్తారు.

చెట్లు మనకు అన్నీ ఇస్తాయి. ఈ లోకాన్ని అందంగా తీర్చిదిద్దుతాయి. మనకు ఆహారం ఇస్తాయి. మన భవనాలకు కలప అందిస్తాయి. మన చెట్ల జాతికి మనం అనంతమైన ప్రేమను, ఆరాధనను అందించవలసి ఉందని 19వ శతాబ్దానికి చెందిన చిత్రకారుడు జాన్ రస్కిన్ చెప్పారు.

"కాలంతో పాటు నిలదొక్కుకునేవి, అందమైనవి, వివేక వంతమైనవి, గొప్పవి, పవిత్రమైనవి, పురాతనమైనవి అయిన చెట్లు అత్యున్నత స్వర్గాన్ని అందుకోగలవు. భూమిలోని అతి లోతుల్లోని రహస్యాలను కూడా ఛేదించగలవు. ఆధ్యాత్మికత తోటి, భౌతిక పదార్థం తోటి చెట్లు సంధాన పరుచుకోగలవు. చెట్లు అడవులను రక్షిస్తూ, పాడు చేయకూడని ప్రదేశాల ను పవిత్రీకరిస్తాయి. చెట్లు మనల్ని జాగ్రత్తగా చూసుకుంటాయి. ఈ భూమిపై నివసించడానికి మనకు ఏమికావాలో అవన్నీ చెట్లు ఇస్తాయి. ధ్యానానికి, వివేకానికి, మార్గదర్శనానికి, స్ఫూర్తికి చెట్లు నిదర్శనంగా నిలుస్తాయి. చెట్లకు ఆత్మ ఉంది'' అని లావెండర్ వాటర్ సుదీర్ఘంగా చెట్లను వర్ణించారు.

# పాడే కోయిలలు







జేమ్స్ జి.వాట్ అనే వ్యక్తి కూడా సరిగ్గా ఇటువంటి భావాన్నే వ్యక్తం చేశారు. మనుషులు మంచి చెట్లను పడగొట్టి, చెడ్డ వార్తా పత్రికలను వెలువరిస్తున్నారు అని ఆయన అంటారు.

ఇవ్వాళ ఒకరు చెట్టు నీడలో కూర్చున్నారంటే, చాలా కాలం క్రితం ఎవరో అక్కడ మొక్క నాటారని అర్థం అని వారన్ బఫెట్ అంటారు.

దాని పండుని బట్టే ఒక చెట్టుని గుర్తిస్తాం. అదే విధంగా చేతలను బట్టే, ఒక మనిషిని గుర్తిస్తాం. ఒక మంచి పని ఎప్పటికీ నశించదు. మర్యాదను నాటిన వ్యక్తి స్నేహాన్ని కోసుకుంటారు. దయను నాటిన వ్యక్తి ప్రేమను పోగు చేసుకుంటారు, అని బాసిల్ చాలా అందంగా వర్ణిస్తారు.

మొక్కని నాటే వ్యక్తి ఒక ఆశను కూడా నాటినట్లేనని లూసి లార్కోమ్ అంటారు.

యాపిల్ పండులో దాగివున్న ఒక గింజ నిజానికి కనిపించని ఒక పండ్లతోట అని వెల్ష్ సూక్తి.

“ఈ భౌతికమైన శరీరాలతో కనిపించకుండా ఉండే దేవతలకు చెట్లు నివాసంగా ఉంటాయి. అయితే దేవతలు చెట్ల కొమ్మల్లోనూ, బెరడుల్లోనూ నివాసముంటారు. ఆకుల నుంచి వారి ఆహారాన్ని పొందుతారు. చెట్ల ద్వారానే మాట్లాడతారు. కొన్ని చెట్లయితే, పవిత్రమైన స్థలాలకు శాశ్వత రక్షకులుగా ఉండి పోతాయి అని హిందూ దేవ శాస్త్రం చెప్తుంది.

ఆత్మ రక్షణ కోసం తప్ప, ఒక చెట్టు ఎన్నడూ వాహనాన్ని ఢీ కొట్టదని మరొక సూక్తి.

చెట్లు లేని తోటను అసలు తోట అని అనడానికే వీల్లేదని హెన్రీ ఎల్లాకోంచ్ అంటారు.

“భూమి ఆకాశంపై రాసిన కవితల వంటివి చెట్లు. మనం వాటిని పడగొట్టి, కాగితంగా మారుస్తాం. మన డొల్లతనం గురించి రాసుకోవడానికి”, అని ఖలీల్ జిబ్రాన్ ఎంతో పదునైన మాటల్లో వర్ణించారు.

ఏ సమాజంలో అయితే వృద్ధులు తాము నాటే మొక్కలు పెరిగిన తరువాత వాటి నీడలో తాము కూర్చోలేమని తెలిసి కూడా మొక్కలను నాటుతారో ఆ సమాజం చాలా గొప్పగా ఉంటుంది అని గ్రీకు సూక్తి.

“రేపు ఈ ప్రపంచం విచ్ఛిన్నమైపోతుందని తెలిసినప్పటికీ నేను యాపిల్ మొక్కను నాటుతాను” అని 16వ శతాబ్దానికి చెందిన మార్టిన్ లూథర్ అనేవారు.

ఇట్లా చెప్పుకుంటూ పోతే చెట్ల ప్రాధాన్యతను తెలిపే సూక్తులు లెక్క లేనన్ని ఉన్నాయి.









తెలిసింది కాబట్టే , మనవాళ్లు తరాల గురించి వర్ణిస్తున్నప్పుడు 'వంశవృక్షం', 'సంసార వృక్షం' అంటుంటారు. ఒక వయస్సు వచ్చాక వనాలలోకి వెళ్లి తపస్సు చేసుకోవాలని, చెట్ల మధ్యలో గడుపుతూ భగవంతుడిని ధ్యానం చేసుకోవాలని చెప్పేవారు. మన వేదాల్లోని ప్రతి వేదంలో అరణ్యకం ఒక భాగం. ఆయుర్వేదం అయితే పూర్తిగా చెట్ల మూలికలపై ఆధారపడిన వైద్యశాస్త్రం.

ఇక సాహిత్యంలో అయితే, చెట్లతో మాట్లాడటం, చెట్లు మనుషులతో మాట్లాడటం, చెట్లు నిద్రించడం వంటి అనేక వర్ణనలు చోటు చేసుకున్నాయి. కవి ఇస్మాయిల్ 'చెట్టు నా ఆదర్శం' అని, 'చిలకలు వాలిన చెట్టు' అని అందమైన కవితలు రాశారు.

చెట్లపై అపారమైన ప్రేమతో ఉత్తరప్రదేశ్‌లో సుందర్‌లాల్ బహుగుణ చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపారు. 'చిప్‌కో' అనే పేరిట అది ప్రసిద్ధమైంది. చెట్లను నరకడానికి ఎవరైనా వస్తుంటే, ఆ చెట్టుని కౌగిలించుకొని, ముందు తనను నరకమనే వారు. చెట్లను ఇంతగా ప్రేమించిన సుందర్‌లాల్ ఎంతో ఆదర్శ ప్రాయులు.



మన సంప్రదాయాల్లో ప్రతి మొక్కకు భగవంతుడితో అనుబంధం వుంది. అశ్వత్థ వృక్షానికి విష్ణువుతో, మారేడు, బిల్వ, జిల్లేడు చెట్లకు శివుడితో అనుబంధం. ఇక తులసి మొక్క అయితే లక్ష్మీదేవికి ప్రతీక. నవగ్రహ వృక్షాలు అని తొమ్మిది గ్రహాలకు తొమ్మిది వృక్షాలున్నాయి. శమీ వృక్షం (జమ్మి చెట్టు) విజయానికి ప్రతీక. విజయదశమితో ఈ చెట్టుకి అనుబంధం వుంది. సంక్రాంతి పండుగకు గొబ్బిపూలు ప్రాధాన్యం చెప్పనక్కరలేదు.

అందుకనే మన ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఒకసారి ఇలా అన్నారు. "అడవుల స్థానంలో నాగరికతలు వచ్చాయి. నాగరికతల స్థానంలో ఎడారులు వస్తాయి", అని. అంటే మానవ నాగరికత అడవులను నిర్మూలించి, ఆ తరువాత ఎడారులను తీసుకుని వస్తున్నదని అర్థం.

మనిషి ఎంత నాగరికుడైనా చెట్లను ప్రేమించి, వాటితో సహజీవనం చేసినప్పుడే మన సమాజాలు ఎడారులు కాకుండా వుంటాయి. పచ్చని చెట్లున్న చోటికే పాడే కోయిలలు, ఝుమ్మని నాదం చేసే తుమ్మెదలు, అందానికే అందం లాంటి సీతాకోక చిలుకలు వస్తాయి.

ఈ సందర్భంగా మన ప్రాచీన సూక్తిని గుర్తు తెచ్చుకోవాలి.

"మంత్రానికి పనికిరాని అక్షరం లేదు.
ఔషధంగా పనికిరాని వృక్షం లేదు.
అయోగ్యుడైన మానవుడు లేడు".

– గొట్టిపాటి సుజాత





# అంబేద్కర్ ఆలోచనలు నేటికీ సజీవం



**శాస్త్రవేత్తలు తమ ఆలోచన సరళి ద్వారా ఆ సమాజంలో నిత్యం జీవించి ఉంటారు. వారి ఆలోచనలు ఆ సమాజపు నడవడిక తీరుతెన్నులను ఎప్పుడూ వెంటాడుతుంటాయి. ఏవైనా క్లిష్ట సమస్యలు ఎదురైనపుడు వారు ఏ విధంగా ఆలోచించారు. ముందుగా ఆ పద్ధతిని గూర్చి ఏమన్నారనే దాన్ని విధాన నిర్ణయకర్తలు పరిశీలిస్తారు.**

అలాంటి వారిలో భారతదేశం ఎల్లప్పుడు గుర్తుంచుకొనే మహాత్మాగాంధీ, జవహార్‌లాల్ నెహ్రూ, సర్ధార్ పటేల్, డాక్టర్ అంబేద్కర్ వంటి మరికొందర్ని చెప్పుకొనవచ్చు. ప్రస్తుతం డాక్టర్ అంబేద్కర్ ఆలోచనలు నేటి పరిస్థితులలో వాటి అవసరాన్ని గూర్చి పరిశీలిద్దాం.

డాక్టర్. అంబేద్కర్ భారతదేశ రాజ్య నడవడిక సాంఘిక పురోగతి, విద్య, మహిళల స్థితిగతులు, న్యాయసమీక్ష తదితర అంశాలపై వ్యక్తం చేసిన అంశాలు నేటికీ అవసరం. డాక్టర్ అంబేద్కర్ ఉదారవాదం, గ్లోబలైజేషన్‌లను గూర్చి ఎన్నడో ఊహించారు. ఆనాడు సోషలిస్టుల పంథా, పెట్టుబడిదారీ పంథాలు నడుస్తున్నాయి. సోషలిస్టు పంథా కొంతకాలమే కొనసాగుతుందని, తరువాత తనంతతానే కూలిపోతుందని ఆయన ముందుగానే ఊహించారు. అలాగే 75 సంతవ్సరాల నిజమైన కల అయిన సోషలిస్టుల రష్యా ఆధిపత్యం కుప్పగా కూలిపోయింది.

అందుకే అంబేద్కర్ ఈ రెండు పంథాలకు మధ్యస్థమయిన పార్లమెంటరీ వ్యవస్థను ఎన్నుకొన్నారు. పార్లమెంటరీ వ్యవస్థలో శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖలు పనిచేస్తూ దేశ ఐక్యత, సంస్కృతి తీరుతెన్నులను పరిరక్షించు కొనగలవని ఆయన ప్రతిపాదించారు.

ఇటీవల కాలంలో భారతదేశంలో ఒక శాఖ విఫలమయితే మరొక శాఖ దేశభవిష్యత్తును కొనసాగించుస్తు నడుస్తున్నాయి. ఇటీవల ఇండియాలో కేంద్రీకృత ధోరణులు ఏకపార్టీ, ఏకవ్యక్తి, ఏక కుటుంబం తదితర పాలనా విధానాల ప్రాముఖ్యత తగ్గి అనేక పార్టీలు, వర్గాలు, వ్యక్తుల ప్రాముఖ్యత పెరిగింది.



SthanikaPalanaTelApril_2010.pmd 12 3/27/2010, 6:11 PM

అదేవిధంగా పశ్చిమ దేశాలు రష్యా పతనానంతరం ఇండియా కూడా విచ్ఛిన్నమౌతుందని తలచారు. కాని ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని భారతదేశం తన విశిష్టతను నిలుపుకొంటూ నూతన శతాబ్దిలో అడుగుపెట్టి ప్రపంచ ఖ్యాతిని పొందింది. ఆ బాటలోనే నడుస్తోంది. అంటే ఆనాడు మన రాజ్యాంగ నిర్ణేతగా ఆయన వేసిన పునాది ఎంత గట్టిదో మనం ఊహించవచ్చును. ఆనాడు డా॥ అంబేద్కర్ అధ్యక్ష తరహా పాలన, ఏకస్వామ్య పాలనను నిర్ణయించకుండా మధ్యస్థ పాలనకు పోతున్నారని పలువురు విమర్శించారు. కాని పార్లమెంటరీ వ్యవస్థ కనుక నేడు లేకపోయినట్లయితే దేశం ఎన్నో క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనేది. అంటే, అంబేద్కర్ రాజ్యాంగబద్ధమైన పాలన, అందరికీ ఓటు హక్కు, అంటే మహిళలకు కూడా ఓటు హక్కు కల్పించబడింది. ఇండియాలో ధనిక-పేద, విద్యా- విద్యార్హత లేకుండా అందరికీ సమాన ఓటు అవకాశం కల్పించబడడంతో ప్రపంచంలోనే అత్యంత ప్రజాస్వామిక దేశంగా యావత్తు దేశాలు గుర్తించాయి.



నేడు మన రాజ్యాంగపు పని తీరు మీద అనేక విమర్శలు ఉన్నాయి. దానిపై అప్పుడే డా॥ అంబేద్కర్ ఈ విధంగా పేర్కొన్నారు. 'రాజ్యాంగం ఎంత మంచిదైనా కావచ్చు. దాన్ని అమలులోకి తీసుకొచ్చే వాళ్ళు చెడ్డ వాళ్ళయితే దుష్ఫలితాలే ఒనగూడుతాయి. అలాగే రాజ్యాంగం ఎంత చెడ్డదైన గానీ, అమలుపరిచే వారు మంచి వాళ్ళయితే సత్ఫలితాలు వస్తాయి. రాజ్యాంగం పనితీరు మొత్తం దానిలో ఏం లిఖితమై ఉందన్న దానిని బట్టి నిర్ణయం కాదు'' అని చెప్పారు. రాజ్యాంగం ప్రభుత్వ శాఖలను మాత్రమే అంటే శాసన నిర్మాణ, కార్య నిర్వహణ, న్యాయశాఖలను నిర్ధారిస్తుంది. అవి పనిచేసే తీరు ప్రజల మీద, వారు తమ అభిప్రాయాలను ప్రతిబింబించడానికి ఏర్పాటు చేసుకున్న రాజకీయ పార్టీల మీద ఆధారపడి ఉంటుంది. భారత ప్రజలు, వారి రాజకీయ పార్టీలు భవిష్యత్తులో ఎట్లా ప్రవర్తించుతాయన్నది ఇప్పుడేం చెప్పగలం.

మరో వ్యాఖ్యానం చేస్తూ అంబేద్కర్ రాజ్యాంగం తయారీలో రాజ్యాంగ సభకు ఎటువంటి పక్షపాత ఉద్దేశాలూ లేవన్నారు. భవిష్యత్తులో పార్లమెంటు రాజ్యాంగ సభగా సమావేశం జరిపినట్లయితే రాజ్యాంగంలో కొన్ని అధికరణలు అడ్డుపడడం వలన నెరవేరని ప్రయోజనాలను ఈ రకంగా అంటే రాజ్యాంగం మార్చాలనే డిమాండ్‌తో నెరవేర్చుకొనేందుకు పార్టీల వారు ప్రయత్నిస్తారు.ఇలాంటి పోకడలను నిరోధించేందుకు పార్లమెంటుకు సరైన అధికారం ఉంది. రాజ్యాంగసభకు అలాంటి అధికారం లేదని, 1948 నవంబరు 4న రాజ్యాంగ సభలో ముసాయిదా రాజ్యాంగాన్ని సమర్థిస్తూ వ్యాఖ్యానించారు. ఈ అభిప్రాయాలు ఎంత హేతుబద్ధమైనవో నేడు నిరూపణ అవుతుంటే డాక్టర్ అంబేద్కర్ ఎంతగా రాబోయే అంశాలను గ్రహించ గలిగారో అర్థశాస్త్ర నిపుణులు ద్యోతకమౌతుంది.



డాక్టర్ అంబేద్కర్ ఆర్థిక ఆలోచన సరళి, ఆయన అర్థశాస్త్రంపై పరిజ్ఞానం కొందరికే తెలుసు. అర్థశాస్త్రంలో ఆయనకు రెండు డాక్టరేట్లు వచ్చాయి. బ్రిటిషు పాలనలో భారత ప్రావిన్సులు (రాష్ట్రాలు) ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. ఈ అంశాన్ని పరిశోధించినందుకు 1916లో కొలంబియా విశ్వవిద్యాలయం అంబేద్కర్‌కు డాక్టరేటును ఇచ్చింది. చిన్న కమతాలు సాగుచేసే సన్నకారు రైతుల ఇబ్బందులను అధ్యయనం చేసి, పారిశ్రామికీకరణ అనంతరం భూసంస్కరణలను చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. అంటే మనదేశంలో భూ సంస్కరణలను గూర్చి చట్టాలు వచ్చినా, వాటిని అమలు చేసే చిత్తశుద్ధి కరువై కాగితాలకు, లిటిగేషన్స్‌కు కోర్టులకే పరిమితం అయ్యాయి.

అంటే ఆనాడే దేశ ఆర్థిక స్థితిని గూర్చి స్పష్టమైన అంబేద్కర్ ఆలోచనలు నేటికీ ఎంత అవసరమో అర్థమవుతుంది. 1922లో లండన్ విశ్వవిద్యాలయం ఆయన వ్రాసిన రూపాయి విలువకు సంబంధించి చేసిన పరిశోధక వ్యాసాలకు డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ఆనాటి బ్రిటిషు విధానాల ఫలితంగా భారత ఎగుమతులకు నష్టాలు వాటిల్లకుండా ఉండాలంటే, రూపాయి విలువను



SthanikaPalanaTelApril_2010.pmd 13 3/27/2010, 6:11 PM

తగ్గించాలన్నారు అంబేద్కర్. మారక విలువల మతలబుల ఫలితంగా ఆర్థిక వ్యవస్థ ఎలా నష్టపోతుందో అని హిల్టన్‌యంగ్ కమీషన్ ముందు ఆయన 1926లో సోదాహరణంగా వివరించారు. ఆ వివరణలు నేటి స్థితికి ఎంతో విలువైనవి.

మార్కెట్ శక్తులు సాంఘిక అసమానతలు పెంచుతాయని అంబేద్కర్ భయపడ్డారు. అదే రీతుల్లో నేటి పోకడలు దేశంలో కొనసాగుతున్నాయనే విషయాన్ని మనం గమనించవచ్చు. డాక్టర్ అంబేద్కర్ తొలి రచనలో సామ్యవాదాన్ని ఆహ్వానించారు. తరువాత రచనలలో నైతిక విలువలను చొప్పించి రచన గావించి రాబోయే తరాలకు మార్గదర్శకుడయ్యారు.

డాక్టర్ అంబేద్కర్ కేవలం నిమ్నజాతుల అభ్యున్నతి కోసం మాత్రమే కృషి చేసారన్నది అర్ధ సత్యమే. హిందూ సమాజంలో కుల వివక్షతకు బలై అమానుష జీవితం గడుపుచున్న షెడ్యూల్డు కులాలకు రాజ్యాంగ రక్షణలు కల్పించడంలో విశేష కృషి సల్పారు. అదేవిధంగా హిందూ సమాజంలో దళితుల వలె పురుషాధిక్యత ఉక్కు పాదాల క్రింద బానిసలుగా బలౌతున్న స్త్రీ లోకాన్ని ఉద్ధరించడానికి కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా డాక్టర్ అంబేద్కర్ 1951 ఫిబ్రవరిలో హిందూ కోడ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టారు.

హిందూ స్త్రీలు స్వేచ్ఛలేక, ఆస్తిహక్కు లేక, విద్యాభ్యాసం లేక పురుషునికి బానిసగా బ్రతుకీడుస్తున్నందు వలన వారి శ్రేయస్సు కోసం సమాన ఆస్తిహక్కు, విద్యావకాశాలు, సమాన గౌరవం, స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, దత్తత హక్కు, విడాకుల హక్కు, పునర్వివాహ హక్కులను కల్పిస్తూ ప్రవేశపెట్టిన

ఆ విప్లవాత్మకమైన బిల్లును ప్రగతికాముకులైన శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, నరహరి గాడ్గిల్, హెచ్.వి.కామత్, ఆచార్య కృపలానీ వంటి మహానాయకులు గట్టిగా సమర్ధిస్తూ, ఆయనను ఒక మహర్షిగా, స్త్రీ దాస్య విమోచకుడుగా కొనియాడారు. అంటే ఆ హిందూకోడ్ బిల్లును ఆనాడు పార్లమెంటు ఆమోదించి ఉంటే మహిళల స్థితి మరో విధంగా ఉండేది. అంబేద్కర్ ఆశించిన మహిళాభ్యున్నతికి ఆయా నాయకులు కృషి చేస్తున్నా ఇంకా ఆశయాలను నెరవేర్చలేకున్నారు. ఆయన ఆశించిన మహిళల అభివృద్ధి నేడు కూడా జరగవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది.

ఇటీవల కాలంలో అంబేద్కర్ ఆర్థిక సిద్ధాంతాల మీద తరచుగా చర్చ జరుగుతోంది. ఆర్థిక సంస్కరణలు షెడ్యూల్డు కులాలకు, పేదవర్గాలకు అన్యాయం చేస్తున్నాయన్న వాదన బాగా పెరిగింది. ఆ అంశాలపై సాంఘిక, ఆర్థక నిపుణులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం





SthanikaPalanaTelApril_2010.pmd 14 3/27/2010, 6:11 PM

చేస్తున్నారు. నేటి మార్కెట్  విధానాలను డాక్టర్ అంబేద్కర్ సమర్ధించే వారని కొందరు రచయితలు (నరేంద్ర జాదవ్) అంటున్నారు. అదే విధంగా ప్రపంచీకరణ ఫలితంగా దళితులకు మేలు కలుగుతుందని మరికొందరు (దివాకర్ ఖోయెర్, సిద్ధార్ధ కాంబ్లే) నిపుణులు భావిస్తున్నారు. స్వదేశీ విధానాలు ఉన్నత వర్గాలు, కులాల  వారికి లాభం చేకూర్చాయని అంటారు. 1991 నుండి సరళీకృత విధానాలు అమలు జరుగుతున్నాయి. అంతకుముందున్న  ఆర్ధిక వ్యవస్థ అగ్రవర్ణాల చెప్పుచేతల్లో పనిచేసిందని, దానివలన దళితులకు ఒరిగింది ఏమి లేదని, మార్కెట్, ప్రభుత్వం, సమాజం కలిసి పని చేస్తేనే దళితుల స్థితి మారుతుందని (గెయిల్ ఒమిడావెట్) అభిప్రాయం వెలిబుచ్చారు.

ప్రభుత్వోద్యోగాలు దళితులకు జీవనోపాధిని కల్పించడమే కాకుండా వారి సామాజిక ప్రమాణాలను పెంచాయి. దేశాభివృద్ధి పురోగతిలో నడవాలంటే సంస్కరణల అమలు ముఖ్యం. కనుక దళితుల ప్రయోజనాలకు భంగం కలుగకుండ ఈ లక్ష్యాలను సాధించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. సంస్కరణల ఫలితంగా నీటి పారుదల, విద్యా, తదితర రంఘాలలో పేరిగ్ ప్రభుత్వపు పెట్టుబడుల ఫలితాలు దళితులకు చేరేలా చర్యలు తీసుకోవాలి. అందుకు చిత్తశుద్ధి కలిగిన ప్రభుత్వ ఉద్యోగి సామర్ధ్యం ద్వారా పని చేయించాలి అప్పుడే బడుగువర్గాలకు లాభం చేకూరుతుంది.

నేడు బడుగువర్గాల సంక్షేమం కోసం దక్షిణాది రాష్ట్రాలలో చేస్తున్నంత కృషి ఉత్తరాది ఇండియా రాష్ట్రాలలో జరగటం లేదు. అనేక  సార్లు రాజ్యాంగాన్ని సవరించినా వ్యవస్థలో మార్పులు అంతగా రాలేదు. బడుగు, దళిత వర్గాలను బాగు చేయడానికి రాజ్యాంగం అడ్డుగా ఏమిలేదు. పాలకుల్లో, విధాన నిర్ణయకర్తల్లో చిత్త శుద్ధి లోపించినపుడు రాజ్యాంగ సవరణలు దేశాభ్యున్నతికి దోహదపడవు. దళితుల్ని మాత్రం ఓటు బ్యాంకులుగా పరిగణించి తాత్కాలిక ప్రలోభాలతో ఆకట్టుకోవాలే ప్రయత్నాలకు స్వస్తి చెప్పి బడుగుల జీవన ప్రమాణాలను  పెంచడానికి కృషి చేసిన నాడు డా॥ అంబేద్కర్ ఆలోచన సరళికి సార్ధకత ఏర్పడుతుంది.

డాక్టర్ అంబేద్కర్ తాను రాసిన విషయాలు ఏబది సంవత్సరాలనంతరం ఏ విధంగా ఉంటాయనే దృశ్యాన్ని ముందుగానే ఊహించిన మహామేధావి. ఆయన ఊహించిన విధంగానే మార్పులు జరుగుతుండడంతో ఆయన జీవించి ఉంటాడు. డా॥ అంబేద్కర్ ఆలోచనలకు నేటి మార్పుల మార్గంలో కూడ అవసరం ఎంతో ఉంది. అంటే శాస్త్రవేత్తలు వారి ఆలోచనలు ఎప్పుడు ఆ సమాజపు అవసరాలతో మిళితమై ఉంటాయనడానికి నిదర్శనం. ఆయన ఆలోచన  సరళిని అమలు పరచి సమాజం మంచి ఫలితాలు పొందగలగడమే ఆయనకు ఘనమైన నివాళి.

- టి. సురేష్ కుమార్





SthanikaPalanaTelApril_2010.pmd 15 3/27/2010, 6:11 PM



# రాష్ట్రంలో త్వరలో 'విలేజ్‌మాల్స్'



**రాష్ట్రంలోని రేషన్‌షాపులను దశలవారీగా అన్ని వినియోగ వస్తువులను విక్రయించే 'విలేజ్ మాల్స్'గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. మొదటి దశ కింద మండల కేంద్రాలు, పట్టణాలు, నగరాల్లో ఇటువంటి మాల్స్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఎంపిక చేసిన వెయ్యిమందికి పైగా డీలర్లతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇటీవలసమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.**

మాల్స్ ఏర్పాటులో ప్రభుత్వం ఎటువంటి తోడ్పాటు అందించాలన్న దానిపై మంత్రి జూపల్లి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ సంజయ్ జాజు డీలర్ల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ ఎం. సుబ్రహ్మణ్యం, పౌరసరఫరాల సంస్థ ఎండీ ఉదయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కంపెనీలకు సర్కారు గోదాములు

ప్రస్తుతం రేషన్ డీలర్లు తెల్లకార్డుదారులకు కిలో రెండు రూపాయల బియ్యం, కందిపప్పు, వంటనూనె తదితర వస్తువులను పంపిణీ చేస్తున్నారు. దీనివల్ల తమకు లాభం తక్కువగా ఉంటోందని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి ఇప్పటికే రేషన్‌షాపులను విలేజ్ మాల్స్‌గా మార్చాలని నిర్ణయించారు. ఈ విలేజ్‌మాల్స్ ఏర్పాటులో మొదటి దశ కింద. . . ఎంపిక చేసిన డీలర్లకు బ్యాంకుల ద్వారా ప్రభుత్వమే రుణం ఇప్పిస్తుంది. వివిధ వస్తువులను ఉత్పత్తి చేసే కంపెనీలతో ప్రభుత్వమే మాట్లాడుతుంది.

ఉదాహరణకు రెండు మూడు సబ్బుల కంపెనీలతో ప్రభుత్వం మాట్లాడి ఈ సబ్బులను పౌరసరఫరాల సంస్థకు చెందిన మండల స్థాయి స్టాకు పాయింట్లలో (గోదాముల్లో) నిల్వ చేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తుంది. ఈ స్టాకు పాయింట్ల నుంచి రేషన్ డీలర్లు వీటిని నేరుగా తమ షాపులకు తీసుకునే వెళ్లే అవకాశాన్ని కల్పిస్తారు. దళారీ వ్యవస్థ లేక పోవడం వల్ల సబ్బుల కంపెనీ తక్కువ ధరకే డీలర్లకు తమ ఉత్పత్తులను పంపిణీ చేస్తుంది. దీనివల్ల డీలర్లు తమ లాభంతో కలంపుకొని బహిరంగ మార్కెట్లో కంటే ఒక రూపాయి తక్కువగానే సబ్బులు అమ్మడానికి వీలుపడుతుంది. ఇలా అన్ని వస్తువులు డీలర్లకు చేరేలా ప్రభుత్వం ఏర్పట్లు చేస్తుంది.

ఈ మాల్స్‌లో బస్ టిక్కెట్ రిజర్వేషన్, తపాలా, బీమా, సర్వీసులు, ఎస్టీడీ బూత్, ఐస్‌క్రీం పార్లర్, తదితరాలు కూడా ఏర్పాటవుతాయి. దీని వల్ల డీలర్లు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విలేజ్‌మాల్స్‌లో రేషన్ వస్తువులను విక్రయించరు. అయితే అదే ప్రాంగణంలో ఏదో ఒకచోట రేషన్ సరుకులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటారు.

*– టి. నర్మద*





# స్థానిక సంస్థలకు మరిన్ని నిధులు

## ఏప్రిల్ 1 నుంచి 13వ ఫైనాన్స్ కమిషన్ సిఫార్సుల అమలు

కేంద్ర - రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలలో సామరస్యం, సమతుల్యత సాధించడానికి భారత రాజ్యాంగం ఏర్పాటు చేసిన ఒక ముఖ్యమైన సాధనం 'ఫైనాన్స్ కమిషన్'.రాజ్యాంగంలోని ఆర్టికల్ 280 కింద ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటైంది. పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని కేంద్ర రాష్ట్రాల మధ్య పంపిణీ చేయడం, గ్రాంట్స్ - ఇన్ - ఎయిడ్ మంజూరు చేయడానికి మార్గదర్శక సూత్రాలను ఖరారు చేయడం కేంద్ర ఫైనాన్స్ కమిషన్ ప్రధాన కర్తవ్యం.

73వ రాజ్యాంగ సవరణ ద్వారా ఫైనాన్స్ కమిషన్ పరిధిని విస్తృత పరిచారు. రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ల నివేదికల ఆధారంగా పంచాయతీలు, మున్సిపాలిటీల వనరులకు అదనంగా సంచిత నిధులను పెంచే బాధ్యత కూడా ఇప్పుడు కేంద్ర ఫైనాన్స్ కమీషన్ పరిధిలోకి వచ్చింది. ఈ రాజ్యాంగసవరణ తరువాత మొదటిసారిగా 10వ ఫైనాన్స్ కమీషన్ తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది.

విజయ్ కేల్కర్ సారథ్యంలోని 13వ ఫైనాన్స్‌కమీషన్ తన నివేదికను గత ఏడాది డిసెంబర్ 30న కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. దాన్ని కేంద్రమంత్రి వర్గం కూడా ఆమోదించింది. స్థానిక సంస్థలకు సంబంధించిన కేల్కర్ కమీషన్ చేసిన రికమెండేషన్లకు పేరా నం.10.143లో పొందు పరిచారు. ఆ నివేదికలో కేల్కర్ కమీషన్ ఇలా పేర్కొంది.

"గ్రామీణ, పట్టణ ప్రాంతపు స్థానిక సంస్థలను ఆర్థికంగా పరిపుష్టం చేయాల్సిన అవసరం ఉంది. స్థానిక సంస్థలన్నింటికీ, ఇప్పుడున్న స్థాయి కంటే హెచ్చుస్థాయిలో ఆదాయ వనరులను పెంచాల్సి ఉంది. పన్నుల వసూళ్ల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు కాకుండా ఆదనంగా ఆదాయ వనరులను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో స్థానిక సంస్థలు తమ బాధ్యతలను మరింత జవాబు దారీగా నిర్వహించాల్సి ఉంది. అకౌంట్లను, ఆడిట్లను ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తూ ఉండాలి."

స్థానిక సంస్థలకు ప్రత్యక్షంగా నిధులను కేటాయించడం రాజ్యాంగ పద్ధతుల్లో వీలుకాదు. కాబట్టి, 13వ ఫైనాన్స్ కమిషన్ ఒక వినూత్న పద్ధతి కనిపెట్టింది. దీని ప్రకారం, గత ఏడాది ఆయా సంస్థల్లో వసూలైన పన్నుల ఆధారంగా గ్రాంటులను మంజూరు చేస్తారు. ఇది ఇప్పటిదాకా అమలులో ఉన్న పద్ధతి కంటే ఎంతో విప్లవాత్మకమైంది. ఈ మార్పువల్ల స్థానిక సంస్థలు నిధులను పైస్థాయిలో ఉన్న వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా, స్వయం కృషి ద్వారా అర్హతను పొందగలుగుతాయి. దీని ద్వారా స్థానికసంస్థలకు గ్రాంట్ల ద్వారా అనూహ్యమైన నిధులు సమకూరి, రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా బాధ్యతలను నిర్వహించగలుగుతాయి. 2010-15 మధ్య కాలంలో స్థానిక సంస్థలకు దాదాపు 87,519 కోట్ల రూపాయలు కేటాయించాలని ఫైనాన్స్ కమీషన్ సూచించింది.

స్థానిక సంస్థలకు సంబంధించి 13వ ఫైనాన్స్ కమీషన్ చేసిన ప్రధానమైన రికమెండేషన్లు ఈ కింది విధంగా ఉన్నాయి.

1. పన్నుల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 2.50 శాతాన్ని 2009-14 మధ్యకాలంలో స్థానిక సంస్థలకు కేటాయించాలి. ఈ మొత్తంలో ప్రాథమికంగా 1.5% కాగా, మిగతా 1%ను పనితీరు ప్రాతిపదికపై కేటాయిస్తారు. పనితీరు ప్రాతిపదికగా ఇచ్చే గ్రాంటు 2011-12 ఆర్థిక సంవత్సరం నుంచి కేటాయించాలని రికమెండేషన్ చేశారు. 2011-12 ఆర్థిక సంవత్సరం లో ఈ గ్రాంట్‌ను 0.5 శాతం గానూ, ఆ తరువాత మూడేళ్లు 1% చొప్పున ఇస్తారు.

2. కేంద్రం ఇచ్చే నిధులను ఇక మీదట 2001 జనాభా లెక్కల ఆధారంగా ఇస్తారు. ఇంతకుముందు మున్సిపాలిటీలకు ఒకేసారి ఏకమొత్తంగా ఇచ్చేవారు. గ్రామాలకు మాత్రం జనాభా సంఖ్య ప్రాతిపదికన ఇచ్చేవారు.

3. ఫైనాన్స్ కమీషన్ రికమెండేషన్ స్థానిక సంస్థల పనిని మెరుగు పరిచేందుకు ఉద్దేశింపబడింది. నిధుల బదిలీలో పారదర్శకత, ఏ మేరకు నిధులొస్తాయో ఊహించే వీలుంటుంది. రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ల





SthanikaPalanaTelApril_2010.pmd 5 3/27/2010, 4:32 PM

పనికూడా మెరుగవుతుంది. పనితీరు ఆధారంగా ఇచ్చే గ్రాంటు, ఫైనాన్స్ కమీషన్ మార్గదర్శక సూత్రాలను పాటించిన రాష్ట్రాలకే మంజూరు చేస్తారు.

### మార్గదర్శక సూత్రాలు:

1. బడ్జెట్ పత్రాలకు అనుబంధంగా సంబంధిత డాక్యుమెంట్లను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సమర్పించాలి. అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రికమెండేషన్ల ఆధారంగా అకౌంటింగ్ పద్ధతులను ప్రవేశ పెట్టామని ధృవీకరిస్తూ పత్రాలను రాష్ట్రాలు సమర్పించాలి.

2. స్థానిక సంస్థల అన్ని అంచెలలో జరిగే ఆడిట్ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సాంకేతిక మార్గదర్శకత్వం, పర్యవేక్షణలో జరగాలి. సి.ఎ.జి. తన వార్షిక సాంకేతిక పర్యవేక్షణ నివేదికను మరియు స్థానిక నిధుల ఆడిట్‌పై వార్షిక నివేదికను రాష్ట్ర లెజిస్లేచర్ ముందుంచాలి.

3. స్థానిక సంస్థలకు ఎన్నికైన సభ్యులు, అధికార సిబ్బందిపై వచ్చే అవినీతి ఆరోపణలను పరిశీలించేందుకు స్థానిక స్థాయిలో స్వతంత్ర ప్రతిపత్తి గల అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

4. ఫైనాన్స్ కమీషన్ ఇచ్చే గ్రాంట్లను అందుకున్న 5 రోజుల వ్యవధిలో స్థానిక సంస్థలకు కంప్యూటర్ వ్యవస్థ ద్వారా బదిలీ చేయాలి. అలా సాధ్యం కాని చోట్ల ప్రత్యామ్నాయ పద్ధతుల్లో 10 రోజుల్లో బదిలీని పూర్తి చేయాలి.

5. స్టేట్ ఫైనాన్స్ కమీషన్లకు ఎంపికయ్యే సభ్యుల అర్హతలను సూచిస్తూ ఒక చట్టం చేయాలి. రాజ్యాంగంలో 2431 (2) ఆర్టికల్ ప్రకారం ఈ చర్యను విధిగా చేయాల్సి ఉంటుంది.

6. ఆస్తి పన్నులు వేయడానికిస్థానిక సంస్థలన్నింటికీ అధికారాలివ్వాలి. అధికార బదిలీలో ఉన్న అడ్డంకులను తొలగించడానికి చర్యలు తీసుకోవలి.

7. పట్టణ ప్రాంతాలలో ఆస్తి పన్నుల అంచనాలపై స్థానిక అధికారులను సహాయపడేందుకు రాష్ట్రస్థాయిలో ప్రాపర్టీటాక్స్ బోర్డు నొకదానిని ఏర్పాటు చేయాలి.

8. మంచి నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, వర్షం నీటి పారుదల, చెత్త వంటి అత్యవసర సేవలలో క్రమంగా ప్రమాణాలను




రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

9. పది లక్షలకు పైగా జనాభా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లు అన్నింటికీ అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, దాని పరిధిలో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రణాళికను రూపొందించాలి.

4. దేశంలోని 36 నగరాలలో పన్నుల వసూళ్లు 63% మాత్రమే పూర్తయ్యాయని ఫైనాన్స్ కమీషన్ పరిశీలనలో తేలింది. కనీసం 85% పన్నుల వసూళ్లను స్థానిక సంస్థలు లక్ష్యంగా పెట్టుకోవాలని కమీషన్ సూచించింది. నగరాలలోని ఆస్తులన్నింటి వివరాలను సేకరించడానికి 'జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టంను ఉపయోగించుకోవాలి. రెవెన్యూ వసూళ్లు అధికం చేసిన స్థానిక సంస్థలకు ప్రోత్సాహకాలను ప్రకటించాలని, కొన్ని లేదా అన్ని స్థానిక పన్నులను తప్పనిసరిగా చెల్లించాలని ఆదేశాలు జారీ చేయాలని కమీషన్ రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.

5. స్థానిక సంస్థలో జవాబు దారీతనాన్ని అమలు చేయడానికి లోకల్ ఫండ్ ఆడిట్ డిపార్టుమెంట్లను రాష్ట్రాలు పటిష్టం చేయాలని ఫైనాన్స్ కమీషన్ సూచించింది. ఆడిట్‌కు సంబంధించి కమీషన్ చేసిన ఇతర సూచనలు ఈ విధంగా ఉన్నాయి.

1. జమా ఖర్చుల చిట్టాను రూపొందించడంలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సాంకేతిక సలహాలనిచ్చి పర్యవేక్షణ జరపాలి.

2. ఆడిట్ ప్రమాణాలను, ప్రణాళికను రూపొందించాలి.

3. మెరుగైన ఆడిట్ పద్ధతులను అనుసరించాలి.

4. ఆడిట్, అకౌంట్స్‌లో శిక్షణనివ్వాలి.

6. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ మరియు పంచాయతీ రాజ్ శాఖలు కలసి ఒక నమూనా అకౌంటింగ్ సిస్టంను రూపొందించాయి. ఈ సిస్టం 2010 ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. దేశంలోని పంచాయతీరాజ్ సంస్థలన్నీ ఈ సిస్టంను అనుసరించాలని ఫైనాన్స్ కమీషన్ కోరుతోంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సూచించిన పద్ధతిలోనే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన డేటాను అందులో పొందు పరచాలి.

7. కమీషన్ రికమెండేషన్లను అన్ని రాష్ట్రాలు ఎటువంటి జాప్యం లేకుండా అమలు పరిచి, సాధ్యమైనంత తొందరగా 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్'ను శాసనసభ ముందుంచాలని ఫైనాన్స్ కమిషన్ కోరింది.

8. ప్రభుత్వం చేపట్టే ఆర్థిక సంస్కరణల ప్రక్రియ అమలు జరుగుతున్న తీరుపై కేంద్రస్థాయిలో స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న ఒక సంస్థను ఏర్పాటు చేయాలని, రాష్ట్రాల స్థాయిలో కూడా అటువంటి సంస్థలను ఏర్పాటు చేయాలని ఫైనాన్స్ కమీషన్ సూచించింది.

9. స్థానిక సంస్థలకు ఇదివరలోని ఫైనాన్స్ కమీషన్లు కేటాయించిన నిధులను ఉపయోగించుకోక పోవడాన్ని కమీషన్ తప్పు బట్టింది. ఫైనాన్స్ కమీషన్ గ్రాంట్లను సకాలంలో సద్వినియోగ పరుచుకునేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కూడా కమీషన్ కోరింది.

***- మహ్మద్ తఖ్యు వుద్దీన్,*** జాయింట్ డైరెక్టర్, అపార్డ్

- అనువాదం : **కె.యస్.రెడ్డి**



SthanikaPalanaTelApril_2010.pmd 6 3/27/2010, 4:32 PM

# నేలతో సావాసం

పలమనేరు బాలాజీ

**గ్రామీణ కథల పోటీ విభాగంలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ**

**ఫోన్, సెల్‌ఫోన్, ఈమెయిల్... అతడి ఆవేదన చాలా దూరమే ప్రయాణించింది శీను-హైదరాబాద్, రమేష్ - విజయవాడ, రామచంద్రం- తిరుపతి- ముగ్గురికి సమాచారం అందింది. ముగ్గురికీ రవి గుర్తొచ్చాడు. వాళ్ల బాల్యం, పల్లెటూరు, వేపచెట్టు గుర్తొచ్చాయి.**

**మరుసటి రోజే వాళ్ళ ప్రయాణం మొదలైంది. ఆదివారం ఉదయం ఆరు నుండి ఎనిమిది గంటల లోపుగా ముగ్గురూ రవి వాళ్ల ఇల్లు చేరుకున్నారు. గంటలోగా స్నానాది కార్యక్రమాలు, టిఫిన్లు అయ్యాయి. నలుగురూ రచ్చబండ వద్దకు నడిచారు. వాళ్ల మొహాల్లో బాధ కొట్టొచ్చినట్లు కనపడుతోంది. రామచంద్రం కన్నీళ్లు ఆపుకోలేకపోయాడు.**

**రచ్చబండ బోసిపోయినట్లు ఉంది.**

**వేపచెట్టు లేని రచ్చబండను చూడగానే రామచంద్రం మొదట ఏడ్చాడు. అతడి ఏడుపు చూడగానే మిగతా ముగ్గురికి కూడా అప్రయత్నంగా కన్నీళ్లు వచ్చాయి.**

పొద్దు గడుస్తూ వుంది. పల్లెలో జనం అటూ ఇటూ కదులుతూ, ఎటూ కదలకుండా నిలబడ్డ ఆ నలుగురి వైపు అదోలా చూసుకుంటూ, వారిలో వారే ఎవరికి తోచింది వాళ్లు మాట్లాడుకుంటూ వెడుతున్నారు.

ఒకరిద్దరు రవిని మాట్లాడించే ప్రయత్నం చేశారు. కానీ రవి కదల్లేదు, మెదల్లేదు. నలుగురికీ వేపచెట్టే గుర్తొస్తోంది. ఒకటా రెండా... ఎన్నేండ్ల వేపచెట్టు అది.

దానికి వీళ్ల బాల్యం తెలుసు. యవ్వనం తెలుసు. వీళ్ల సుఖాలు, కష్టాలు, కన్నీళ్ళు... అన్నీ తెలుసు. వేపచెట్టుకున్న గుబురు ఆకులతో గాలి గలగలా వీచేది. ఎండపట్టున మంచి నీడ ఉండేది. వేపచెట్టు పేరు 'ఎర్రి ఏపమాను'గా జనం పిలుచుకునే వాళ్లు.

బస్సాగేది అక్కడే.

గ్రామపంచాయతీ భవనం పూర్తయ్యేంత వరకూ ఊర్లో ఎన్నో పంచాయతీలు జరిగిందీ అక్కడే. ఒకప్పుడు రేడియో వచ్చిన కొత్త కొత్తలో ఊరి జనం మూకుమ్మడిగా పనులాపుకొని పాటలు, వార్తలు వింటూ నోర్లు తెరుచుకొని పరవశించి పోయింది అక్కడే. ఊర్లోకి డాక్టరొచ్చినా, ఆఫీసరు వచ్చినా, బ్యాంకు వాళ్లు వచ్చినా ముందు కూర్చునేది ఆ ఎర్రి ఏపమాను కిందే.

ఏమైంది? ఆ ఎర్రి ఏపమాను?

ఎప్పుడూ కళకళలాడుతూ, గలగలా మాట్లాడుతూ ఊర్లోకి ఎవరొచ్చినా సాదరంగా ఆహ్వానం పలికి, ఊరు విడిచి ఎవరు వెడుతున్నా దుఃఖంగా వీడ్కోలు చెప్పిన ఆ ఎర్రి ఏపమానుకేమైంది?

★ ★ ★ ★



''ఏమిట్రా రవీ రాత్రి పగలూ ఆ యాపచెట్టుకింద ఏం చేస్తారో మీ స్నేహితులంతా? ఆ ఏగ్రి ఏపచెట్టేమైనా మీకు తిండి పెడుతుందా? నీళ్లు తాగిపిస్తుందా?''

"అదేమిటండి ఇంత ఊర్లో ఏ గుడికో తీసుకుపోకుండా ఈ వేపచెట్టు కిందకు తీసుకు వచ్చి ఇక్కడ కొబ్బరికాయను కొట్టి మొక్కోమంటారేమిటి? ఎక్కడైనా కొబ్బరికాయను దేవుడి గుళ్లో కొడతారు. మీరేమిటి? వేపచెట్టుకు కొబ్బరికాయ కొట్టమంటారు?"




''ఏమిట్రా రమేషూ! నువ్వేం మాట్లాడుతున్నావో నీకేమైనా అర్థం అవుతోందా అసలు. అయినా మీ నాయిన శవాన్ని వేపచెట్టు ముందు దించమంటావేమిటి? మతుండే మాట్లాడుతున్నావా? దింపుడు కళ్లేం వరకూ నోరెత్తకు.''

"రామచంద్రం... నిన్ను చూస్తుంటే జాలేస్తుంది బాస్. ఎవరైనా తొలిసారి జీతం తీసుకుంటే అమ్మకు, నాన్నకు, స్నేహితులకు, ఇంట్లోవాళ్ళకు పార్టీ ఇస్తారు. నువ్వేమిటోయ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివి, ఈ పసుపు, కుంకుమ, టెంకాయలు, సాంబ్రాణి కడ్డీలు, పూలు, పండ్లేమిటి? అసలీ వేపచెట్టుకు పూజ చేయటమేమిటి బాస్? అసహ్యంగా!"

వేపచెట్టును చూడ్డం వీళ్ళ నలుగురికి ఆనందం.

వీళ్లను చూడ్డం జనానికి విచిత్రం.

★ ★ ★ ★ ★

నరసింహారెడ్డి, మొగిలీశ్వర నాయుడు లాంటి పెద్దతలకాయలు వేపచెట్టు కింద, రచ్చబండ పైన కూర్చుని వాదవివాదాలు వింటూ తీర్పులు ఇస్తుంటే ఆ పంచాయతీ జనం మొత్తం అక్కడ నిలబడిపోయి చూసేవాళ్లు.

ఆ తరం పోయాక ఊర్లోకి పోలీసులు, కోర్టు సమన్లు రావటం ఒక విచిత్రం. వచ్చింది పోలీసు అయినా కోర్టు మనిషయినా కూర్చోవాల్సింది మాత్రం వేపచెట్టు కిందే. రచ్చబండ పైనే. అది ఈ ఊరు ఇచ్చే గౌరవం.

ముగ్గురూ చిత్తూరుకు , తిరుపతికి వెళ్లి చదువుకున్నారు. అపై రామచంద్రం బెంగుళూరుకు వెళ్లి చదువుకున్నాడు. ముగ్గురూ పెద్ద ఉద్యోగాలలో, పెద్దపెద్ద ఊర్లల్లోనే ఇరుక్కుపోయారు. రవి ఒక్కడే డిగ్రీతో చదువు ఆపి నాగలి పట్టుకొని, రైతుగా నిలబడ్డాడు.

వేప చెట్టుకు అన్నీ తెలుసంటాడు ఫకీరు మస్తానయ్య. "గతం, వర్తమానమే కాదు భవిష్యత్తు కూడా తెలుసురా అబ్బాయిలూ! ఏ మనుకుంటా వుండారు? గాలీగాలీ దెయ్యం, గియ్యం అన్నీ ఒదిలిపోవాల్సిందే ఈ వేపచెట్టు కింద"

ఇప్పుడు ఫకీరయ్య లేడు. వేపమానూ లేదు.

రమేష్ వాళ్ల నాయిన ఉన్నట్టుండి చనిపోతే రమేష్ చుట్టూ ముగ్గురూ ఆసరగా నిలబడ్డారు. కానీ వాళ్ళందరికీ ఎప్పుడూ నిజంగా ధైర్యం చెప్పింది మాత్రం వేపచెట్టే. ఎందుకో రమేష్‌కు వేపచెట్టును చూస్తే వాళ్ల నాయినే గుర్తొస్తాడు.

నగరానికి గ్రామం దగ్గరయ్యే కొద్దీ, కొత్త రోడ్లు నిర్మించబడి బస్సులు అటూ ఇటూ హుషారుగా తిరిగే కొద్దీ ఊర్లో జనంలో మార్పు మొదలైంది. రేడియోల స్థానంలో టి.వి.లు వచ్చాక, ఊర్లోనే డిష్ ఏర్పడ్డాక రచ్చబండ వద్ద జనం పలుచబడ్డారు. బస్సులతో బాటూ, ఆటోలు నడవడం మొదలయ్యాక ఊర్లో జనం పగలు ఊర్లో కనిపించటమే మానేసారు.

చుట్టూ అడవి. కొండల మధ్యలో పచ్చని ఊరు. ఏమైంది?

ఏం జరిగింది? ఎందుకిట్లా జరిగింది?

ఇప్పుడు అడవి లేదు. పచ్చని చెట్లూ లేవు.

ఇప్పుడు పంటల్లేవు, పొలాలే లేవు.

మనిషితో మనిషి సావాసం చేసే కాలం ఇది. మనిషి కంటే డబ్బుకు విలువ ఇచ్చే కాలం. మనిషి నేలతో సావాసం చేసే స్థితి దాటిపోయిన కాలం ఇది.

ఎవరు ఎందుకు మొదలు పెడతారో తెలియదు. మతాలు- కులాలు- గ్రూపులు - జనం చీలిపోయి గొడవలు పడటం మొదలయ్యాక, మనిషితో మనిషి మనసారా మాట్లాడ్డం కూడా అరుదయ్యాక రచ్చబండ ఎవరికీ కానిదైపోయింది.

నలుగురు కలిసి కూర్చుని నాలుగు మాటలు, ఊరి మంచీ చెడ్డా, కష్టం సుఖం మాట్లాడుకోవటమే అరుదయ్యాక రచ్చబండ ఒంటరిదై పోయింది.

ఎవరేం చేశారో, లేక వయసయిపోయిందో వేపచెట్టు నేల రాలిపోయింది.

రవి ముగ్గురు మిత్రులకీ సమాచారం అందించాడు. అందరి

ఆలోచనలు ఒక్కటే. నలుగురి అభిప్రాయం ఒక్కటే.

మనిషికంటే చెట్టు విలువ ఎక్కువ.

మనిషికి ప్రాణవాయువు నిచ్చేది చెట్టే.

ఊర్లో చెట్ల జాడే లేకుండా పోతోంది. అయిన కాడికి పొలాలను అమ్ముకొని పట్న వాసం చేరిపోయే జనం పెరిగి పోయారు. అడవిలో చెట్లూ అంతంత మాత్రమే.

ఏం చెయ్యాలి? ఎవరు చెయ్యాలి?

మధ్యాహ్నమయ్యింది.

నలుగురూ భోంచేసాక మళ్లీ రచ్చబండ దగ్గర చేరారు. అటూ ఇటూ వెళ్లే వాళ్లు ఆ నలుగురినీ అనుమానంగా చూస్తూ కదులుతున్నారు.

ఊర్లో అందరికీ వీళ్ల విషయం ఒక వింతగా అనిపిస్తోంది? ఏమిటి వీళ్ల నలుగురి వ్యూహం? ఏం ఆలోచిస్తున్నారు? ఏం చెయ్యబోతున్నారు?

ఊర్లో గొడవల కారణంగా చెరుకుతోటకు ఎవరో నిప్పుపెడితే సర్వం పొగొట్టుకున్న వాళ్ళున్నారు. మామిడి మొక్కల్ని ఎవరో పీకేస్తే గుండెలు బాదుకొని ఏడ్చిన వాళ్లున్నారు.

పోలీస్‌స్టేషన్‌కు, కోర్టు, యం.ఆర్.ఓ. ఆఫీసు చుట్టూ తిరుగుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్న వాళ్లూ ఉన్నారు.

సాయంత్రం టీ తాగుతూ వుంటే అప్పుడు తట్టింది వాళ్లకు ఒక ఆలోచన.

★ ★ ★ ★ ★

**సా**యంత్రం రాత్రవకముందే నలుగురూ పట్నం బయలుదేరారు. కలవాల్సిన వాళ్లని కలిశారు. చెయ్యాల్సిన పనులన్నీ చేశారు.

సోమవారం మొత్తం వాళ్లకు ఆ పనులతోనే సరిపోయింది. జనం వీళ్లని వెర్రివాళ్లని చూస్తున్నట్లు చూస్తున్నారు. ట్రాక్టర్లు వచ్చాయి. పలుగూ పారలతో కూలీజనం వచ్చారు. చకచకా పనులు జరుగుతూ ఉన్నాయి.

మంగళవారం ఉదయానికల్లా ట్రాక్టర్ల నిండా వందలాది మొక్కలు నర్సరీ నుండి నేరుగా తమ గమ్యాన్ని వెతుక్కుంటూ తలలూపుకుంటూ వచ్చి రచ్చబండ వద్ద నిలిచాయి.

పిలవకుండానే ఊర్లో జనం గుంపు చేరిపోయారు. స్కూలు మాస్టరు, పిల్లలు తయారుగా వచ్చారు. ఉపన్యాసాలు లేవు. చప్పట్లు లేవు. బ్యానర్లు, కటౌట్లు, పత్రికల హడావిడి ఏమీ లేదు. ప్రచారం లేదు. ఆర్భాటం లేదు.

చిన్న పిల్లలందరూ వరుసగా నిలబడేసరికి పెద్దపిల్లలు ట్రాక్టర్‌లోంచి జాగ్రత్తగా మొక్కల్ని దించి పిల్లల చేతుల్లో ఉంచుతుంటే ఒక్కొక్కరే అపురూపంగా మొక్కల్ని చేతబట్టుకుని సైనికుల్లా ముందుకు కదిలారు.

స్కూలు ఆవరణలో అప్పటికే ఎరువు, ఎర్రమన్ను సిద్ధంగా ఉంది. ట్యాంకర్లు, నీళ్ల క్యాన్లు వచ్చేసాయి.

యజ్ఞం మొదలైంది.

స్కూలు చుట్టుపక్కల, చెరువుదగ్గరా, బీడు భూముల్లో, గుట్టల్లో, కొండల్లో గునపాలు దిగుతున్నాయి.

"ఒక మనిషి పోతే ఒక కుటుంబం అనాథ అవుతుంది. ఒక చెట్టు మరణిస్తే ఊరే అనాధ అవుతుంది. ఒక్క చెట్టు చనిపోతే కనీసం వంద మొక్కలైనా నాటాల్సిందే. రండి. తలా ఒక చెయ్యి వెయ్యండి. మనం బ్రతకాలంటే ముందు మొక్కల్ని బ్రతికించుకుందాం రండి రండి...."

స్కూలు టీచరు యువకుడు, ఉత్సాహవంతుడు. చోద్యం చూస్తూ నిలబడ్డ జనంలో కదలిక తేవాలని తెగ ఆరాటపడుతూ ఉన్నాడు.

సమయం గడుస్తూ వుంది.




ముందొక ముసలాయన కదిలాడు. అతడి తర్వాత బిడ్డలూ, మొగుడూ లేని ఒకానొకామె కదిలింది. అర్థం కాకపోయినా సర్పంచు ముందుకొచ్చాడు. ఫకీరయ్య గడ్డం నిమురుకుంటూ కదిలాడు. కులం లేదు, మతం లేదు, చిన్నాపెద్దా లేదు, బీదా గొప్పా లేదు, కదలిక మొదలైంది. పిల్లల వెనుక పెద్దలు. పిల్లలు వెంట పెద్దలు.

నాలుగు చినుకులు మెల్లగా ఆకాశంలోంచి పడుతుంటే జనం కదిలారు. మొక్కలు చేతులు మారుతున్నాయి.

రచ్చబండ ముందు నిలబడ్డ ఆ నలుగురూ లేని వేపచెట్టు తాలూకు ఖాళీస్థలం వైపు తదేకంగా చూశారు. వాళ్ళ కళ్ళల్లో ఏదో మెరుపు. వాళ్ళ కళ్ళు నవ్వుతున్నాయి. అక్కడో మొక్క పునరుజ్జీవం పొందుతుంది. నేలతో మనిషి సావాసం అట్లా మళ్లీ అక్కడ మొదలైంది.

☆

# అపార్డు ప్రచురణలపై ప్రశంస

ప్రజాప్రతినిధుల సామర్ధ్యాల పెంపుదల కోసం ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ రూపొందిస్తున్న కరదీపికలు, ఇతర ప్రచురణలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటున్నాయని కేంద్రప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, సెక్రటరీ శ్రీ బి.కె.సిన్హా అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కార్యక్రమాన్ని సమీక్షించి ప్రభుత్వానికి సలహాలు సూచనలు చేయటానికి ఏర్పాటేచేసిన కమిటీ 4వ సమావేశం శనివారం. ది.13.03.2010న జాతీయ గ్రామీణాభివృద్ధి అకాడమీ, హైదరాబాదులో జరిగింది. ఈ సందర్భంగా అపార్డు ప్రచురించిన సాక్షరభారత్ - సర్పంచుల కరదీపికను కమిటీ ఛైర్మన్ శ్రీ.వి. రామచంద్రన్, వాటర్ షెడ్ డి.పి.ఆర్. తయారీ మార్గదర్శకాల పుస్తకాన్ని శ్రీ బి.కె.సిన్హా విడుదల చేసారు. సాక్షరభారత్ పై రూపొందింన డాక్యుమెంటరీ చిత్రాన్ని సమీక్షాకమిటీ సభ్యులు శ్రీ బి.ఎన్. యుగంధర్ విడుదల చేసారు. అఫీనాసాఫ్ట్ హైదరాబాదు వారి సాంకేతిక సహకారంతో జిల్లా ప్రణాళికా కమిటీ సభ్యుల శిక్షణ కొరకు, ప్రణాళికా రచనలో పాల్గొనే జిల్లా స్థాయి అధికారులకొరకు రూపొందించిన సమీకృతజిల్లా ప్రణాళికా రూపకల్పన కంప్యూటర్ ఆధారిత శిక్షణా సి.డి.ని కేంద్రపంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ సుధీర్ కృష్ణ విడుదల చేసారు. గ్రామపంచాయతీ స్థాయిలో మంత్రి మండలి ఏర్పరచటం, గ్రామ స్థాయి విధాన మండలి ఏర్పర్చటం వంటి వినూత్న ప్రయోగాలతో కరీంనగర్‌లో రామచంద్రాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధిపై అపార్డు రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రం సి.డి.ని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరక్టరు జనరల్ శ్రీ మాత్యూస్ సి. కన్నమ్‌కున్ విడుదల చేసారు. ఈ చిత్రాన్ని ఆసాంతం చూసిన సభ్యులు గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీ వకుళాభరణం భానుప్రకాష్‌తో కొద్దిసేపే సంభాషజంచి గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొని రావటానికి సామాజిక సమీకరణను చేపట్టిన తీరుని గూర్చి తెలుసుకొన్నారు. సభ్యులందరూ సర్పంచ్ కృషిని అభినందించారు. ఈ సందర్భంగా అపార్డు కమీషనరు శ్రీ ఫణికుమార్ మాట్లాడుతూ ప్రజాభాగస్వామ్యంతో స్థానిక ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతున్న గంగదేవిపల్లి, పాండురంగాపురం, రామచంద్రాపూర్, అంకాపూర్ తదితర గ్రామపంచాయతీలలో వచ్చిన సామాజిక చైతన్యం, నాయకత్వ శైలులు తదితర అంశాలపై సమగ్రంగా పరిశోధన జరపటానికి అపార్డు సంకల్పించిందని, పరిశోధనా ఫలితాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలోని మిగిలిన పంచాయతీలలో కూడా ఇదే రీతిలో అభివృద్ధి సాధించటానికి ఆయా ప్రాంతాలలోని ప్రజాప్రతినిధులకు ఏరకమైన శిక్షణను అందచేస్తే బాగుంటుందనే అంశాన్ని నిర్ణయించటం జరుగుతుందని ఆయన తెలియచేసారు. ఈ కార్యక్రమంలో అపార్డులోని సి.డి.పి.ఏ, సి.ఎన్.ఆర్.ఎం. సెంటర్ హెడ్‌లు ప్రొ. సూర్యనారాయణ రెడ్డి, హెచ్.కూర్మారావు, ఎన్.ఐ.ఆర్.డి. పంచాయతీ రాజ్ సెంటరు ప్రొఫెసర్లు శ్రీమతి జయలక్ష్మి, భాస్కరరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**- వి.శివశంకర్ ప్రసాద్,** జూనియర్ ఫ్యాకల్టీ, అపార్డు

**బోధన ప్రణాళిక** (Fixed Point Chart)

## గ్రామ వికాసం దూర విద్యా బోధన మన టి.వి. (సాప్ నెట్) ఛానెల్ –3

| తేదీ/లో | అభ్యర్థులు | ప్రసార సమయం | కార్యక్రమం |
|---|---|---|---|
| 01-04-2010 | యం.పి.టి.సి. మెంబర్లు | 11.00-11.20 | గ్రామ సభ నిర్వహణ |
| | | 11.20-11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 11.40-12.00 | సాక్షర భారత్ |
| | | 12.00-12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 12.20- 12.40 | మండల పరిషత్ సమావేశాలు |
| | | 12.40-01.00 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 1.00-1.20 | ప్రణాళికా వికేంద్రీకరణ |
| | | 1.20-1.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 2.30-4.00 | లైవ్ ఇంటరాక్షన్ - మనుఎ స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |
| 08-04-2010 | గ్రామ పంచాయితీ అధ్యక్షులు | 11.00-11.20 | సాక్షర భారత్ |
| | | 11.20-11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| 15-04-2010<br>22-04-2010<br>29-04-2010<br>06-05-2010 | గ్రామ పంచాయితీ వార్డు మెంబర్లు | 11.40-12.00 | గ్రామ పంచాయితీ ఆర్థిక వనరులు |
| | | 12.00-12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 12.20-12.40 | నిర్మల్ గ్రామ్ పురస్కార్ |
| | | 12.40-01.00 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 01.00-01.20 | గృహ సించ నిరోదక చట్టం |
| | | 01.20-01.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 02.30-04.00 | లైవ్ ఇంటరాక్షన్ - మనుఎ స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |



SthanikaPalanaTelApril_2010.pmd 10 3/27/2010, 4:32 PM

# అలతి అలతి పదాల తేట తెలుగుకు నాంది పలికిన తిక్కన సోమయాజి

## తెలుగు సాహిత్య చరిత్ర

*"వాచా మాంధ్రమయానాం యః*
*ప్రవక్తా ప్రథమ్యోభవత్*
*ఆచార్యం తం కవీంద్రాణాం*
*వందే వాగను శాసనమ్"*

ఆంధ్ర వాఙ్మయానికి మొట్టమొదటివాడు, తెలుగు కవులకు ఆచార్యుడునైన వాగనుశాసనునకు (నన్నయకు) నమస్కారము అని ప్రసిద్ధి పొందిన నన్నయ భట్టారకుని తరువాత ఎన్నదగినవాడు తిక్కన సోమయాజి.

తిక్కన సోమయాజి, నన్నయ భట్టారకుని తరువాత రెండు వందల యేండ్లవాడు. మహాభారతాన్ని ఆంధ్రీకరించిన కవులలో నడిమివాడు. మొదటివాడు నన్నయ, రెండవవాడు తిక్కన సోమయాజి కాగా మూడవవాడు ఎఱ్ఱాప్రెగ్గడ. ఈ ముగ్గురిని కవిత్రయము అని పిలుస్తారు.

తిక్కన కవి క్రీ.శ. 13వ శతాబ్దము వాడు. విక్రమ సింహపురము (నెల్లూరు)ను రాజధానిగా చేసికొని రాజ్యపరిపాలన చేసిన మనుమసిద్ధికి ఆస్థాన విద్వాంసుడు. పైగా మంత్రి కూడా. అందుకే తిక్కనను తిక్కనామాత్యుడు అని కూడా చెబుతారు. మనుమసిద్ధి భూపాలునితో కలిసి ఎన్నో యుద్ధాలలో పాల్గొన్నాడు. రాజనీతి నిపుణుడు. ఆ కారణంగానే మహాభారతంలోని యుద్ధ ఘట్టాలను అత్యంత సహజంగా వర్ణించాడు.

తిక్కన మహాకవి తొలుదొల్తగా నిర్వచనోత్తర రామాయణమును రచించాడు. దానిని తన ప్రభువైన మనుమసిద్ధి మహారాజునకు అంకితమిచ్చాడు. ఈ గ్రంథం సంస్కృత పదాలతోను, సంస్కృత సమాసాలతోను నిండి ఉంది. కథ తెలిసినదే అయినప్పటికీ కవిత్వం అర్థం చేసుకోవడానికి తగినంత పాండిత్యం కావాలి. సాధారణంగా కావ్యాలలో కొన్ని పద్యాల తర్వాత చిన్నవి, పెద్దవి అయిన వచనాలు ఉంటాయి. తిక్కనగారి ఉత్తర రామాయణంలో వచనాలుండవు. అందుకే దీనికి నిర్వచనోత్తర రామాయణమని నామకరణం చేశాడు.



తిక్కన యింటిపేరు 'కొట్టరువు'. ఈయన తండ్రి పేరు కొమ్మనామాత్యుడు. తల్లి అన్నమాంబ. తిక్కన తాత మంత్రి భాస్కరుడు. వీరిది పండిత వంశమే కాక, కొలువులో మంత్రాంగము నెరపిన వంశము కూడా. ఖడ్గతిక్కన, తిక్కన కవికి పెదతండ్రి కుమారుడు, *'ఇదం క్షాత్రం, ఇదం బ్రాహ్మ్యమ్'* అని బ్రాహ్మణ ధర్మాన్ని, క్షత్రియ ధర్మాన్ని కూడా సమతూకంలో నడిపించినవారు తిక్కన వంశీయులు. ఈ మహాకవి క్రీ.శ. 1256-62 మధ్య విక్రమ సింహపురమును రాజధానిగా చోడదేశాన్ని పరిపాలించిన మనుమసిద్ధి కాలము వాడు.

తిక్కన మహాకవి, మనుమసిద్ధికి మంత్రాంగములో తన నైపుణ్యాన్ని ప్రదర్శించినాడు. అక్కన, బయ్యన అనేవారు మనుమసిద్ధికి దాయాదులు. వారు మోసము చేసి మనుమసిద్ధి సామ్రాజ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. ఆ సమయంలో తిక్కన, ఓరుగంటి ప్రభువైన ప్రతాపరుద్ర చక్రవర్తి సహకారంతో, మనుమసిద్ధిని తిరిగి సింహాసనంపై కూర్చుండ బెట్టాడు. అంతటి బుద్ధిశాలి తిక్కన.

తిక్కన, నన్నయ మాదిరిగానే అద్వైతమది. ఆ కాలంలో శైవమతం, వైష్ణవమతం అభివృద్ధిలో ఉన్నాయి. పైగా ఒక మతం వారంటే మరొక మతం వారికి పడేదికాదు. దానికి తోడు మహారాజులు కూడా ఏదో ఒక మతం అవలంబించి, చక్కని ఆలయాలను నిర్మించారు. ఈనాడు మనం దర్శిస్తున్న ప్రాచీన శిల్పసంపద అంతా ఆయా రాజులు సమకూర్చి పెట్టినదే. మత ఛాందసులైన మహారాజులు, మతపరంగా ఎన్నో యుద్ధాలు చేశారు. ఈ యుద్ధాలు, మారణహోమాలు, తిక్కన మనసును కలచివేశాయి. అదే సమయంలో... నన్నయ వ్రాయగా మిగిలిన మహాభారతాన్ని అనువదించవలసిందిగా, రాజమహేంద్రవర ప్రభువుల నుండి వర్తమానం వచ్చింది. ఆ వర్తమానం ముందుగా మనుమసిద్ధి భూపాలుని దగ్గరకు చేరింది. ఈ విషయాన్ని గురించి ఒక కథ ప్రచారంలో ఉంది. దాని సత్యాసత్యాలు మాట ఎలా ఉన్నా విషయం తెలుసుకో దగ్గదే.

ఒకనాడు, మనుమ-సిద్ధి మహారాజు తిక్కనను

ఆహ్వానించాడు. నిండు కొలువులో, ''తిక్కన మహాకవీ! నన్నయభట్ట కవి అసంపూర్ణంగా విడిచిపెట్టిన మహాభారతాన్ని మీ చేత ఆంధ్రీకరింపజేయుమని, రాజమహేంద్రవర ప్రభువులు మమ్ము కోరారు. నేను వెంటనే అంగీకరించాను. ఈ మహత్కార్యాన్ని మీరు నిర్వహించాలి'' అన్నాడు.

దానికి తిక్కన నిరాకరించాడు. ఎన్నో పర్యాయాలు, ఎన్నో విధాలుగా మనుమసిద్ధి తిక్కనను కోరాడు. అభ్యర్థించాడు. బ్రతిమాలాడు. కాని, తిక్కన ససేమిరా అంగీకరించనన్నాడు. దానితో మనుమసిద్ధికి కోపం వచ్చి, 'నా మాట నెరవేర్చవలసిందే' అని ఆదేశించాడు.

దానిక్కూడా తిక్కన లొంగలేదు. ఆ నిరాకరణకి ఆగ్రహించిన మహారాజు, 'నీకు శిరోముండనం (గుండు) చేయించి, నగరం అంతా ఊరేగిస్తానన్నాడు. మద్యం త్రాగిస్తానన్నాడు. బ్రాహ్మణుడవైన నీ చేత మాంసం తినిపిస్తానన్నాడు. చివరగా తిక్కన, 'ఇవన్నీ చేయించు. ఆ తర్వాత ఆలోచిస్తా'నన్నాడు.

ఇందులో ఒక పరమార్థం ఇమిడి ఉంది. బ్రాహ్మణుడు, ఇవన్నీ యజ్ఞం చెయ్యడం కోసం చేస్తాడు. యజ్ఞానికి ముందు ముండనం చేయించుకోవడం, నగరంలో ఊరేగడం, యజ్ఞపాయసంలో 'వప' (మేక గుండెపై నున్న సన్ననిపొర) కలిపి వండిన ప్రసాదాన్ని భక్షించడం చెయ్యాలి. ఇవన్నీ పూర్తిచేసిన తరువాత, అంటే యజ్ఞం పూర్తయిన తరువాత, తిక్కన 'సోమయాజి' అయ్యాడు. మొత్తంగా ఆయన తిక్కన సోమయాజి అయ్యాడు. పంచమ వేదంగా భావించబడుతున్న మహాభారతాన్ని ఆంధ్రీకరించడానికి తగిన అర్హత సంపాదించుకొన్నాడు.

మహాభారతాన్ని ఆంధ్రీకరిస్తూ తిక్కన సోమయాజి, నన్నయభట్టు విడిచిపెట్టిన అరణ్యపర్వాన్ని ఆంధ్రీకరించలేదు. విరాటపర్వం మొదలు పెట్టి, స్వర్గారోహణ పర్వం వరకు గల పదునైదు(15) పర్వాలను తెలుగు చేశాడు. కాని, తాను అనువదించిన మహాభారతాన్ని తన ప్రభువైన మనుమసిద్ధికి అంకితం ఇవ్వలేదు. అటు శైవమతస్థుల ను, ఇటు వైష్ణవ మతం వారిని సంతృప్తి పరచేవిధంగా తన భారతాన్ని హరిహరనాథునకు అంకితం చేశాడు. దానికి తగినట్లుగా తనకు కల వచ్చిందంటూ ఆ కలను ఈ విధంగా వివరించాడు.

''భారత రచనకు సంసిద్ధుడనయ్యాను. ఈ కృతికి అధిపతిగా ఎవరిని చెయ్యాలి? అని ఆలోచిస్తున్న సమయంలో చిన్న కునుకు వచ్చింది. నిద్ర పట్టింది. ఆ నిద్రలో కల వచ్చింది. కలలో మా తండ్రి కొమ్మనామాత్యుడు దర్శనమిచ్చాడు. నాయనా! నీవు,

*''కిమస్థిమాలాం కిము కౌస్తుభం వా*
*పరిష్క్రియాయాం బహు మన్యసే త్వమ్*
*కిం కాలకూటః కిము వా యశోదా*
*స్తన్యం, తవ స్వాదు వదప్రభోమే''*

''ఓ దేవా! నీకు పుర్రెల దండ ఇష్టమా? కౌస్తుభమణి ఇష్టమా? కాలకూటం రుచా? యశోదాదేవి స్తన్యం రుచా? - అని అడుగుతూ ఉంటావు కదా!

పుర్రెల పేరుకి, కౌస్తుభమాణిక్యానికి, కాలకూటానికి, యశోదా స్తన్యానికి కూడా ఇష్టపడిన హరిహరనాథ దేవునకు ఆలయం నిర్మింప జేశావు కదా! ఆ హరిహరనాథుడు నీ మీద కరుణ కురిపిస్తూ, ఆ లోకంలో ఉన్న నన్ను నీ దగ్గరకు పంపాడు. అంతేకాదు, ఆయనే స్వయంగా వచ్చాడు చూడు'' అన్నాడు. తిక్కన తన చూపు హరి హరనాథుని వైపు మళ్ళించాడు. ఆయన సగం శివుని శరీరంతోను, సగం విష్ణువు శరీరంతోను కలిసి ఉన్న హరిహరనాథ స్వరూపంతో తిక్కనకు దివ్యదర్శనమిచ్చాడు.

''పురుషార్థము అనే కల్పతరువున పండిన చక్కని పండు వంటిది నీకు అనువాదం చేస్తున్న మహాభారతం. తిక్కన కవీ! నీ భారత గ్రంథానికి కృతిపతిత్వాన్ని కోరుతూ నీ దగ్గరకు వచ్చాను'' అన్నాడు.

తనకు దర్శనమిచ్చిన హరిహరనాథునితో, ''ఓ అఖిలాండపతీ! ఇది నీవు నా మీద చూపించిన దయ. కురిపించిన అమృతవర్షం. భారతాంధ్రీకరణం వల్ల, నీకు దీనిని అంకితమివ్వడం వల్ల నా జన్మ చరితార్థమౌతుంది. జన్మజన్మల దుఃఖాలన్నీ (పాపాలన్నీ) పటాపంచ లైపోతాయి'' అంటూ ఆ స్వామికి సాష్టాంగ నమస్కారం చేశాడు.

కల చెదరిపోయింది. మనస్సు తేలికపడింది. తన కృతిని నరునకు కాక, హరిహరునకు అంకితమిస్తున్నందుకు ఎంతో ఆనందపడ్డాడు.

ఆ విధంగా తిక్కయజ్వ, తన మహాభారత గ్రంథాన్ని విక్రమసింహ పురంలో కొలువైయున్న హరిహరనాథ దేవునకు అంకితమిచ్చాడు. దురదృష్టమేమిటంటే, నెల్లూరు పట్టణంలో హరిహరనాథ దేవాలయం శిధిలమైపోయింది. అది నేడు మనకు కానరాదు. కాని తిక్కన ఈ విధంగా తన కృతిని, హరిహరనాథునకు కృతియిచ్చి, శైవ వైష్ణవ మతాల మధ్య నున్న కలహాలను మాన్పగలిగాడు.

మహాభారత గ్రంథాన్ని అనువదింపజేయుమని కోరుతూ, వేంగీరాజులు, నన్నయగారి పద్యాన్ని ఒక దానిని తాళపత్రంపై లిఖించి ఎందరికో పంపారు. కాని ఎవరు అటువంటి శైలీ విన్యాసం ప్రదర్శించడం తమ వల్ల కాదన్నారు. అదే పద్యం మనుమసిద్ధి భూపాలునకు కూడా చేరింది. ఆ పద్యాన్ని ఒకసారి చూద్దాం.

*''మద మాతంగ తురంగ కాంచన లసన్మాణిక్యగాణిక్య సం*
*పద లోలిం గొని తెచ్చి యిచ్చి ముదమొప్పంగాంచి సేవించి ర*
*య్యుదయాస్తాచల సేతు శీతనగమధ్యోర్వీపతుల్ సంతతా*
*భ్యుదయున్ ధర్మజు తత్సభాస్థితు జగత్పూర్ణ ప్రతాపోదయున్''*

ధర్మరాజు రాజసూయ యాగం చేసినప్పుడు, లోకంలోని రాజులందరు ఏనుగులు, గుఱ్ఱాలు, బంగారం, మణిమాణిక్యాలు ధర్మరాజునకు కానుకలుగా సమర్పించి సేవించారు అని ఈ పద్యం యొక్క భావ్యం.

ఈ పద్యాన్ని చదివిన తిక్కన, దానిపై ఎఱ్ఱనిరంగు పూసి, ఇంతకన్న మనోహరంగా కవిత్వం చెప్పగలనని ప్రకటించాడు. ఇది తిక్కన ఆత్మవిశ్వాసానికి, ఉభయకవి మిత్రుడు అనే బిరుదును సార్థకం చేసుకోగలగడానికి ఒక ఉదాహరణ.

నన్నయ కవిత్వంలో మూడు వంతులు సంస్కృత పదాలు, ఒక వంతు తెలుగు పదాలు ఉంటాయి. తిక్కన కాలం వచ్చేసరికి

"జాను తెనుగు" జనబాహుళ్యంలోకి వచ్చింది. తెలుగుదనపు వెలుగు జిలుగులు నలుదెసల వ్యాపించాయి. తెలుగులోని తీయందనాన్ని ప్రజలు ఆస్వాదించసాగారు. అందుచేత తిక్కన మహాకవి, తన భారతంలో మూడు వంతులు తెలుగు పదాలను, ఒక వంతు సంస్కృత పదాలను ప్రయోగిస్తూ, తెలుగు సరస్వతి అపురూప అలంకారాలను సృష్టించాడు. దానితో ఎందరో కవులు తిక్కనకు శిష్యులయ్యారు. వీరు కూడా తెలుగు పూదోటలో పరిమళాలు విరజిమ్మే కావ్యకుసుమాలను ఆవిర్భవింపజేశారు. ఆ కాలానికి తిక్కన యుగకర్త అయ్యాడు.

తిక్కన రచనా వైభవం అయినా, కావ్యశిల్పం అయినా విరాటోద్యోగ పర్వాలలో అధికంగా కనబడుతుంది. తిక్కన రచనలో ఘనంగా చెప్పుకోదగ్గది నాటకీయ శిల్పం. పద్యాలను చదువుతూ ఉంటే, లేదా ఆ పద్యభావాలను వింటూ ఉంటే మన కళ్ళముందు ఆయా పాత్రలు కనబడతాయి. మన ముందు నవరసభరితంగా మాట్లాడుకుంటాయి.

నన్నయభట్టారకునికి రచనలో నారాయణభట్టు సహకరించాడు. అదే విధంగా తిక్కనకు 'గురునాథుడు' అనే ఆయన లేఖకుడుగా సహకరించాడు. అడ్డూ ఆపు లేకుండా తిక్కన మహాభారతాన్ని చెబుతూ ఉంటాడు. గురునాథుడు, అంత వేగంగాను తాటాకులపై ఘంటంతో వ్రాస్తాడు. "నా కవితాధార ఎప్పుడు ఎక్కడ ఆగిపోతుందో, అక్కడే నా రచన ఆపేస్తాను" అన్నాడు తిక్కన. మీ ధారాప్రవాహానికి అడ్డు తగలకుండా, "ఏమిటి? మరోసారి చెప్పండి", అని అడుగకుండా నేను లేఖనం సాగిస్తాను" అన్నాడు గురునాథుడు.

వేద విద్య అయినా, మరే విద్య అయినా బ్రాహ్మణులే కాని, మరొకరు చదువరని, బ్రాహ్మణులు ఇతరులకు నేర్పరని ఒక అపప్రథ లోకంలో ఉంది. కాని, గురునాథుడు బ్రాహ్మణుడు కాదు. కుమ్మరి వంశానికి చెందినవాడు. అతనికి పండితులు విద్య బోధించారు. ఆయన అభ్యసించాడు. చెబుతున్నది ఏ పద్యమని అడుగడు. పద్యం తిక్కనగారు ప్రారంభిస్తే చాలు, అది ఉత్పలమాలా? కందమా? మత్తేభమా? లేక మరొక ఛందస్సా? అనే విశ్లేషణ గురునాథునకు బాగా తెలుసు.

ఒక పర్యాయం ఏమి జరిగిందంటే...

తిక్కనగారు చెబుతున్నారు. గురునాథుడు వ్రాస్తున్నాడు. మహాభారతములో శల్యపర్వములోనిది ఈ సంఘటన. రణరంగములో సహదేవుడు, శకునిని సంహరించాడు. తరువాత దుర్యోధనుడు యుద్ధభూమిని విడిచి వెళ్ళిపోయాడు. ఆ వృత్తాంతాన్ని సంజయుడు, ధృతరాష్ట్ర మహారాజునకు వివరిస్తూ

*పలపలని మూకలోఁగా*
*ల్నిలువక గుఱ్ఱంబు డిగ్గి నీ కొడుకు గదా*
*కవిత భుజుఁడగుచు నొక్కఁడుఁ*
*దొలగి చనియె. . .*

అంతవరకు చెప్పాడు తిక్కన. ఆ తరువాత ఏమి చెప్పాలో తిక్కనకు తోచలేదు. అలా తోచని సమయంలో ఏమి చెప్పాలో తెలియక "ఏమి చెప్పుదున్ గురునాథా!" అన్నాడు. గురునాథుడు, ఏమి చెప్పుదున్ గురునాథా! అని కూడా వ్రాసేశాడు. మొత్తానికి గణాలతో సహా పద్యం పూర్తయింది. తిక్కన, గురునాథునితో తన కవితా ధార ఆగిపోయిందని, ఇక భారత రచన ముందుకు సాగదని చెప్పాడు.

అప్పుడు, గురునాథుడు; ఏమి చెప్పుదున్ఃకురునాథా!. . . ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ కొడుకైన దుర్యోధనుడు శకుని మరణానంతరం రణభూమి విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. ఇంకా ఏమి చెప్పమంటావు? అని వివరించగానే, తిక్కన ఆనందభరితుడయ్యాడు. వాణి, తన నోట అప్రయత్నంగా పలికించిన పలుకు సార్థకమైందని, భావిస్తూ గురునాథుని వివరణ విని ఆయనను అభినందించాడు.

తిక్కనకు కవిబ్రహ్మ, ఉభయకవి మిత్రుడు అని రెండు బిరుదులు ఉన్నాయి. బ్రహ్మసృష్టికి, కవి బ్రహ్మ కవితా సృష్టికి అవరోధాలెందు కుంటాయి?

సంస్కృత మహాభారతమొక పెన్నిధి. అది విశ్వవిజ్ఞాన కోశము. కవిత్రయము వారు సంస్కృత భారతము నందలి ఘట్టాలను అవసరమునుబట్టి పెంచడమో, తగ్గించడమో చేశారు. ఈ విధానము, పాత్రలు ఔచిత్యాలను, కథాఘట్టాల ఔన్నత్యాలను పెంపొందించేదిగా ఉంది. తిక్కన సోమయాజి కవిత్వముతో సరిసమానముగా కవిత్వము చెప్పగలవారు ఈనాటికిని ఎవ్వరును లేరు. తిక్కన కథాకథన విధానం అటువంటిది.

'భారతం ప్రతిపర్వ రసోదయమ్' అన్నారు. పర్వం అంటే కణుపు. చెఱకు కణుపు తింటూ ఉంటే, కణుపు కణుపుకి ఎంత మధురంగా ఉంటుందో, అలాగే మహాభారతం కూడా పర్వపర్వానికి రసవంతంగా, రసభరితంగా ఉంటుంది. అంతేకాకుండగా వింటే భారతమే వినాలి. తింటే గారెలే తినాలి అనే నానుడి కూడా ఉంది. మినుము (గారె) తింటే శరీరం ఇనుములా తయారౌతుంది. అదే విధంగా, భారతగాథ వినడం వలన మనస్సు ధృఢత్వాన్ని పొందుతుంది. ఆధ్యాత్మిక మార్గం వెంపు మళ్లి ప్రశాంతతను సంపాదించుకొంటుంది.

రణరంగంలో ఉన్న అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను ఉపదేశించాడు. తిక్కన తన అనువాదంలో భగవద్గీతను సూక్ష్మంగా చెప్పాడు. అప్పటికే గీతాపారాయణ లోకంలో ప్రాచుర్యాన్ని సంపాదించుకొంది. ఎందుకంటే అనేకులు గీతను కంఠస్థం చేశారు. తిరిగి దానిని తెలుగు చెయ్యడంతో ఔచిత్యం ఉండదనుకొన్నాడో ఏమో! దాని అనువాదం తగినంత మాత్రంగా చేశాడు.

మహాభారత కథ అందరకు తెలిసిందే. రాజ్యం కోసం అన్నదమ్ముల బిడ్డలైన కౌరవులు, పాండవులు యుద్ధం చేసుకొన్నారు. జనజీవితం అస్తవ్యస్తమైపోయింది. శ్రీకృష్ణ పరమాత్మ తలచిన విధంగా భూభారం కొంత తగ్గింది.

ధర్మరాజు పట్టాభిషేకం జరిగింది. పాండవులు మహాప్రస్థానం సాగించారు. ఈ విధంగా ఉన్న కథా వృత్తాంతంలో రమణీయ ఘట్టాలున్నాయి. వాటిలో కొన్నింటిని స్థాలీపులాక న్యాయంగా చూద్దాం.

అరణ్యవాసం పూర్తి చేసిన పాండవులు, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చెయ్యాలి. విరాట మహారాజు కొలువు, తమకు అనువైనదని పాండవులు

భావించారు. మారువేషాలలో విరాటరాజు కొలువులో ఆశ్రయం సంపాదించారు. ద్రౌపది, సైరంధ్రి అనే పేరుతో విరాటరాజు భార్య అయిన సుధేష్ణ దగ్గర మాలినిగా చేరింది. సుధేష్ణ సోదరుడు సింహ బలుడు. ఇతడినే కీచకుడు అంటారు. కీచకుడు, సైరంధ్రిని చూశాడు. ఆమె మీద మనసుపడ్డాడు. ఆమెను తన దగ్గరకు పంపించేటట్లు, అక్క సుధేష్ణను ఒప్పించాడు. కీచకుని దుర్మార్గాన్ని సైరంధ్రి వలలునకు (భీమునకు) చెప్పింది. కీచక సంహారానికి భీముడు రంగం సిద్ధపరచాడు. సైరంధ్రితో కలిసి నర్తనశాలకు వెళ్ళాడు. భీమకీచకులిద్దరూ యుద్ధానికి తలపడ్డారు. ఈ ఘట్టంలో వ్యాసభగవానుడు, వారిద్దరు పోరుసల్పిన పద్ధతిని అట్టహాసంగా వర్ణించాడు.

భీమకీచకులు పోరాడుతూ ఉంటే భూమి దద్దరిల్లింది. కుల పర్వతాలు కూలిపోయాయి. సప్తసముద్రాలు ఉవ్వెత్తు కెరటాలతో ఎగసిపడ్డాయి అంటూ వర్ణించాడు.

బాగానే ఉంది. ప్రకృతి ఇంత భయంకర రూపం తాల్చినప్పుడు నర్తనశాలలో ఉన్నవారు కాని, రాజాంతఃపురంలో నిద్రిస్తున్న వారుగాని లేవలేదా? వారికీ వృత్తాంతం ఏమీ తెలియలేదా? వర్ణనలో అతిశయోక్తి ఉందిగాని, సహజత్వం ఎక్కడా కనబడడం లేదు, అని తిక్కన ఆలోచించాడు. దానికి తగినట్లుగా -

*"తన యగపాటోరు లెరుగుదు*
*రని సూతుడు, సమయ భంగ మగుటకు భీముం*
*డును, గొంకుచు చప్పుడుసే*
*యని నిగూఢ విమర్దన ప్రహారములఁదగన్*

- విరాట 2ఆ-345 ప॥

మల్లయుద్ధ నైపుణ్యంబు మెరయంగడంగిరి అని అనువాదం చేశాడు తిక్కన.

నిజమే. ఒక్క ఆడుదాని కోసం ఈ విధంగా ప్రవర్తించాడు, అని ఇతరులనుకొంటారని కీచకుడు, తాను భీముడనన్న సంగతి తెలిస్తే అజ్ఞాతవాసం, ప్రతిజ్ఞాభంగం జరుగుతాయన్న భయంతో భీముడు, ఇతరులకు తెలియకుండగా, చప్పుడు చెయ్యని పిడిగ్రుద్దులను గ్రుద్దుకొన్నారు. ఈ వర్ణన అత్యంత సహజంగా ఉంది. దీనిని బట్టి తిక్కన మహాకవి యొక్క మానసిక విశ్లేషణాశక్తి అర్థమౌతోంది.

తిక్కన రచనలలోని రెండు మూడు పద్యాలను గూర్చి తెల ఎసుకుందాం. తిక్కన కవి విజయసేనము, కృష్ణ శతకము అనే మరో రెండు గ్రంధాలను కూడ వ్రాసినట్లు, పూర్వకవులు చెప్పారు.

*అరయన్ శంతను పుత్రుపై విదురుపైన క్రూరుపై, గుబ్జపై*
*నరుపై ద్రౌపదిపై కుచేలునిపయిన్ నందవ్రజశ్రేణిపై*
*పరగం గల్గు భవత్కృపారసము నాపై కొంతరానిమ్ము నీ*
*చరణాబ్జంబులు నమ్మినాను జగదీశా! కృష్ణ! భక్త ప్రియా!*

ఈ పద్యము తిక్కనగారి కృష్ణశతకము లోనిదని వేంకట రంగకవి అనుకవి తన గ్రంథములో (ఛందోగ్రంధము) ఉదాహరణగా ఇచ్చాడు.




*వల్లభుడేగు దుర్లభుడు వానిదెసన్ దగులూది యిమ్మెయిన్*
*దల్లదమందెదేల? నాచిత స్థితికిన్నను బాప జూచినన్*
*తల్లియు బంధులోకమును తండ్రియు నేమనువారెరింగిరే*
*నుల్లమ యిట్లు నీకు తగునో తగదో పరికించి చూడుమా!*

ఇది తిక్కనగారి విజయసేనము లోనిది.

పెద్దల దగ్గరున్నప్పుడు ఏ పనులు చేయగూడదో చూడండి.

*ఆవులింత, తుమ్ము, హాసంబు, నిష్ఠీవ*
*నంబు, గుప్త వర్తనములు గాక*
*సలుప వలయు నృపతి కొలువున్న యెడల బా*
*హిరములైన, గెలనికెగ్గు లగుట*

విరాట। ఆ -137

ఆవులించడం, తుమ్మడం, నవ్వడం, ఉమ్మి వెయ్యడం చాలా రహస్యంగా, మరొకరికి తెలియకుండగా జరుపుకోవాలి. ఒకవేళ, సభలో ఉన్న వారందరికి తెలిసేటట్లు చేస్తే అది ప్రమాదానికి దారితీస్తుంది.

నిజమే! రహస్యాన్ని రహస్యంగానే ఉంచాలి. బట్టబయలు చేస్తే ప్రమాదమే కదా!

సంధి చేసుకోమని, శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో చెబుతూ,

*సారపు ధర్మమున్ విమల సత్యము పాపము చేత బొంకుచే*
*పారము పొందలేక చెడబారినదైన యవస్థ దక్షు లె*
*వ్వారలుపేక్ష సేసినను వారలచేటగుగాని ధర్మని*
*స్తారకమయ్యు సత్యశుభదాయకమయ్యును దైవముండెడిన్*

అలతి అలతి పదాలతో తేట తెలుగుదనాన్ని చదువరులకు చూపించిన తిక్కన, తెలుగు వారి హృదయాలలో కలకాలము నిలిచియుంటాడు.

*- అవధాన రత్నాకర, కవితిలక పండిత*
*వారణాసి వెంకటేశ్వర శాస్త్రి,* ఎం.ఎ., బి.ఇడి.

# మహనీయుల చతురోక్తులు

– పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

## శిరస్సా ? శివలింగమా?

**కొన్ని దశాబ్దాల పాటు ఆంధ్రప్రదేశంలో సంగీతానికి విజయ నగరం, సాహిత్యానికి రాజమండ్రి, సంస్కృతికి బందరూ కేంద్ర బిందువులుగా ఉండేవి. అందుకే ఆంధ్రులకి బందరు సాంస్కృతిక రాజధాని అని పేరు వచ్చింది. కొన్నాళ్ళు అక్కడ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు ఉపాధ్యాయులుగా పనిచేశారు. అప్పుడే పింగళి లక్ష్మీకాంతంగారూ, విశ్వనాథ సత్యనారాయణగారూ చెళ్ళపిళ్ళ దగ్గర సాహితీ శిష్యులుగా ఉండేవారు.**

అంతేకాదు- కృష్ణాపత్రికని స్థాపించి నిర్వహించిన ముట్నూరి కృష్ణారావుగారూ, భారత కాంగ్రెసు చరిత్ర రాసిన పట్టాభి సీతారామయ్య గారూ, ప్రసిద్ధ విద్యావేత్త కోపల్లె హనుమంతరావుగారూ, హాస్యపితామహ చెరుకువాడ వెంకట నరసింహంగారూ, ఇంకా కౌతా శ్రీరామశాస్త్రీ, శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యా- వీళ్ళంతా బందరు వాళ్ళే.

ఈ మహామహులంతా సాయంత్రం అయ్యేసరికి, ముట్నూరి కృష్ణారావుగారి దగ్గరికి చేరేవారు. అదొక దర్బారు. ఆ దర్బారులో ఎన్నో సాహిత్య, విజ్ఞాన, సాంస్కృతిక, ఆధ్యాత్మిక చర్చలూ, ఇష్టా గోష్ఠులూను. ఆ దర్బారులో ఓ గంట కూర్చుంటే, ఓ జీవితానికి సరిపడేటంత జ్ఞానం లభించేది అనేవారు, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి.

గంభీరమైన చర్చలే కాదు-ఎన్నో హాస్యోక్తులు-మరెన్నో కబుర్లూ, విశేషాలూను.

ఓ మారు ముట్నూరి కృష్ణారావుగారితో కలసి, బ్రహ్మయ్యగారూ, చెరుకువాడవారూ, మరో ఇద్దరు మిత్రులూ -వీరంతా కలసి, కూచిపూడికి సమీపంలో ఉన్న ఓ గ్రామానికి వెళ్ళారు. ఆ గ్రామానికి పెద్ద ఒక శాస్త్రిగారు. ఆ శాస్త్రిగారింటికి వెళ్ళారు ఈ స్నేహబృందం అంతా కలిసి.

సాధారణంగా ఎప్పుడూ ముట్నూరివారు ఒక తెల్లని పెద్ద తల పాగా ధరించేవారు. చేతిలో కర్రలేని గాంధీనీ, తలపై గాంధీ టోపీ లేని నెహ్రూని మనం ఎలా ఊహించలేమో, తలపాగా లేని ముట్నూరి వారిని అలా ఊహించలేం-తలపాగా ఆయన శరీరంలో ఒక భాగం. అలాంటిది ఆ రోజున శాస్త్రిగారింటికి వెళ్ళినప్పుడు, ముట్నూరి వారికి తలపాగా లేదు.

అప్పుడే దేవతార్చన పూర్తి చేసి దేవుడి గదిలోంచి బయటికి వచ్చిన శాస్త్రిగారు, ఈ మిత్రబృందాన్ని చూసి సంతోషించి తన దగ్గరున్న పూజాజలాన్ని, ఒక్కొక్కరి తల మీదా కాస్త కాస్త జల్లాడు.

అలా జల్లడంలో ముట్నూరి వారి తల మీద మరి కొంతసేపు మరి కాస్త ఎక్కువ దివ్యోదకం జల్లారు.

తర్వాత ఇవతలకి వచ్చాక ముట్నూరి వారు తన మిత్రులతో "ఆయన నా మీద తీర్థం ఎక్కువగా ఎందుకు జల్లారో తెలుసా? నాది బట్టతల కదా-అది ఆయనకి సాక్షాత్తూ పవిత్రమైన శివలింగంలా కనిపించి ఉండవచ్చు" అన్నారు.

నిజమే - సాలగ్రామంలా మిల మిలా మెరుస్తూన్న ఆయన బట్టతల చూసి అంతా ఫక్కున నవ్వారు.

☆

## ఆవు అనుకొని ఆవురావురంటూ

**ముట్నూరి కృష్ణారావుగారు ఎంత గంభీరంగా ఉండేవారో, అప్పుడప్పుడు అంత హాస్య ప్రియంగానూ ఉండేవారు.**

ఓ మారు ఆయనా, చెరుకువాడ వారూ, ఇంకో ఇద్దరు ముగ్గురు స్నేహితులూ కలిసి ఓ ఊరు వెళ్ళారు. ఉన్నట్టుండి ముసురు పట్టింది. సన్నగా జల్లు పడుతోంది. అందరూ కారులో కూర్చుని ఉండగా చెరుకువాడ వేంకట నరసింహంగారు, ఆ ఊళ్ళో ఒక అసామీని పిల్చుకు రావడానికి వెళ్ళారు. అలా వెళ్ళేటప్పుడు, చినుకుపడుతోంది కదా అని, నెత్తి మీద ఒక తెల్లని కండువా వేసుకున్నారు. అది ఆయన తలమీద ఒక ముసుగులా అమిరింది.

ఆయన తొందరగా వెళుతున్నారు.

అక్కడొక ఆంబోతు మరొక తొందరలో అక్కడ నిలబడి ఉంది అస్థిమితంగా.

తెరలు తెరలుగా పడుతూన్న వానజల్లు-

చెరుకువాడవారికి ఆంబోతు అస్పష్టంగా కనిపించింది. దాని కంటికి ఆయనా అస్పష్టంగానే కనిపించి ఉంటారు. ఆ తెల్లని ముసుగులో ఉన్నట్టుండి అది ఒక రంకె వేసి ఆయన వైపు వచ్చింది.

ఆయన భయపడి పరుగు లంకించుకున్నారు. అది వెంబడించింది. అది తరిమి తరిమి వదిలింది ఆయన్ని. చివరకి ఎలాగో ఓ అరుగెక్కి దాని బారిపడకుండా తప్పించుకున్నారాయన.

అది వెళ్ళిపోయాక వేంకట నరసింహంగారు బ్రతుకు జీవుడా అని స్థిమితపడి, కారు దగ్గరికి వచ్చి, మిత్రుల్ని కలుసుకొని జరిగిందంతా చెప్పి, "నన్నెందుకు తరిమిందో ఆ ఆంబోతు-నాకర్థం కాదు- నే నెలా కనిపించానో ఏమో దాని కంటికి" అన్నారు.

"ఎలా కనిపించడం ఏమిటి? తెల్లని ముసుగాయె-స్వచ్ఛమైన తెల్లని ఆవులా కనిపించి ఉంటారు. అందుకే అది పాపం ఆశతో మీ వెనకాల పడింది" అన్నారు ముట్నూరి వారు. అంతా ఫకాల్న నవ్వారు.

☆

# పంటల్ని ఇట్లా కాపాడుకుందాం !

## వరి

***రెల్ల రాల్చు పురుగు :*** గొంగళి పురుగులు గింజ గట్టి పడే దశలో వెన్నులు కొరికి నష్టాన్ని కలుగజేస్తాయి. రాత్రి వేళల్లో మాత్రమే పంటకు నష్టాన్ని కలుగజేస్తాయి.

పైరు ఈనిక దశలో చ.మీ. కి 4-5 పురుగులుకి మించి వున్నట్లయితే సస్యరక్షణకు మందులు చల్లాలి. డైక్లోరోవాస్ 1మి.లీ+ ఎండో సల్ఫాన్ 2 మి.లీ ఈ రెండిటిని కలిపి (1లీ. నీటికి చొప్పున) చల్లాలి. లేదంటే కోరోపైరి ఫాస్ 1 లీ. నీటికి 2.5 మి.లీ చొప్పున కలిపి చల్లాలి. ఈ మందులను సాయంత్రం వేళల్లో మాత్రమే చల్లాలి.



***వరి కంపు నల్లి :*** గింజ పాలు పోసుకునే దశలో పిల్ల పురుగులు, పెద్ద పురుగులు రసాన్ని పీల్చడం వలన గింజలు తాలు గింజలైపోతాయి. ఈ పురుగు వున్న చేల నుండి ఒక విధమైన చెడువాసన వస్తుంది.

దుబ్బుకి 1 లేదా 2 పురుగులు వున్నప్పుడు ఎండోసల్ఫాన్ 2 మి.లీ లేదా క్లోరో పైరిఫాస్ 2 మి.లీ ఒక లీటరు నీటికి చొప్పున కలిపి సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి.

## శనగ

***శనగ పచ్చ పురుగు :*** ఇది లద్దె పురుగు దశలో ఆకులను, పూతను, కాయలను తింటూ ఉంటుంది. సీతాకోక చిలక దశలో ఇది పూతపైన, కాయలపైన గ్రుడ్లను ఒక్కొక్కటిగా పెడుతుంది. గ్రుడ్ల నుండి వచ్చిన పురుగు, కాయలను తొలిచి గింజలను తింటుంది. ఈ పురుగు నివారణకు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా లసిఫేట&1 గ్రా. చొప్పున పూత, పిందె దశల్లో 10 రోజుల వ్యవధిలో మందులను మార్చి రెండు, మూడు సార్లు పిచికారి చేయాలి.

## టమాటో

***కాయ తొలుచు పురుగు :*** లేత ఆకులను, కొమ్మలను తినివేస్తుంది. కోత దశలో కాయలను తొలిచి నాశనం చేస్తుంది.

టమాటోలో ఎర పంటగా బంతిని వేసుకోవాలి. టమాటో కంటే బంతి నారును 20 రోజులు ముందుగా నాటు కోవాలి. ప్రతి 16 వరుసల టమాటోకు 1 వరుస బంతి మొక్కలు ఎర పంటగా వేస్తుకోవాలి.



250 లార్వాల నుండి సేకరించిన యన్.పి.వి. ద్రావణాన్ని ఒక ఎకరాకు చొప్పున పిచికారి చేయాలి. టమాటో నాటిన 28వ రోజున, 35వ రోజున ఎండోసల్ఫా&లీటరు 2 మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

టమాటో పంటకు ఊత కర్రలను పాతాలి. ఊతం నివ్వటం వలన మంచి పరిమాణం గల కాయలు ఏర్పడతాయి. అంతే కాక కాయలు నేలకు తగిలి చెడిపోకుండా కాపాడువచ్చు.

### మామిడి కోతలు

మామిడి కోత విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించినట్లయితే మంచి నాణ్యత గల కాయల్ని మార్కెట్‌కి పంపి గిట్టుబటు ధర పొందే అవకాశం ఉంది. సాధారణంగా మన రాష్ట్రంలో మామిడి కోతలు ఏప్రిల్ నుండి జూన్ / జూలై మాసాల వరకు కొనసాగుతాయి. ఉత్తర భారత దేశంలో కోతలు



కొంత ఆలస్యమవుతాయి. కాబట్టి ముందుగా కోతకు వచ్చిన వాటిని ఢిల్లీ తదితర ప్రాంతాలకు పంపినట్లయితే మనకు గిట్టుబాటు అవుతుంది.

మామిడి కాయలు తెంపేందుకు కొంకణ్ కృషి వాద్యపీఠ్ వారు రూపొందించిన డాపోలి పరికరం బాగా ఉపయోగపడుతుంది. ఈ డాపోలి పరికరం సహాయంతో కాయల తొడిమను కత్తెరల మధ్య వుంచి లాగినప్పుడు స్ప్రింగు వలన కత్తెరలు దగ్గరగా వచ్చి తొడిమను కత్తిరిస్తాయి. కాయలు చట్రానికి అమర్చిన వలలో పడతాయి. కాయ తోడిమకు ఇరువైపు లేక పసుపు పచ్చ రంగు రావటం, కాయ ఉపరిభాగాన నూనె గ్రంథులు ఏర్పడటం అనేది కోతకు సరైన దశ.

మామిడి కాయలను ఉదయం 10 గంటల లోపు లేదా సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే కోయాలి. ఉష్ణోగ్రత ఎక్కువ ఉన్నప్పుడు మామిడి కాయలను కోయకూడదు. మామిడి సొన పండ్ల మీద పడకుండా 2-3 అంగుళాల తొడిమతో కోయాలి. మామిడి కాయల నుండి సొన తొలగించేందుకు సందులతో అమర్చిన వెదురు కర్ర రాక్‌ల మీద కాయలను తొడిమ నేల వైపు ఉండేటట్లు అమర్చాలి. ఇలా అమర్చేందుకు ముందు తొడిమలను 3-4 మి.మీ పొడవు ఉంది. మిగిలిన కాడను కత్తిరించాలి. సొన అంతా కారిపోయేందుకు 45 నిమిషాల నుండి 2 గంటల వరకు సమయం పడుతుంది. దూర ప్రాంతాలకు రవాణా చేసే ముందు సబ్బు నీరు, శిలీంధ్రనాశిని ద్రావణంలో ముంచి, కడిగి, ఆరబెట్టిన తర్వాత పరిమాణాన్ని బట్టి గ్రేడ్ చేసి అట్టపెట్టలలో భద్రపరచి పంపాలి. బంగిన పల్లి, తోతాపురి లాటి రకాలు ముందుగా కోసి ఉత్తర భారతదేశానికి రవాణా చేయటానికి అనుకూలంగా ఉంటాయి. కాయలను రంధ్రాలు కలిగిన అట్టపెట్టెల్లో కాగితపు ముక్కలను కుషనింగ్‌గా వాడి ప్యాక్ చేయాలి. కుషనింగ్ లేకుండా కాయలను ప్యాక్ చేయకూడదు.

## బి.టి. వంకాయ అంటే ఏమిటి?

ఇటీవల కాలంలో బి.టి. వంకాయ సాగు మన దేశంలో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో అసలు బి.టి. అంటే ఏమిటి? బి.టి వంకాయ అంటే ఏమిటి? - ఈ అంశాలను గురించి తెలుసుకుందాం.

బి.టి అంటే ఫాసిల్లస్ తురెంజియెన్సిస్. ఇది ఒక రకమైన బ్యాక్టీరియా. ఇది సహజ సిద్ధంగా నేలలో లభిస్తుంది. ఇది అభివృద్ధి



**రబీ 2009-10 పంటల మద్ధతు ధరలు**

| పంట | మద్ధతు ధర (క్వింటాలుకి రూపాయలలో) |
|---|---|
| గోధుమ | 1100 |
| వరి (సాధారణ రకాలు) | 950 |
| వరి (సూపర్ ఫైన్) | 980 |
| జొన్న (హైబ్రీడ్) | 840 |
| జొన్న (మార్‌దండి) | 860 |
| మొక్కజొన్న | 840 |
| శనగ | 1760 |
| ప్రొద్దుతిరుగుడు | 2215 |
| కందులు | 2300 |
| వేరుశనగ | 2100 |
| కుసుమలు | 1680 |

చెందుతున్న సమయంలో ఒక క్రిస్టల్ లాంటి పదార్థాన్ని విడుదల చేస్తుంది. పురుగులు ఈ పదార్థాన్ని తిన్నప్పుడు అది జీర్ణకోశంలో ఉత్పత్తి అయిన క్షార ద్రావంలో కరిగి ఎంజైముల ద్వారా విషదార్థాన్ని విడుదల చేస్తుంది. ఈ విష పదార్థం కణాల్లో చేరి వాటి పగుళ్లకు దారితీస్తుంది. ఈ కారణంగా పిల్లి పురుగులు 24-72 గంటలలో చనిపోతాయి. బి.టి ప్రభావం వివిధ పురుగులు మీద వేర్వేరుగా ఉంటుంది. ఈ బి.టి. పొడి రూపంలో వివిధ వ్యాపార నామాలతో ఇప్పటికే మార్కెట్‌లో అందుబాటులో ఉంది. డ్రెపెల్, బయోలెప్, బయోబి.టి., హాల్ట్, స్పిక్‌తురిన్, డల్‌ఫిన్ లాంటి పేర్లతో లభ్యమవుతుంది. ప్రత్తి, కంది, శనగ, కూరగాయల మీద వచ్చే శనగ పురుగు, పొగాకు లద్దె పురుగులను నివారించేందుకు, జీవ నియంత్రణ చర్యలలో భాగంగా వీటిని ఇప్పటికే వినియోగిస్తున్నారు.

బాసిల్లస్ తురెంజియోన్సిస్ అనే బ్యాక్టిరియాకి చెందిన ఒక జన్యువుని వంగలో జన్యు మార్పిడి పద్ధతి ద్వారా ప్రవేశ పెట్టి కొత్త వంగడాన్ని రూపొందించారు. అదే బి.టి. వంకాయ. ఈ బి.టి. వంకాయలో ఉన్న జన్యువుల వలన మొవ్వు, కాయ తొలిచే పురుగును తట్టుకొనే శక్తి కలిగి ఉంటుంది. వంగ పంటలో ఈ పురుగువల్లనే 50 నుండి 70% వరకు నష్టం ఉంటుంది. ఈ బి.టి. వంకాయను ఈ పురుగులు ఆశించినట్లయితే వాటి జీర్ణ వ్యవస్థ దెబ్బతిని అవి సహజంగానే చనిపోతాయి. ప్రత్యేకంగా పురుగు మందులు చల్లాల్సిన అవసరం లేకుండానే మొవ్వు, కాయతొలిచే పురుగు అదుపులో ఉంటుంది. ఇలా జన్యు మార్పిడి పద్ధతి ద్వారా రూపొందించబడిన బి.టి. ప్రత్తి ఇప్పటికే మన రాష్ట్రంలో కూడా సాగులో ఉంది. అయితే ప్రత్తి ఆహార పంట కాదు. వంగ మనకు కూరగాయలలో చాలా ముఖ్యమైనది. తినేందుకు ఉపయోగించే పంట కాబట్టి జన్యు మార్పిడి పద్ధతిలో రూపొందించిన వంగడాల వల్ల మన ఆరోగ్యానికి ఏమైన హాని జరుగుతుందేమో అని పలు ప్రాంతాలలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

క్షేత్ర స్థాయిలో మరిన్ని పరిశోధనలు జరిగి అవి క్షేమమని చుజువైన పక్షంలో భవిష్యత్తులో వీటి సాగు చేపట్టవచ్చు.

## పశువుల బీమా పథకం

గ్రామీణ ప్రాంతాలలో ప్రధాన వృత్తి వ్యవసాయం అయినప్పటికీ వ్యవసాయంలో పశు పోషణ కూడా ఒక భాగంగా ఉంటుంది. అతివృష్టి, అనావృష్టి వలన వ్యవసాయంలో ఆదయం తగ్గినప్పుడు పాడి పరిశ్రమ ద్వారా వచ్చే ఆదాయం రైతులకు కొంత చేదోడుగా ఉంటుంది.

అయితే ఈ పాడి పశువుల పెంపకంలో కూడా రైతులు ఎంతో శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. ఎంత శ్రద్ధ తీసుకున్నా ఒక్కోసారి పశువులు అకాల మృత్యువాతకు గురి అవుతుంటాయి. ఉదాహరణకు పశువులలో దొమ్మ వ్యాధి, సర్రా వ్యాధి, గొంతు వాపు వ్యాధి మొదలగు వ్యాధుల వలన మరణాలు సంభవిస్తుంటాయి. అకస్మాత్తుగా పశువు మరణించినప్పుడు వెంటనే రైతు ఆర్థిక పరిస్థితి మీద దాని ప్రభావం పడుతుంది. ఒక్కోసారి ప్రమాదాల వలన కూడా పశువులు మరణిస్తుంటాయి. ఇలాంటి విపత్కర పరిస్థితులలో రైతులను ఆదుకునేందుకు జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వారి అనుబంధ సంస్థల ద్వారా పశువుల బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంచే ఎంపిక చేయబడిన కొన్ని జిల్లాల్లో రాయితీతో ఈ పథకం అమలు అవుతుంది. అంటే ప్రీమియంలో 50% రాయితీ ఉంటుంది.

మన రాష్ట్రంలో 8 జిల్లాల్లో ఈ పథకం అమలులో ఉంది. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, కరీంనగర్, నల్గొండ జిల్లాలో ఈ పథకం అమలులో ఉంది. మిగతా జిల్లాల రైతులు కూడా పశువులకు బీమా చేయించుకోవచ్చు. కాని వారికి ప్రీమియంలో రాయితీ ఉండదు. బీమా చేయించుకోదలచిన రైతులు బీమా కంపెనీ ఏజెంట్లను గాని, జాతీయ బ్యాంకుల వారిని గాని సంప్రదించవచ్చు. పశువులను బీమా చేయించేందుకు నిర్ణీత దరఖాస్తు పూర్తి చేయాలి. ఈ ఫారాలలో పశువు వయస్సు, రంగు, జాతి, గుర్తింపు చిహ్నాలు, పశువు ఆరోగ్య పరిస్థితి, పశువు విలువ మొదలగు అంశాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. వాటిని పశువుల డాక్టరు ధృవీకరించాల్సి ఉంటుంది.

దరఖాస్తు ఫారం పూర్తి చేసిన తర్వాత నిర్ణీత ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పశువు విలువను బట్టి ప్రీమియం ఉంటుంది. ఒకేసారి 3 నుండి 5 సంవత్సరాల వరకు బీమా చేయిస్తే కొంత రాయితీ ఉంటుంది. బీమా చేయించబడిన పశువుకు గుర్తుగా నెంబరు కలిగిన ఒక చెవిపోగు ఇస్తారు. ఈ చెవి పోగును జాగ్రత్తగా ఉంచాల్సిన బాధ్యత పశు పోషకులదే. బీమా చేయించబడిన పశువులను రైతులు మామూలుగానే పోషించాలి. వాటి పోషణ, ఆరోగ్యం విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ చేయకూడదు.



ఏదైనా కారణం వలన పశువు మరణించినట్లయితే మరణించిన తేదీ, కారణముచ చెవి పోగు నెంబరు మొదలగు వివరములతో బీమా కంపెనీ వారికి తెలియచేయాలి. క్లెయిమ్ ఫారంలో నింపి పశువులు డాక్టరుతో ధృవీకరించి, పాలసీ సర్టిఫికెట్, చెవిపోగు కూడా జతచేసి బీమా కంపెనీకి సమర్పించాలి. వీలైనంత త్వరగా రైతుకు బీమా మొత్తం చెల్లిస్తారు.

పాలిచ్చే పశువుకే కాకుండా పనిచేసే పశువులకు కూడా బీమా చేయించుకోవచ్చు. వ్యాధులు, ప్రమాదాలు, వరదలు, తుపానులు, అగ్ని ప్రమాదాలు మొదలైన కారణాల వలన పశువు మరణించినట్లయితే రైతు పూర్తిగా నష్టపోకుండా మరొక పశువును కొనుగోలు చేసుకునేందుకు వెసులుబాటు లభిస్తుంది.

***– ఘంటా విజయ కుమార్,*** ఆకాశవాణి

---

## నువ్వు మాత్రమే పాడే పాట



చిన్న కోకిలకోసం
పెద్ద ఆకాశం ఎదురుచూస్తుంది.

ఏడాదిపాటు ఎక్కడికిపోతుందో
ఏం చదువుతుందో, ఎట్లా గడుపుతుందో,
కాని కోకిల పాడే తరుణం రాగానే
కోకిల మాత్రమే పాడుతుంది.

గొంతెత్తి కోకిల చెప్పేదిదే, నువ్వు
పాడవలసిన పాట నువ్వే పాడాలని,
నిన్ను రమ్మని పిలిచిన విందుకు
నీ బదులు మరొకరు పోలేరని.

నీ మాటలేవో నువ్వు పోల్చుకోగలిగితే,
నీ శ్రోత ఎవ్వరో అవి పోల్చుకుంటాయి.

***– వాడ్రేవు చిన వీరభద్రుడు***

*('కోకిల ప్రవేశించే కాలం' నుండి సేకరించబడినది)*

# షెడ్యూల్డ్ కులాలు/జాతుల అభివృద్ధిలో 5 దశాబ్దాలు

దేశంలోని షెడ్యూల్డ్ కులాలు/జాతుల వారు ఎన్నో శతాబ్దాలుగా దోపిడీకి, అవమానాలకు గురౌతున్నారు. ఆర్థిక దోపిడీకి, సామాజిక వివక్షకు గురౌతున్నందున వీరు జనజీవన స్రవంతిలో కలవకుండా దూరంగా ఉంచబడుతున్నారు. అస్పృశ్యతను నిషేధించి, చట్టసభలలో వారికి కొన్ని స్థానాలను రిజర్వు చేస్తూ రాజ్యాంగ రక్షణ కల్పించినా ఫలితం కన్పించడం లేదు. వారింకా సాంఘిక, విద్యా, ఆర్థిక రంగాలలో మిగతా వారికంటె వెనుకబడే ఉన్నారు.

చట్టసభలలో, ప్రభుత్వ సర్వీసులలో రిజర్వేషన్లు కల్పించడంతో పాటు వారి అభ్యున్నతికి ప్రభుత్వం ప్రణాళికా కేటాయింపుల ద్వారా కొంత శాతం నిధులను ప్రత్యేకంగా కేటాయించి, సమాజంలోని మిగతా వర్గాల వారితో సమాన హోదా కల్పించటానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. దారిద్ర్యం నుంచి బయటపడి అభివృద్ధి చెందే దిశలో వారికిది ఓ మైలురాయి వంటిది.

1950-51 నుంచి ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికలను అమలు చేస్తోంది. 1976లో జరిగిన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ఎస్.సి/ఎస్.టి. జనాభాలో ఉన్న పేదరికపు స్థాయి గురించి చర్చ జరిగింది. ఎన్ని చర్యలు తీసుకొన్నా వీరిలో అభివృద్ధి కానరావడం లేదని ముఖ్యమంత్రుల దృష్టికి వచ్చింది. అదే సమావేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రంగాల కింద ప్రణాళికా నిధులను విడుదల చేయాలని నిర్ణయించాయి. ఆయా రాష్ట్రాలలో ఉన్న ఎస్.సి, ఎస్.టి జనాభా ప్రాతిపదికగా నిధులను కేటాయించాలని కూడా నిర్ణయం తీసుకొన్నారు. 1978-79 ఆర్థిక సంవత్సరం నుంచి ఆ నిర్ణయాలు అమలు జరుగుతూనే ఉన్నాయి.

ఇప్పుడు మనం 11వ పంచవర్ష ప్రణాళిక నాలుగో సంవత్సరంలో ఉన్నాం. ప్రణాళికా కేటాయింపులతో పాటు ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలు, పథకాల కింద వార్షిక బడ్జెట్లలో నిధులను కేటాయిస్తూనే ఉన్నాయి. సాంఘిక సంక్షేమం, ఆదివాసీ సంక్షేమం పథకాల కింద కూడా రాష్ట్రాల బడ్జెట్లలో నిధులను కేటాయిస్తున్నారు. నిధుల కేటాయింపులో సంక్షేమ శాఖల ప్రధాన ఉద్దేశం ఎస్.సి,ఎస్.టి వర్గాలలోని యువతరానికి విద్యావకాశాలు కల్పించడం, వారి అభివృద్ధికి దోహదపడే వివిధ అవకాశాలను కల్పించడం అందులోని ప్రధానమైన అంశాలు.

ఆనాటి నిర్ణయాలకు అనుగుణంగా మన రాష్ట్రంలోని ఎస్.సి. లకు 16.2%, ఎస్.టి. లకు 6.6% ప్రణాళికా నిధులను 2001 జనాభా లెక్కల ప్రాతిపదికన కేటాయిస్తున్నారు.

రాష్ట్రంలో ఎస్.సి. సబ్‌ప్లాన్ కింద 81 శాఖాపద్దుల పేరాతో, ఎస్.టి. సబ్‌ప్లాన్ కింద 80 శాఖాపద్దుల పేరుతో వివిధ పథకాలను అమలు చేస్తున్నారు. ఈ కేటాయింపుల్లో 75% నిధులు 1. మేజర్ ఇరిగేషన్ శాఖ 2. గ్రామీణాభివృద్ధి శాఖ 3. మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ 4. హౌసింగ్ శాఖకు సంబంధించినవే.

ప్రస్తుతం ఎస్.సి, ఎస్.టి సబ్‌ప్లాన్‌లుగా పిలవబడుతున్న స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్ ప్రధానోద్దేశం ఆర్థికదోపిడీ, సాంఘిక వివక్ష నుంచి ఆయా వర్గాలను విముక్తి చేయడం. మన రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల జనాభా 1.23 కోట్లు, షెడ్యూల్డ్ జాతుల జనాభా 50 లక్షలు ఉంది. అంటే మొత్తం జనాభాలో 16.2% మరియు 6.6%గా ఆ వర్గాలున్నాయి.

ఎస్.సి.లలో 82% మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వారిలో 11% మంది సేద్యపు పనులు చేసేవారున్నారు. ఎస్.సి. కార్మికుల్లో 64% మంది వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. 2008-09 ఆర్థిక సంవత్సరంలో వార్షిక ప్రణాళిక పరిమాణం 41,000 కోట్ల రూపాయలు. ఎస్.సి. విభాగాలకు 8,524 కోట్లు, ఎస్.టి. లకు 3,663 కోట్లు కేటాయించారు. 2008-09 ఆర్థిక సంవత్సరం ముగిశాక వివిధ ప్రభుత్వ శాఖలు పంపిన సమాచారం మేరకు కేటాయింపుల్లో ఎస్.సి. విభాగాలలో 39.92% నిధులు, షెడ్యూల్డ్ ట్రైబ్ విభాగాలలో 46.6% నిధులు ఖర్చు అయ్యాయి. ఈ లెక్కల ఆధారంగా 'అపార్డ్' కొన్ని జిల్లాలలో పర్యటించి పరిస్థితిని సమీక్షించింది.

వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, నీటిపారుదల, హౌసింగ్, సామాజిక మౌలిక సదుపాయాలు, పౌష్టికాహారం, సాంఘిక భద్రత, పెన్షన్, పావలావడ్డీ, మధ్యాహ్న భోజన పథకాల వంటివి షెడ్యూల్డ్ కులాలవారికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని 'అపార్డ్' అధికారుల దృష్టికి వచ్చింది. కాగా నీటిపారుదల, విద్యుత్, జాతీయ రహదారులు, భవనాలు మొదలైన రంగాలలో ఖర్చుపెట్టిన నిధులను ఎస్.సి/ఎస్.టి.లకు మాత్రమే ముడిపెట్టడం సరికాదు.

వార్షిక ప్రణాళికను రూపొందించేటప్పుడు ప్రభుత్వం కొన్ని అంశాలను దృష్టిలో ఉంచుకొని, ఏ అంశాలకు ఎంత ప్రాధాన్యం ఇవ్వాలో ముందుగా ఒక నిర్ణయానికొస్తుంది. 2009-10 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక మాంద్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికా సైజును 36,635 కోట్లకు తగ్గించారు. ఆ మొత్తంలో 49% నిధులను నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణ రంగానికి కేటాయించారు. ఈ



SthanikaPalanaTelApril_2010.pmd 7 3/27/2010, 4:32 PM

**అక్షరాస్యత రేటు - రాష్ట్ర మరియు ఎస్.సి/ఎస్.టి. ల మధ్య పెరిగిన ఎడం**

| నం. | జనాభా లెక్కలు | సగటు రాష్ట్ర అక్షరాస్యత | ఎస్.సి.ల సగటు అక్షరాస్యత | ఎడం | ఎస్.టి.ల సగటు అక్షరాస్యత | ఎడం |
|---|---|---|---|---|---|---|
| 1. | 1961 | 21.2 | 8.5 | 12.7 | 4.41 | 16.79 |
| 2. | 1971 | 24.6 | 10.7 | 13.9 | 5.4 | 19.2 |
| 3. | 1981 | 29.94 | 17.7 | 12.24 | 7.8 | 22.14 |
| 4. | 1991 | 44.1 | 25.9 | 18.2 | 13.6 | 30.5 |
| 5. | 2001 | 60.5 | 53.5 | 7.0 | 37.1 | 23.4 |

ప్రాజెక్టులను అంతకుముందే చేపట్టారు. ఫలితంగా ఎస్.సి/ఎస్.టిల కేటాయింపుల్లో కూడా కొంత కోత పడింది. 2009-10 ఆర్థిక సంవత్సరంలో ఎస్.సి.లకు 6,292 కోట్లు, ఎస్.టిలకు 2,353 కోట్ల రూపాయలు కేటాయించారు.

ముందుగా నిర్ణయించిన ప్రణాళికా కేటాయింపులు, ఆ ఏడాది విడుదల చేసిన నిధులకు పొంతన లేకుండా ఉంటుంది. రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ఆయా శాఖాధిపతులు తీసుకొన్ని నిర్ణయాల మేరకు ఇలా జరుగుతుంటుంది. ఉదహరణకు, సాంఘిక సంక్షేమ శాఖకు కేటాయించిన నిధుల్లో నాలుగో వంతు మాత్రమే విడుదల అయ్యాయి. అలాగే ట్రైబల్ వెల్ఫేర్ శాఖ చేసిన ఖర్చుకు అయిదురెట్లు కేటాయింపులు జరిగాయి.

ఎస్.సి, ఎస్.టి. సబ్ ప్లాన్స్ కింద మంజూరైన నిధులు ప్రధానంగా టెక్నికల్ విభాగాలకు కేటాయిస్తున్నారు. ఈ విభాగాల అధికారులకు పేదల అవసరాలు తెలియవు. కాబట్టి ఏ పథకాలకు డబ్బు ఖర్చు చేయాలో నిర్ణయించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నీటిపారుదల శాఖ, విద్యుత్, జాతీయ రహదారులు, మౌలిక సదుపాయాలు (బిల్డింగులు, బ్రిడ్జిల నిర్మాణం) వంటి ప్రధాన రంగాలకు కేటాయించిన నిధులను కూడా ఎస్.సి, ఎస్.టి.లకు కేటాయించిన నిధులలో చూపించారు. ఇటువంటి కేటాయింపులు చేసేటప్పుడు వాటిని మరోసారి సరిచూసుకోవాల్సి ఉంటుంది. ఆ నిధులు ఏమేరకు వాటి లబ్ధిదారులకు ఉపయోగపడుతున్నాయన్నది ప్రశ్నార్థకం.

ఈ స్థితిలో మార్పులు తెచ్చేందుకు ఒక సూచన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. దానిప్రకారం, అన్ని పథకాలకు సంబంధించిన అధికారులు, వాటిని అమలుచేసే సంస్థలు, మిగతా స్టాక్ హోల్డర్లు జాబితాలను తయారు చేస్తారు. సాధారణంగా, పథకాలకు కేటాయించిన నిధులలో అధిక భాగం ఆర్థిక సంవత్సరంలోని చివరి మూడు నెలల్లోనే ఖర్చు చేయడం సర్వత్రా కన్పిస్తోంది. లబ్ధిదారులకు ఆ నిధులు ఏవిధంగా లాభాన్ని కలుగజేస్తున్నాయో స్పష్టమైన సమాచారం రాబట్టడం సాధ్యం కాదు.

దీన్ని దృష్టిలో ఉంచుకొని, గత అయిదేళ్లలో చేపట్టిన వివిధ పథకాలు ఏమేరకు అమలు జరిగాయన్న దానిపై తీవ్రంగా పర్యవేక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో, హౌసింగ్, స్వయం ఉపాధి పథకాలు, నీటిసరఫరా, ఆరోగ్యం, పాఠశాలల్లో సదుపాయాలు వంటి రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజల ముంగిళ్లకు చేరుతున్నాయో లేదో కూడా పరీక్షించాల్సిన అవసరం ఉంది.

క్షేత్రస్థాయిలో ఈ పథకాలు అమలు జరుగుతున్న తీరుపై తనిఖీ జరిగితే స్థానిక అధికారులు, నంద్యలు, జిల్లా, రాష్ట్రస్థాయి శాఖాధిపతులు, కలెక్టర్ మొదలైన వారందరికీ క్షేత్రస్థాయిలో జరిగే లోపాలు, అవరోధాలు అన్నీ అవగతమవుతాయి. దీనివల్ల పథకాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టటమే కాకుండా నిబంధనల ఉల్లంఘనలను, అక్రమాలను అరికట్టవచ్చు.

షెడ్యూల్డ్ కులాలు/జాతులలో అక్షరాస్యతా స్థాయిలపై జరిగిన ఒక సర్వే ప్రకారం 1961 నుండి 2001 వరకు రాష్ట్ర సగటు అక్షరాస్యతతో పోలిస్తే ఎస్.సి.ల అక్షరాస్యత సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది గానీ, ఎస్.టి.ల సగటు అక్షరాస్యత, రాష్ట్ర సాధారణ అక్షరాస్యత మధ్య ఉన్న తేడా (గ్యాప్) పెరుగుతూ వస్తోంది. ఈ విషయం ఈ కింది టేబుల్ ద్వారా స్పష్టమౌతోంది.


***- ఎం. సెబాస్టియన్ రాజు, ఐపిఎస్ (రిటైర్డ్)***

*సెంటర్ హెడ్, సియస్ఇ&ఇ, ఎం.ఎం.ఆర్. అపార్డ్*

*- అనువాదం:* ***బి. లలిత***





SthanikaPalanaTelApril_2010.pmd 8 3/27/2010, 4:32 PM

# విజయనగర సామ్రాజ్య సాంఘిక జీవనం వైభవ భరితం

మధ్యయుగంలో దాదాపు మూడు వందల సంవత్సరాలపాటు హిందూ ధర్మ సంరక్షణకు కంకణం కట్టుకున్న రాజ్యం విజయనగరం. ఒక్క ఆంధ్రదేశమేకాదు, కర్నాటక, కేరళ, తమిళ సామ్రాజ్యంగా వెలిగి విజయ నగరం దక్షణాది సంస్కృతిని పోషించింది. పారశీక చక్రవర్తి షారుఖ్ తన రాయబారి అబ్దుల్ రజాక్‌ని ప్రౌఢ దేవరాయల కాలంలో (1443 సం.) విజయనగరానికి పంపించాడు. అతడు ఆనాటి విజయనగర సామ్రాజ్యాన్ని కనులకు కట్టినట్టు వర్ణించాడు. విజయనగరంతో సమానమైన నగరం ప్రపంచంలో మరెక్కడ లేదని అబ్దుల్ రజాక్ పేర్కొన్నాడు. ఏడు ప్రాకరాల మధ్య కట్టిన ఈ నగరం శత్రు దుర్భేధ్యమైనది. ఏడవ ప్రాకారం మధ్యలో రాయల మందిరాలు, సౌధాలు, కొలువుకూటాలు, కచ్చేరీలు ఉండేవి రాజ వీధులు ఎంతో విశాలంగా ఉండి, వాటి ఇరువైపుల వివిధ పుష్పాలు విక్రయించే అంగళ్ళు ఉండేవి.

ఆ రోజులలో ధనికులు తమ నివాసభవనాలను చంద్ర కాంత శిలలతోను, గరుడ పచ్చలతోను కట్టుకునేవారు. సామాన్య ప్రజలు రాళ్ళతో కట్టుకునేవారు. విజయ నగరం రాజుల కాలంలో ప్రాచీన చాళుక్య, కాకతీయ, హోయస్థల శిల్పాలతో ద్రవిడ శిల్పం కలసి పోయింది. తుంగభద్ర నీరును రాచనగరుకు తెచ్చారు. పంపా విరూపాక్షాలయము, హజారా రామస్వామి మొదలైన వారి దేవాలయాలు, వాటి గోపురాలు ఈ నాటికీ అద్భుత కళా ఖండాలే. విజయనగర సామ్రాజ్య రాజధాని హంపిలో ఆనాడే చక్కని నీటిసరఫరా సౌకర్యం ఉండేది. విజయ నగర ప్రజలు హైడ్రాలిక్ ఇంజనీరింగు విధానం గురించిన విజ్ఞానం కలిగి ఉండేవారు. నిత్యావసరాల నిమిత్తం రాయబెల్ కాలువనుంచి నీటిని రాజధాని నగరానికి తెప్పించుకునేవారు. మధ్య తరగతివారి ఇళ్ళకు పెంకులకప్పు, మట్టి మిద్దెలు ఉండేవి. జనసామాన్యమంతా గుడిసెలలో నివసించేవారు. విజయనగర రాజాలు వరాహలాంఛనులు.

విజయనగర సామ్రాజ్య ప్రజలలో ఎక్కువమంది హిందూ మతం అవలంబించేవారు. హిందూ మతస్థులలో శైవులు, వైష్ణవులు అనే శాఖా భేధాలుండేవి. సామ్రాజ్యంలో అత్యధికులు స్మార్తులు. తాము పూజించే గణపతి, శివుడు, అంభిక, విష్ణువు, సూర్యుడు అనే వారందరూ ఒకే దేవుని రూపాలని వారి విశ్వాసం. షణ్మతస్థాపనా చార్యుడైన శ్రీ శంకరాచార్యుల అనుయాయులు స్మార్తులు. వారు వర్ణా శ్రమ ధర్మానికి బద్ధులై వైదిక క్రతువులను, ఆచారాలను పాటించేవారు. శైవులలో పాశుపతులు, కాలాముఖులు అని రెండు శాఖలుండేవి. సంగమ వంశ తొలి రాజులందరూ కాలాముఖ శైవమతానికి చెందిన వారే. కొన్ని ప్రాంతాలలో వీరశైవం పలకుబడి ఎక్కువగానే ఉండేది. వీరశైవులు వేద సామ్రాజ్యాన్ని గుర్తించలేదు. పునర్జన్మ సిద్ధాంతాన్ని అంగీకరించలేదు. బాల్య వివాహలను నిషేధించారు. వితంతు వివాహాలను సమ్మతించారు. వీరికి కూడా రాయళ్ళ ఆదరణ లభించినా, విజయనగర రాజులు వీరశైవులు కారు. వైష్ణవ మతంకూడా రాజ్యంలో ఎక్కువ ప్రచారంలో ఉండేది. వైష్ణవంలో వడగళై, తెంగళై రెండు శాఖలేర్పడ్డాయి. వడగళై వైష్ణవులు వేదాలకు ప్రాముఖ్యమిస్తే, తంగళై వైష్ణవులు ప్రబంధాలకు ప్రాధాన్యమిచ్చారు. వేదాంత దేశకుని కుమారుడు వరదా చార్యులు వడగళైశాఖకు నాయకుడు. పిళ్ళైలోకాచర్య, మణిమాళ మహాముని తెంగళైశాఖ నాయకులు విఠల పూజ వైష్ణవమతంలో కొత్తగా ప్రవేశించింది.

తొలి విజయనగరరాజులు శైవులు. రెండో విరూపాక్షరాయల కాలంనుండి రాజులు వైష్ణవ మతావలంబులు. తిరుపతి వేంకటేశ్వరుని భక్తులైనారు. రాజులు ఏ మతానికి చెందిన వారైనా అందరు దేవుళ్ళను సమాన భక్తితోనే కొలిచేవారు రాయుళ్ళందరికీ హంపీ నిరూపాక్షస్వామి ఆరాధ్యదైవం. ఆనాటి మఠాలన్నీ విద్యాకేంద్రాలే. రాజులు అనేక దేవాలయాలను కొత్తగా నిర్మించి, జీర్ణదేవాలయాలను ఉద్ధరించారు. ఆలయాలలో నిత్యపూజలు జరిపించడానికి నగదును, భూములను దానమిచ్చారు. దేవాలయ ఆస్తులను సక్రమంగా నిర్వహించడానికి ధర్మకర్తలుండేవారు పవిత్ర స్థలాలను సందర్శించే ఆచారం హిందువులలో ఉండేది. సామ్రాజ్యంలో పవిత్రస్థలాల సంఖ్య ఎక్కువే. శైవ, వైష్ణవ, పవిత్రస్థలాలు-విరూపాక్షమ్, కాళహస్తి, తిరుపతి, కాంచీ, శ్రీశైలం, తిరుమన్నామలై, అహెూబిలమ్, సంగమేశ్వరమ్, శ్రీరంగం, కుంభకోణం, మహానంది, గోకర్ణ, రామేశ్వరం తీర్ధయాత్రలు వ్యయప్రయాసలతో కూడినట్టివి. దొంగల బెడద ఎక్కువై ఉండటంతో బృందాలుగా తీర్థయాత్రలకు వెళ్ళేవారు. పల్లకి, అందళమ్ ఉన్నత వర్గాలవారి ప్రయాణసాధనాలు. సామాన్యులు కాలినడకన వెళ్ళేవారు. ధనికులు అద్దె గుర్రాలమీద, ఎద్దులమీద ప్రయాణంచేసేవారు. దోవలో చలివేంద్రాలు, పూటకూళ్ళ ఇళ్ళు ఉండటంతో సౌకర్యాలకు లోటులేదు. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి యాత్రలు చేసేవారు.

నాటి ప్రజలు సామాన్యంగా భోగ పరాయణులు. స్త్రీలోలురు, శృంగారం శ్రుతిమించిపోయింది. సౌందర్యోపాసన పరమావధి అయింది. ఆనాటి స్త్రీలు, పురుషులు రత్నాలు ధరించేవారు. అంగళ్ళల్లో రత్నాలు రాసులుపోసి అమ్మేవారు. రసికులు నడుముకు బంగారు మొలత్రాడు, చేతులకు రత్నకంకణాలు, భుజాలకు కేయూరాలు, మెడలో రత్నహారాలు, చెవులకు రత్నాలు పొదిగిన మకర కుండలాలు, ముత్యాల చౌకటు ధరించేవారు. వైష్ణవులు నుదుట తిరుచూర్ణము పెట్టుకుని, చెవులకు బంగారు కుండలాలు వేసుకునేవారు. కంఠానికి తులసీమాలలు వేసుకుని, పద్మమాలికలు తిప్పేవారు. శైవులు సిగలలో శివలింగాలు ధరించి, పాలభాగాన విభూతిరుద్ధి, రుద్రాక్షమాలలు వేసుకునేవారు. ఆనాడు తాంబూల సేవనమెంత ముఖ్యమో, పుష్పధారణ కూడ అంత ముఖ్యమే. దేవతలనేకాదు, మరెవరిని పూజించినా పూలతోనే పూజించేవారు. అంత పుష్పప్రీతి కలవారు కనుక ప్రతియింటా పూతోటను పెంచేవారు, పురుషులు నీరావి ధోవతులు, ఉత్తారాయాలు ధరించేవారు. ఆ కాలంలో పురుషులు బలశాలురు. శౌర్య, ధైర్య, పరాక్రమాలకలవారు. పుష్టికరమైన అహారం తిని, శరీర వ్యాయామం చేసేవారు. ఎక్కడ చూసినా సాము గరడీలు ఉన్నట్లు పెద్దనామాత్యుని వర్ణనలు చెబుతున్నాయి. మల్లులు పోటీ ప్రదర్శనలిచ్చేవారు.

సాధారణ స్త్రీల విషయాల్లో పెద్దగా మార్పులేకపోయినా, దొరల స్త్రీలకు తల్లిదండ్రులు విద్యనేర్పించేవారు. సంగీతం పాడి, వాయిద్యాలను వాయించడంలో నైపుణ్యంగల స్త్రీలను



SthanikaPalanaTelApril_2010.pmd 5 3/27/2010, 6:11 PM

విదుషీమాణులుగా భావించేవారు. రాయుల భవనంలో నాణ్యశిక్షణకు ప్రత్యేక మందిరాలు ఉండేవి. వివాహాలు ఆడంబరంగా జరిగేవి. వినోదాలలో వేట ముఖ్యమైనది. ఏనుగుల వేట, ఎద్దువేట, లేళ్ళవేట, వరాహాల వేట జరిపేవారు. పందెములు కాచి, పాచికలాడటంలో రాజనగరు స్త్రీలు కూడా పాల్గొనేవారు. వినోదంలో నాటికీ వీక్షణానిదే ప్రథమస్థానం. నాటకాలలో జాంబవతీ కళ్యాణం వంటి నాటకాలు విద్యాధికుల కోసం, పండితుల కోసం ప్రదర్శించేవారు. పామరుల కోసం యక్షగానాల ప్రదర్శన జరిగేది. యక్షగానాల వలె తోలు బొమ్మలాటలు కూడా రాత్రంతా ప్రదర్శించేవారు. ప్రజల వినోద కాలక్షేపాలు దొమ్మరి వాళ్లు ప్రదర్శించే గారడీలు, విప్రవినోదాలు, భాగవత ప్రదర్శనలు ముఖ్యమైనవి.

ఉచ్ఛ దశలో ఉన్నప్పుడు విజయనగర సామ్రాజ్యం కృష్ణానది నుండి దక్షిణ భారత దేశమంతా విస్తరించింది. సామ్రాజ్యంలో ముఖ్య పరిశ్రమ వ్యవసాయం, వ్యవసాయ పరిశ్రమలో నూనె ఉత్పత్తి ప్రధానమైనది. నువ్వుల నూనె, కొబ్బరి నూనె, ఆముదం, ఆవనూనె మొదలైన నూనెలను గానుగ ఆడించి తీసేవారు. అద్దకపు పరిశ్రమ కూడా వ్యవసాయ పరిశ్రమకిందే లెక్క. కొబ్బరి పీచుతో చాంతాళ్లు నేసేవారు. కొబ్బరి కల్లుకు గిరాకి హెచ్చు. అది తాటికల్లు కంటే శ్రేష్ఠమైనది. తాటి ఆకులతో చాపలు అల్లేవారు. దేవాలయాలు, రాజభవనాలు, ధనవంతుల భవనాలు తప్పితే, మిగిలిన ఇళ్ళన్నీ తాటి ఆకులతో కప్పినవే. గనుల త్రవ్వకం నాటి పరిశ్రమలలో ముఖ్యమైనది. బంగారం, వజ్రాలు, ఇనుము అన్వేషించడానికి గనులు త్రవ్వేవారు. ఉప్పుకు గిరాకీ బాగా ఉండటంతో భారీ ఎత్తున అది ఉత్పత్తి అయ్యే పరిశ్రమలన్నింటిలో నేత పరిశ్రమకు అగ్రతాంబూలం. దిగుమతులలో ప్రధానమైనవి ఏనుగులు, గుర్రాలు, ఇవే యుద్ధాలలో ప్రధానపాత్ర వహించేవి. ఏనుగులను ఎక్కువగా సింహళం, బర్మాదేశాల నుండి తెప్పించుకునేవారు. యుద్ధభూములో యీనాడు ట్యాంకులు చేసే పని ఆ రోజులలో ఏనుగులు చేసేవి. శ్రీకృష్ణదేవరాయల పాలనలో ఏనుగులు, గుర్రాలు దిగుమతి చేసే వ్యాపారులకు ఎక్కువ ప్రాముఖ్యం లభించింది. గుర్రాలను అరబ్ దేశాల నుండి తెప్పించుకునేవారు. సుమత్రా, మొలక్కాదీవులు, సింహళం నుంచి తెప్పించే సుగంధ ద్రవ్యాలలో లవంగాలు, ఏలక్కాయలు, దాల్చిన చెక్క, బోర్నియో, సుమత్రాలనుండి కర్పూరం దిగుమతి అయ్యేది. ఎగుమతులలో బియ్యం, చక్కర, ఇనుము, మిరియాలు, పిప్పళ్లు, అల్లము, శొంఠి, ఔషధాలు ముఖ్యమైనవి. పశ్చిమ తీరాన్ని బహమనీ సుల్తాన్లు ఆక్రమించుకోనంతకాలం గోవా పెద్దరేవు. తర్వాతి కాలంలో




క్విలన్, కాయల్ పెద్ద రేవులు. విదేశీ వర్తకంలో పోర్చుగీసు వారు, అరబ్‌లు, భారతీయులు పాల్గొనేవారు. రాయుళ్ళ కాలంలో ఆంధ్రప్రాంతాలు వినుకొండ, కొండవీడు, కొండపల్లి, ఉదయగిరి,రాచకొండ, గద్వాల్, భువనగిరి ముఖ్యమైన వ్యాపార కేంద్రాలు.

## సారస్వతం

పద్యకవిత్వం మొదట ఆంధ్రీకరణ. పిమ్మట విప్రవీకరణ, తర్వాత అనుకరణ, తుదకు స్వపో కల్పన. కృష్ణదేవరాయల కాలంలో అష్టదిగ్గజాలమధ్య ఆంధ్రభాష విప్రవీకరుణానుకరణ, స్వకల్పయుక్తంగా చిందులాడినది. జిలిబిలి పలుకులు, ముద్దు పలుకులు, పలికినది. ఒయ్యారపు నడకలతో కృష్ణరాయ ధరాతలేంద్రునే చేపట్టింది. ఆ కాలానికి ప్రబంధ యుగమనే పేరు వచ్చింది. పురాణాలలోని గాథలను, ఆ నాటి సాంఘిక చర్య వ్యవహారాలను ప్రతిబింబిస్తూ ప్రబంధాల పేర కావ్య రచనలు చేశారు. మహారాజుల చేత, మహా మంత్రులచేత, రసజ్ఞుల చేత అఖండ గౌరవాలను పొంది శాశ్వత కీర్తిని సంపాదించుకున్నారు.

ఆంధ్ర కవులలో కవిత్రయము తర్వాత పేర్కొనబడిన నాచన సోమన మొదటి బుక్కరాయల కాలం వాడు. ఇతడు హరివంశం రచించాడు. తెలుగు కవులను గుర్తించి, ఆదరించి, సత్కరించడం విజయనగరంలో నాచన సోమనాథుడితోనే మొదలయింది. రెండవ దేవరాయల మంత్రి సిద్ధన్నకు జక్కన్న కవి తన 'విక్రమార్క తన చరిత్ర'ను అంకితమిచ్చాడు. శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానంలోని కవులలో అల్లసాని పెద్దన ప్రసిద్ధుడు. ఆంధ్ర కవితా పితామహుడు. 'మనుచరిత్ర' ఆయన రచించిన ప్రసిద్ధ గ్రంథం. పెద్దన కవిత మాధుర్యానికి ముగ్ధుడైన రాయలు ఆయన కాలికి గండె పెండేరాన్ని తొడిగి సత్కరించాడు. అల్లసాని పెద్దనతో సమానగౌరవం పొందిన మరొకకవి ముక్కు తిమ్మన. ఇతడు 'పారిజాతాపహరణం' అనే గ్రంథాన్ని రచించాడు. తెనాలి రామకృష్ణుడు హస్య చతురుడు. వికటకవి. పాండు రంగ మహాత్మ్యమనే కావ్య కర్త. శ్రీకృష్ణ దేవరాయలే స్వయంగా 'ఆముక్తి మూల్యద' అనే కావ్యాన్ని రచించాడు. తెలుగు నానుడులతోను, పలుకుబడులతోను, వైష్ణవ భక్తి భరతమైన శృంగార, భక్తి కీర్తనలు రచించిన పద కవితా పితామహుడు అన్నమయ్యను ఆదరించిన వాడు సాళువ నరసింహారాయలు. ఈ కాలములో తెలుగుభాష గోదావరి తీరము నుండి కన్యాకుమారి వరకు వ్యాపించింది. తెలుగు రానివాడు నాగరికుడు కాదు అనేంత వరకు వర్థిల్లినవి సంగీత నాట్యకళలు విజయనగరంలో పురివిప్పి నాట్యం చేసినవి. సంగీత సర్వోదయకర్త బండారు లక్ష్మీ నారాయణుడు శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానంలో సంగీత విద్వాంసుడు.

సకల కళలకు, సకల సంపదలకు నిలయంగా వెలిసినది విజయనగరం. హిందువులు స్థాపించిన చివరి గొప్ప సామ్రాజ్యంగా ఈ రాజ్యానికి చరిత్రలో గొప్ప కీర్తి వచ్చింది. కృష్ణదేవరాయల కాలంలో పల్లె ప్రజలు - "కొండవీడు మందేరా - కొండపల్లి మందేరా. కాదని ఎవ్వడు వాదనకు వచ్చినా కటకం దాకా మనదేరా" అనే ధీమాతో పాటలు పాడుకునే వారు. ఇంత కంటే గొప్ప గర్వం విజయనగర సామ్రాజ్యానికి ఇంకేముంది?

**- జి.వి. రామారావు**

(శ్రీకృష్ణ దేవరాయల పట్టాభిషేక పంచ శతాబ్ది ఉత్సవ ప్రత్యేక వ్యాసం)




SthanikaPalanaTelApril_2010.pmd 6 3/27/2010, 6:11 PM



# భారత క్రికెట్‌కు వైభవోపేత సమయం అది

ఇటీవల వార్తా పత్రికల్లో ప్రచురితమైన ఒక రిపోర్టు భారత క్రీడా రంగ చరిత్రకు సంబంధించిన వైభవోపేత ఘట్టాలను కనుల ముందు నిలిపింది. 1971 లో వెస్ట్ ఇండీస్‌లోనూ, ఇంగ్లాండ్‌లోనూ అజిత్ వాడేకర్ నాయకత్వంలో పర్యటించిన భారత క్రికెట్ జట్టు సభ్యులకు ఇటీవల ముంబైలో సన్మానం జరిగింది. కొందరు ఈ జట్టుని "1971 కి చెందిన వాడేకర్ తరగతి" గా అభివర్ణించారు.

క్రికెట్ క్రీడా రంగ చరిత్రలో 1971 సంవత్సరం నిజంగానే గొప్ప సంవత్సరం. అంతకు ముందు సంవత్సరాల్లో సికె నాయుడు, రంజిత్ సింగ్‌జీ, దులీప్ సింగ్‌జీ, విజయ్ హజారే, వినూ మంఖాడ్, విజయ్ మంజ్రేకర్, పోలీ ఉమ్ రిగార్ వంటి గొప్ప గొప్ప క్రీడాకారులు క్రికెట్ క్రీడలో మెరుపులు మెరిపించి ఉండవచ్చుగాక.

కానీ, ఒక జట్టుగా చూస్తే మటుకు భారత జట్టు అప్పటి వరకు బిగ్ లీగ్‌లో లేదు. విజయాలు అతి తక్కువ. అదీ ఎప్పుడైనా మాత్రమే లభించేవి. నిజం చెప్పాలంటే, అవి చీకటి రోజులు. ఓటమిని నివారించటం కూడా ఒక విజయం కిందనే భావించేవారు.

1951 -52 లో మొదటిసారి భారత జట్టుకి మొదటిసారిగా టెస్ట్ క్రికెట్‌లో విజయం లభించింది. విజయ్ హజార్ అప్పుడు జట్టుకి నాయకత్వం వహించారు. అనేక సంవత్సరాల తరువాత, 1968లో న్యూజీలాండ్ పర్యటన సందర్భంగా భారత జట్టు విదేశాల్లో ఆడిన టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో మొదటిసారి విజయం సాధించింది. అప్పుడా జట్టుకి నవాబ్ పటౌడీ జూనియర్ సారథ్యం వహించారు.

1971లో మాత్రం వెస్ట్ ఇండీస్, ఇంగ్లాండ్‌లలో జరిపిన పర్యటన భారత క్రికెట్‌కు మొత్తం మారిన దృశ్యాన్ని అందించింది. గతంలోని చేదు జ్ఞాపకాల స్థానంలో కొత్త విశ్వాసం మొలక వేసింది. ఎంతో బలిష్ఠంగా ఉన్న వెస్ట్ ఇండీస్ జట్టును భారత జట్టు ఆ పర్యటనలో ఓడించింది. అప్పుడు వెస్ట్ ఇండీస్ జట్టులో గారీ సాబర్స్, మరెందరో ఉద్దండులున్నారు.

ఈ సిరీస్‌లో భారత జట్టు గారీ సాబర్స్ వంటి ఒక గొప్ప ఆటగాడిని తన జట్టులోనే ఉన్నట్లు కనుగొన్నది. టెస్ట్ మ్యాచ్‌ను మొదటిసారిగా ఆడిన ఆ నవయువకుని పేరు సునీల్ మనోహర్ గవాస్కర్.

ఆ యువకుడు సెంచరీలు కొట్టటవే అలవాటుగా పెట్టుకున్నవాడు. ఆ పర్యటనలో మొత్తం 774 పరుగులు సాధించాడు.

భారత జట్టు ఆ తరువాత ఇంగ్లాండు పర్యటనకు వెళ్లి మరో విజయాన్ని నమోదు చేసుకుంది. క్రికెట్ క్రీడ జన్మించిన ఇంగ్లాండ్ గడ్డమీద సాధించిన ఆ విజయం భారత జట్టుకు చిరస్మరణీయమైనది.

ఈ విజయాలతో భారత జట్టు బిగ్ లీగ్‌లో ప్రవేశించింది. ఇక భారత జట్టును ఏ మాత్రం ఉపేక్షించకూడదని, తేలిగ్గా తీసుకోకూడదని ఇతర దేశాల జట్లకు దాంతో తెలిసివచ్చింది. ఆ తరువాత నాలుగు దశాబ్దాల కాలంలో భారత జట్టు వర్ధిల్లుతూ, అత్యున్నత స్థానానికి చేరుకుంది. ఇటీవలే భారత జట్టుని అత్యుత్తమ జట్టుగా ప్రకటించారు.

1971 సంవత్సరం నిజంగా దేశానికి చిరస్మరణీయమైన సంవత్సరం. భారతదేశ సాయుధ దళాలు పాకిస్తాన్‌ని ఓడించి, బంగ్లాదేశ్‌కి విముక్తి కలిగించగా, మన క్రికెటర్లు బలమైన వెస్ట్ ఇండీస్, ఇంగ్లాండ్ జట్లను మట్టి కరిపించాయి.

అటు యుద్ధ రంగంలోనూ, ఇటు క్రీడా రంగంలోనూ సాధించిన విజయాలు యావత్ భారత దేశ ప్రజలనూ ఉర్రూత లూగించాయి.







SthanikaPalanaTelApril_2010.pmd 17 3/27/2010, 6:11 PM









అయితే, వెస్ట్ ఇండీస్ జట్టుపై టెస్ట్ క్రికెట్‌లో భారత జట్టు సాధించిన విజయం మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ప్రత్యేకించి హైదరాబాద్‌కి మరింత మధురమైనది. ఎందుకు కాదు మరి? ఆనాటి భారత జట్టులో మన రాష్ట్ర ఆటగాళ్లు అత్యధికంగా ఉన్నారు. అనేక సంవత్సరాల్లో అక్కడ అజారుద్దీన్‌ను, ఇక్కడ టెస్ట్ క్రికెట్‌లో లక్ష్మణ్ ను మాత్రమే మీరు చూసి ఉంటారు. కాని 1971 లో వెస్టిండీస్‌లో పర్యటించిన జట్టులో ఎం.ఎల్.జై సింహ, సయ్యద్ అబిద్ అలీ, పి. కృష్ణమూర్తి, డి. గోవిందరాజ్, కె. జయంతిలాల్ ఉన్నారు. వీరంతా మన హైదరాబాదీయులే. భారత దేశ క్రికెట్ జట్టులో అంతకంటే ముందుకానీ, ఆ మాట కొస్తే, ఆ తరువాత కానీ ఎప్పుడూ హైదరాబాద్ నుంచి అంత మంది ఆటగాళ్లు లేరు.

ఈ ఆటగాళ్ల గురించి, వారి ఆట తీరు గురించి కొన్ని ఆసక్తి కరమైన విషయాలు చర్చించుకుందాం.

ఎం.ఎల్. జైసింహను ఎక్కువగా జై అని క్రికెట్ క్రీడాభిమానులు పిలిచేవారు. జై సింహ కేవలం ఒక గొప్ప బ్యాట్స్‌మాన్, ఒక అద్భుతమైన ఫీల్డరే కాదు. ఆ కాలంలో ఆయనొక స్టయిల్ క్రికెటర్. కేవలం ఆయనకు చూడటానికి కళాశాల యువతులు క్రికెట్ మైదానానికి వచ్చేవారు. జై సింహ పట్టు వదలకుండా ఆడేవారు, క్రీజులో గంటల కొద్దీ ఉండే టెక్నిక్‌ను ఆయన సాధించారు. టెస్ట్ మ్యాచ్‌లో అయిదు రోజులు మొత్తం ఆడినది బహుశా ఆయనొక్కరే. 1959 -60లో జరిగిన కలకత్తా టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో ఆడినప్పుడు ఆయన అయిదు రోజులూ క్రీజ్‌లోనే ఉన్నారు. పాకిస్తాన్‌తో జరిగిన కాన్పూర్ టెస్ట్ మ్యాచ్‌లో రోజంతా క్రీజులోనే ఉండి 49 పరుగులు, ఆ మరు రోజు 99 పరుగులు సాధించారు. అంటే మొత్తం 505 నిముషాలపాటు క్రీజులో ఉన్నారు. 60 ఏళ్ల వయస్సులో 1999లో జై సింహ మరణించారు.

కె. జయంతిలాల్ కూడా 1971లో రిజర్వు క్రీడాకారుడిగా వెస్ట్ ఇండీస్‌లో పర్యటించాడు. కింగ్‌స్టన్‌లో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో గాయపడిన ఓపెనర్ గవాస్కర్ తరువాత ఈయన క్రీజులోకి వచ్చాడు. కాని కేవలం 5 పరుగులు మాత్రమే చేశాడు. అదే సంవత్సరం ఇంగ్లాండ్‌లో పర్యటించిన భారత జట్టులో జయంతిలాల్ కూడా భాగంగా ఉన్నాడు. కాని పెద్దగా విజయాలు నమోదు చేయలేదు.

అయితే, దేశవాళీ క్రికెట్‌లో హైదరాబాద్ జట్టుకి ప్రాతినిధ్యం వహించే జయంతిలాల్ గొప్ప ఆటగాడే. 1965 -69లో ఆంధ్రాతో జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో రంగ ప్రవేశం చేసిన జయంతిలాల్ 153 పరుగులు చేశాడు.

ఇకపోతే, జయంతిలాల్ లొకాలిటీలోనే పెరిగిన పి.కృష్ణమూర్తి, డి. గోవిందరాజ్‌లకు అత్యద్భుతమైన ప్రతిభ ఉన్నప్పటికీ, వారు పెద్దగా రాణించలేదు. అదృష్ట దేవత వారిని కరుణించలేదు.

కృష్ణమూర్తి కేవలం గొప్ప వికెట్ కీపర్ మాత్రమే కాదు. హైదరాబాద్ రంజీ జట్టులో చిరకాలంపాటు ఆడిన కృష్ణమూర్తి మొత్తం బ్యాటింగ్ ఆర్డర్‌తో ఆడేవారు. ఓపెనర్ నుంచి టెయిల్ ఎండర్ వరకు కృష్ణమూర్తి కొనసాగేవారు.

70ల దశకంలో రంజీట్రోఫీ టోర్నమెంట్‌లో కర్ణాటకలో ఆడినప్పుడు ఆయన రెండు రికార్డులు నెలకొల్పారు. ఆబిద్ అలీతో కలిసి ఆడి 10వ వికెట్‌కి 105 పరుగులు జోడించాడు. సయ్యద్ షాహిద్ అక్బర్‌తో కలిసి ఓపెనింగ్ వికెట్‌కి 100 పరుగులు జోడించాడు.

ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 108 మ్యాచ్‌లలో ఆయన 218 వికెట్లు తీశాడు. ఇందులో 62 స్టంపింగ్‌లు ఉన్నాయి. ఫరూఖ్ ఇంజనీర్ గైర్హాజరులో



SthanikaPalanaTelApril_2010.pmd 18 3/27/2010, 6:11 PM











వెస్ట్ విండీస్‌తో జరిగిన మొత్తం ఐదు టెస్టులలో కృష్ణమూర్తి వికెట్ కీపర్‌గా ఉన్నాడు. ఇంగ్లాండ్‌లో కూడా ఆయన పర్యటించినప్పటికీ, టెస్ట్ మ్యాచ్‌లు ఆడే అవకాశం ఆయనకు లభించలేదు.

కొన్ని సంవత్సరాలకు ఫరూఖ్ ఇంజనీర్ రిటైర్‌వగా, వికెట్ కీపర్ స్థానం కోసం పోటీపడిన కృష్ణమూర్తి ప్రయత్నం ఫలించలేదు. సయ్యద్ కిర్మానీ ఆ స్థానాన్ని కైవశం చేసుకున్నాడు. ఈ మార్పు హైదరాబాద్ క్రికెట్ అభిమానులకు షాక్‌లా తగిలింది.

1999లో కేవలం 52 సంవత్సరాల వయస్సులో కృష్ణమూర్తి మరణించినప్పుడు క్రికెట్ బైబిల్ అయిన 'విస్‌డన్' ఆయన గురించి గొప్పగా రాసింది. "భారతదేశం బయట అసలు ఆలోచించటానికి కూడా సాధ్యపడని విజయాలను" (218 వికెట్లు, 62 స్టంపింగ్స్) కృష్ణమూర్తి సొంతం చేసుకున్నారంటూ 'విస్‌డన్'' నివాళి అర్పించింది.

ఇక, పొడగరి అయిన గోవిందరాజ్ ప్రముఖ సి.కె.నాయుడికి బంధువు కూడా. వెస్ట్ ఇండీస్, ఇంగ్లాండ్ పర్యటనలో గోవిందరాజ్ కూడా ఉన్నాడు. అయితే, టెస్ట్ మ్యాచ్‌లు ఆడే అవకాశం ఆయనకు లభించలేదు. పేస్ బౌలర్ అయిన గోవిందరాజ్ రంజీట్రోఫీలో హైదరాబాద్ తరుపున ఆడేవారు. అనేక సంవత్సరాల పాటు ఇతర మ్యాచ్‌లలో కూడా ఆడారు.

ప్రతిభ ఉన్నప్పటికీ, గోవిందరాజ్ టెస్ట్‌మ్యాచ్‌ల స్థాయికి చేరక పోవటం మింగుడు పడని విషయం. వెస్ట్ ఇండీస్ ఆటగాళ్లతో ఆడేటప్పుడు గోవిందరాజ్ ప్రతిభ బాగా పనికి వస్తుందని సునీల్ గవాస్కర్ అంతటి క్రీడాకారుడు ప్రస్తుతించాడంటే, మనం ఆయన ప్రతిభ ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

గోవిందరాజ్‌ని గుర్తించి, జట్టులో తగిన స్థానం కల్పించలేకపోతే తరువాత బాధపడవలసి వస్తుందని అనేక టెస్ట్ మ్యాచ్‌లలో ఆస్ట్రేలియా జట్టుకి నాయకత్వం వహించిన కీత్ మిల్లర్ భారతీయ సెలక్టర్లను హెచ్చరించాడు కూడా. అంతకంటే ఫాస్ట్ బౌలర్‌ని భారతదేశం తయారు చేయలేదని కూడా ఆయన హెచ్చరించారు. ఇప్పుడు గోవిందరాజ్ బ్రిటన్‌లో ఉంటున్నారు.

"1971 నాటి అజిత్ వాడేకర్ తరగతి" లో మరొక ముఖ్య సభ్యుడు ఆల్ రౌండర్ సయ్యద్ అబిద్ అలి. 1958-59 లో ఆస్ట్రేలియా, న్యూజీలాండ్‌లలో జరిపిన పర్యటనల్లో మొదటిసారి టెస్ట్ మ్యాచ్‌తో రంగ ప్రవేశం చేసిన అబిద్ అలి బ్యాంటింగ్ లోనూ, బౌలింగ్‌లోనూ తన ప్రతిభ కనబరిచాడు.

వెస్ట్ ఇండీస్‌లో జరిగిన మ్యాచ్ అబిద్ అలి నాన్ స్ట్రయికర్‌గా ఉండి, సునీల్ గవాస్కర్ విజృంభించడానికి అవకాశం ఇచ్చాడు. ఒక మ్యాచ్‌లో గారీ సాబర్స్, రోహన్ కన్‌హాయ్‌లకు వరుసగా బౌలింగ్ చేశాడు. ఓవల్ టెస్ట్‌లో ఘనంగా నాలుగువికెట్లు తీసిన అబిగ్ అలి, భారత జట్టుకి అపూర్వమైన విజయాన్ని అందించాడు.

మాంచెస్టర్ టెస్ట్ మ్యాచ్‌లో లంచ్‌కి ముందు కేవలం 19 పరుగులిచ్చి, నాలుగు వికెట్లు తీయటం ద్వారా అబిద్ అలి ఇంగ్లాండ్ జట్టు వెన్ను విరిచాడు. అనేక సంవత్సరాలపాటు హైదరాబాద్ - జట్టుకి గొప్ప సేవలందించిన అబిద్ అలి ప్రస్తుతం 70 ఏళ్ల వయస్సులో అమెరికాలోని యువకులకు క్రికెట్ కోచ్‌గా ఉన్నాడు.

ఆ విధంగా 1971లో భారత జట్టు వెస్ట్ ఇండీస్, ఇంగ్లాండ్‌లలో జరిపిన పర్యటన మన దేశ క్రికెట్‌కు బంగారు కాలాన్ని తేవటంలో విత్తనాలు వేసింది. నేడు భారత జట్టు ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదగడానికి అది స్ఫూర్తి అందించటమే కాక, దోహద పడింది. ఈ క్రమంలో తన వంతు పాత్ర పోషించినందుకు హైదరాబాద్ కూడా గర్వపడుతోంది.

*- దాసు కేశవరావు*

(అనువాదం : టి. నర్మద)



SthanikaPalanaTelApril_2010.pmd 19 3/27/2010, 6:11 PM

# బోరు బావులకు పసి ప్రాణాలు బలిచేయద్దు

వదిలివేయబడ్డ బోరు లేక ట్యూబ్ బావులలో పడి చిన్న పిల్లలు చనిపోవటంపై ఈ మధ్య చాలా వార్తలు వస్తున్నాయి. వీటిపై సూమెటోగా స్పందించి, సుప్రీం కోర్టు వారు డబ్ల్యు.పి. (సివిల్) నెం.36/2009లో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రభుత్వాలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆదేశాలు జారీ చేసారు. వివరాలు ఇలాగ ఉన్నాయి.

1. ఏదైనా బోరుబావి / ట్యూబ్ బావి తవ్వే ముందర ఆ భూమి యజమాని, 15 రోజులు ముందుగానే జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులకు ( భూగర్భజలాలు, ప్రజారోగ్యం, మునిసిపాలిటీ - ఎవరికి సంబంధం ఉంటే వారికి) బోరు బావి / ట్యూబ్ బావి తవ్వుతున్నట్లు తెలియజేయాలి.



2. ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ సంస్థలకు సంబంధించిన అన్ని రిగ్గు కంపెనీలు, జిల్లా యంత్రాంగం దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.
3. బావి తవ్వే స్థలం దగ్గర ఒక బోర్డు పెట్టి దానిపై రిగ్గు కంపనీ వాడకం దార్ల, భూమి యజమానుల అడ్రస్సులు తప్పకుండా రాయాలి. పని ప్రారంభం అయినప్పటి నుంచి పెట్టి, బావి వదిలి వేసిన తరువాత కూడా ఈ బోర్డు ఉంచాలి.
4. బోరు బావి తవ్వేటప్పుడు బావి చుట్టూ ఇనుపముళ్ళకంచెగాని, ఏదైనా కట్టుదిట్టమైన అడ్డంకి కాని కట్టాలి.
5. బావి చుట్టూ 0.50x01.50x0.60 మీటర్ల (0.30 మీటర్లు భూమి పైన, 0.30 మీటర్లు భూమి లోపల ఉండేట్లుగా) సిమెంట్ / కాంక్రీట్ చప్టా కట్టాలి.

## సుప్రీంకోర్టు ఆదేశాలు



6. బోరు బావి గొట్టాన్ని స్టీలు ప్లేటుతో మూసి దానిని కేసింగ్‌కు వెల్డింగ్ చేయాలి. లేకపోతే కేసింగ్‌కు గట్టి మూతను బిగించినట్టు బోల్టులతో బిగించాలి.
7. పంపు రిపేరు చేసేందుకు బోరు బావిని తెరుస్తే, రిపేరు అయ్యే వరకు మూత లేకుండా ఉంచకూడదు.
8. మట్టి కుంటలు, కాలువలు పూర్తిగా పూడ్చివేయాలి.
9. వదిలివేయబడ్డ బోరు బావిని ఇసుక, బండరాళ్ళు / గులక రాళ్ళు, విరిగిపోయిన డ్రిల్లింగ్ సామాగ్రితో భూమిలోల నుండి, పై వరకు నింపాలి.
10. బోరు బావిని త్రవ్వటం అయిన తరువాత భూమిని చదును చేసి యథా స్థితికి తీసుకురావాలి.
11. పైన చెప్పిన మార్గదర్శకాలు అమలు జరుగుతున్నాయో లేదో తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్లకు తగిన అధికారులు ఇవ్వాలి.
12. ప్రతి జిల్లా / మండలం/గ్రామంలో త్రవ్విన బోరు / ట్యూబ్ బావుల్లో, పనిచేస్తున్నవి, వదిలివేసినవి (దాంట్లో పూర్తిగా పూడ్చినవి, ఇంకా పూడ్చనివి) లాంటి వివరాలు జిల్లా స్థాయిలో పొందుపరచాలి. ఈ బోరు / ట్యూబ్ బావుల పరిస్థితిని ఎప్పటికప్పుడు గ్రామ సర్పంచ్, సంబంధిత వ్యవసాయాధికారి సమీక్షించాలి. అలాగే మునిసిపాలిటీలలో సంబంధిత జూనియర్ ఇంజనీర్, భూగర్భజల శాఖ, ప్రజారోగ్య శాఖ, పురపాలక సంస్థ సంబంధిత శాఖాధికారులు సమీక్షించాలి.
13. ఏదైనా బోరు / ట్యూబ్ బావి పని మధ్యలోనే వదిలివేస్తే, ఆ బావులు పూర్తిగా పూడ్చారని సంబంధిత అధికారులు (భూగర్భ జల శాఖ / ప్రజారోగ్య శాఖ / పురపాలక సంస్థ/ ప్రైవేట్ కాంట్రాక్టర్) దగ్గర నుండి సర్టిఫికేట్ తప్పక తీసుకోవాలి. వీటిని కూడా అప్పుడప్పుడు సంబంధిత అధికారులు సమీక్షించి ఆ రిపోర్టును మండలాభివృద్ధి అధికారి, జిల్లా కలెక్టరు కార్యాలయాల్లో ఉంచాలి.

ఈ మార్గదర్శక సూత్రాలను టీ.వి.ల ద్వారా అందరికి తెలియజేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు పంపాలని సుప్రీం కోర్టువారు ఆదేశించారు. ★



SthanikaPalanaTelApril_2010.pmd 20 3/27/2010, 6:11 PM

# మహిళల గౌరవానికే భంగం రెండో పెళ్లి

ఇదివరకే పెళ్లయిన మగవాడికి మరో భార్యగా స్థిరపడాలనుకునే మహిళలు తమ సామాజిక స్థాయి ఏమిటో ఆలోచించవలసి ఉంటుంది. రెండో భార్యకు చట్టపరంగా గుర్తింపు లేదని, అందువల్ల మహిళల హక్కులన్నీ భంగపడతాయని చాలామందికి తెలియదు. ఒక భార్య ఉండి కూడా తనను ఇష్టపడుతుండడం తన గొప్పదనం అనుకుని కొందరు రెండో పెళ్లికి సిద్ధపడుతుంటే, విధి లేక మరికొందరు అంగీకరిస్తున్నారు. మరి కొన్ని సందర్భాల్లో మగవారు తమకు పెళ్లయిందని చెప్పకుండా మోసం చేయడం కూడా తెలిసిన సంగతే. మోసపూరితమైన పెళ్లి చెల్లదని దాన్ని వదిలించుకోవచ్చని చాలామందికి తెలియదు. తెలిసినా ఆ సాహసం చేయరు. ఫలితం నానా కష్టాలు, నేరాలు చివరకు ఎవరూ ఊహించని ఘోరాలు. రెండు వివాహాల వల్ల మొదటి భార్యగానీ లేక రెండో భార్య గానీ దెబ్బ తింటారు లేదా ఇద్దరూ నష్టపోతారు. సంతానం ఉంటే వారితో సహ రెండు కుటుంబాలు కూడా నష్టపోతాయి.

### మహిళా గౌరవానికే భంగం

హిందూ వివాహ చట్టం బహు భార్యత్వాన్ని ఆమోదించలేదు. ఇండియన్ పీనల్ కోడ్ రెండోపెళ్లిని నేరంగా పరిగణిస్తున్నది. చట్టం కేవలం 'భార్య' అన్న స్థాయినే గుర్తించింది కాని 'రెండో భార్య' అనే హోదాను పరిగణించే అవకాశం లేదని స్పష్టంగా తేల్చింది. భార్యకు సంఖ్యాపరమయిన స్థానం కల్పించడమే మహిళ స్థాయిని అగౌరవ పరచడం.

చట్టం ఏమంటున్నా, ఒక మగవాడికి ఒకే భార్యఅనేదే ఎన్నో రకాలుగా ఆమోదయోగ్యమయిన సూత్రం. మొట్టమొదట జీవ వైవిధ్యానికి సంబంధించిన పర్యావరణ సూత్రం. స్త్రీ పురుషుల సమాన నిష్పత్తిని కాపాడడం అవసరం. ఆడవారి హక్కులకు పిల్లల భవిష్యత్తుకు సంబంధించి రెండు మూడు పెళ్లిళ్ల తీవ్రమయిన ఇబ్బందులు కలిగిస్తాయని వేరే చెప్పనక్కరలేదు. ఆడమగ సమానతకు, సమన్యాయానికి సంబంధించిన ఒక న్యాయమయిన సూత్రం ఇది. దీన్ని కాదనుకుని వివాహాల మీద వివాహాలు చేసుకునే తత్వం వల్ల అందరికీ ఇబ్బందే కలుగుతుంది. రెండు కుటుంబాల్లో, ఇద్దరి ద్వారా కలిగిన పిల్లల్లో, భార్యల్లో ద్వేషభావాలు రగులుతుంటాయి. బాధాకరమయిన, అవమానకరమయిన పరిస్థితులు ఎదురవుతాయి.

భర్త చనిపోతే రెండో భార్య లేదా కొన్ని సందర్భాల్లో మొదటి భార్య ఆయన శవం కూడా చూడరాదని పోలీసులు శాసించే దుస్థితి రావడం పరాకాష్ట. చివరికి వారు అనుమతిస్తే ఆమె ఆయన శవాన్ని చూడగలుగుతుందన్నమాట. బంధువులు, మిత్రులు, చివరకు ఏ సంబంధం లేని వారు కూడా మృతదేహాన్ని చూడాలంటే నిరోధించే అధికారం ఎవరికీ లేదు. సెక్యూరిటీ, తదితర కారణాల వల్ల క్రమబద్ధీకరించవచ్చునేమోగాని రెండో భార్య అన్న కారణంగా ఆపడం న్యాయం కాదు.

### ఆర్థిక అన్యాయం

సామాజికంగా ఈ హోదా ఉంటే రెండో భార్యకు, ఆమె పిల్లలకు ఆర్థికంగా ఏ స్థితి ఉంటుందో వేరే వివరించనవసరం లేదు. సినీతారలు చాలామంది రెండో పెళ్లి చేసుకోవడం మనం వింటూనే ఉన్నాం. రెండో పెళ్లి చేసుకోవడంలో తప్పులేదనే సూచనలను తమ అభిమాన వర్గాలకు ఆ తారలు చాటుతున్నారన్న విషయం వారికి తెలియకపోవచ్చు. సెలెబ్రిటీలను అనుసరించే మూఢత్వం ఉన్నంత కాలం ఈ వెనుకబాటు తనం ఉన్నట్టే లెక్క.

రెండో భార్యను వారసత్వ చట్టాలు కూడా ఏ రకంగానూ గుర్తించడం లేదు. నిన్న మొన్న వచ్చిన ఇంటి హింసనుంచి ఇంతి రక్షణ చట్టం (గృహహింస చట్టం) మాత్రం రెండో భార్యను హింసించినా, పోషించకపోయినా చర్యతీసుకునే అవకాశం కలిగించింది.

### అక్రమ సంతానమే అయినా పోషణ హక్కు

రెండో వివాహం చెల్లదు కనుక, ఆమె సంతానం అక్రమ సంతానం అవుతుంది. సక్రమ సంతానానికి దక్కే వాటాలో సగం అక్రమ సంతానానికి ఇవ్వాలని 1956 కు ముందు హిందూ వారసత్వ నియమాలు చెప్తున్నాయి. 1956 చట్టం ప్రకారం అక్రమ సంతానానికి ఆస్తిలో ఏ హక్కూ లేదు. హిందూ చట్టం సంస్కరణ వల్ల అక్రమ సంతానం హక్కు కోల్పోయింది. కాని హిందూ దత్తత, పోషణ చట్టం



1956 సెక్షన్లు 20-22 ప్రకారం, అక్రమ పుత్రుడు లేదా పుత్రిక తండ్రి నుంచి పోషణ హక్కుగా కోరవచ్చు. తండ్రి మరణిస్తే ఆయన వదిలిన ఆస్తి ద్వారా తనను పోషించాలని మిగిలిన వారసులను హక్కుగా కోరవచ్చు. తనకు ఆస్తిపాస్తులు ఇవ్వకపోయినా ఫరవాలేదు కాని తన కొడుకును అక్కున చేర్చుకుంటే చాలన్న స్వప్న కోరిక హృదయ విదారకం. కాని చట్టంలో ఆమెకు అండంగా నిలువగలిగే ఆస్కారం పిల్లవాడి పోషణ హక్కు ఒక్కటే. ఆయన ఆస్తిని, ప్రభుత్వం, కంపెనీ ఇచ్చే డబ్బును పొందిన వారసులపైన ఆ పిల్లవాడిని పోషించే బాధ్యత ఉందని మరువ కూడదు. ఆమె కూడా ఆస్తిలో వాటా అడగడం లేదు, కేవలం పిల్లవాడి పోషణను అడుగుతున్నది కనుక ఆ హక్కు ఉంది. ఆ పిల్లవాడు సూర్యనారాయణ పుత్రుడని తేలితే ఈ హక్కును నిరాకరించే అధికారం ఎవరికీ లేదు.

### భర్త ఆస్తిలో భాగమేది?

భర్త తన సొంత ఆస్తినుంచి రెండో భార్యకు ఇవ్వాలని వీలునామా

రాస్తే తప్ప, భర్తపోయిన తరువాత ఆ భార్యకు చట్టపరంగా రావలసిన వాటాల కోసం పోరాడడానికి ఆధారాలు ఉండకపోవచ్చు.

సెక్షన్ 10 హిందూ వారసత్వ చట్టం 1956 కింద మొదటి తరగతి వారసుల మధ్య ఆస్తి పంపకం నియమాలు ఉన్నాయి. అందులో మొదటి నియమం ప్రకారం వీలునామా రాయకుండా మరణించిన వ్యక్తి భార్యకు, ఒకరికన్న ఎక్కువ ఉంటే, భార్యలందరికీ కలిపి ఒక వాటా ఇస్తారు. మొదటి తరగతి వారసుల్లో భార్య ఉంది. కాని ఆ ఒక్క వాటాను ఉన్న భార్యలంతా పంచుకోవాలి. భార్యలంతా అనే ఈ వాక్యం రెండో వివాహాన్ని నిషేధించకముందున్న భార్యలకు సంబంధించినదే అని ఎక్కడా చట్టంలో లేదు. కనుక స్వప్న వంటి మహిళలు హిందూ వారసత్వ చట్టం సెక్షన్ 10 రూల్ 1 ప్రకారం భార్యకు లభించే వాటాను మొదటి భార్యతో పాటు తమకూ పంచాలని కోరి తమ అదృష్టాన్ని పరిశీలించుకోవాలి.

అయితే చట్టంలో బహుభార్యత్వానికి చోటు లేకపోవడం వల్ల, వీరికి అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశాలు చాలా తక్కువ. కాని మానవతా దృక్పథంతో వారసులు వ్యవహరించి ఆదరించడం సమస్యలకు పరిష్కారం. ఎందుకంటే ఒకవేళ సూర్యనారాయణ బ్రతికి ఉంటే స్వప్నకు, ఆమె కుమారుడికి కొంత డబ్బు ఇచ్చి ఉండే వాడే కనుక ఆయన కోరికను నిర్వర్తించడం బాధ్యత కనుక, అయితే ఇది కేవలం నైతిక బాధ్యతే గాని చట్టపరమయినది కాదు.

హిందూ కుటుంబ శాసనాలను సంస్కరించామన్న గొప్ప చెప్పు కోవడం కోసం రెండో పెళ్లి చెల్లదని ప్రకటించి, అమలుకాని నియమాలు చేసి స్వప్న వంటి అనేక మంది రెండో భార్యలకు శాసనాలు చాలా అన్యాయాలు చేశాయి. నిక్కచ్చిగా రెండో పెళ్లిని నిరోధించే చిత్త శుద్ధి లేని ప్రభువులు దాన్ని నిషేధించడం వల్ల అంతకుముందు ఉన్న కొన్ని చట్టపరమయిన హక్కులు కూడా పోవడం దారుణం.

## పెద్ద నేరమా ? చిన్న నేరమా ?

రెండో పెళ్లిని నేరం చేసే నిర్వచనం ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 494లో ఉంది. దంపతుల్లో ఒకరు బతికి ఉండగా, మరో పెళ్లి చేసుకోవడం నేరమని, ఈ నేరానికి ఏడేళ్ల కారాగార శిక్ష అని నిర్దేశించారు. శిక్షా పరంగా చూస్తే ఇది చాలాపెద్ద నేరం కింద లెక్క. హత్య, మానభంగం, బందిపోటు తరువాత తీవ్రమయిన నేరం స్థాయి రెండో పెళ్లికి కల్పించిన చట్టం, దీన్ని నాన్ కాగ్నిజబుల్, బెయిలబుల్ నేరం అని ప్రకటించింది. అంటే ఎవరయినా ఫిర్యాదు చేస్తే తప్ప, నేరం అని గుర్తించరు. ఫిర్యాదు చేస్తే గుర్తించి నేరం జరిగిందని నమ్మదగిన పరిస్థితులు ఉంటే నిందితుడిని అరెస్టు చేసిన తరువాత, పోలీసులే బెయిల్ ఇవ్వవచ్చునన్నమాట. అంటే శిక్ష రూపంలో పెద్దనేరంగా పరిగణించినా, ప్రక్రియాపరంగా దీన్ని మరీ చిన్న నేరంగా పరిగణించడం జరిగింది.

## ఫిర్యాదు చేసేదెవరు ?

ఒక మగవాడు రెండు పెళ్లిళ్లు చేసుకుంటే ఎవరు ఫిర్యాదు ఎవరు చేయాలి? మొదటి భార్యనా లేక రెండో భార్యనా? పెళ్లి అనే ఒప్పందంలో భాగస్వామి ఫిర్యాదు చేయాలి. మొదటి భార్య బాధితురాలు కనుక సాధారణంగా ఆమె ఫిర్యాదు చేయాలి. కాని నేరపూరితమయిన వివాహంలో ఆమె భాగస్వామి కాదు. కనుక ఆమె ఫిర్యాదు చెల్లకపోవచ్చు. అంటే రెండో భార్య ఫిర్యాదు చేయాలి. రెండో భార్య తనకు తెలిసి చేసుకున్నా, తెలియకచేసుకున్నా, తెలిసిన తరువాత కూడా ఫిర్యాదుచేయక పోవచ్చు. ఇదొక వివాదం.

## రాజీకి చట్టంలోనే వీలు

మరో వివాదం కూడా ఉంది. సెక్షన్ 320 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ నేర ప్రక్రియా స్మృతి ప్రకారం ఫిర్యాదు చేసిన వ్యక్తి నిందితుడితో రాజీ పడగల నేరాల జాబితాలో రెండో పెళ్లిని చేర్చారు. అంటే ఒకవేళ మొదటి లేదా రెండో భార్య ఫిర్యాదు చేస్తే ఆమెకు డబ్బు ఇవ్వడం ద్వారా ఒప్పించి జైలు నుంచి తప్పించుకునే సౌకర్యం భర్తలకు ఏర్పాటు చేశారు.

ఈ చట్ట నియమాలన్నీ ఇద్దరు లేక ముగ్గురు భార్యలున్న అధికారులు రాసి ఉంటారేమోనన్న అనుమానం కలుగుతుంది. అంటే ఏడేళ్ల శిక్ష వేసినట్టు పైకి కనిపించే ఈ సంస్కరణ చట్టం, లోలోపల అనేక బలహీనతలను సృష్టించి అసలు రెండో పెళ్లి మగవాడిని శిక్షించే అవకాశమే లేకుండా జాగ్రత్త పడ్డారనిపిస్తున్నది. బేరసారాలకు చట్టమే వీలు కల్పించిన తరువాత రెండో పెళ్లి నేరానికి పాల్పడిన వారు తప్పించుకోవడం కష్టమా? ఈ నేరాన్ని రాజీపడదగిన నేరం అని నిర్ధారించడం వల్ల కనీసం బాధితురాలయిన భార్యకు కొంత డబ్బయినా దక్కుతుందని మరో వాదం కూడా ఉంది.

## పెళ్ళి రుజువు మరో గండం

ఫిర్యాదుచేసి, నేరాన్ని గుర్తింపచేసి, రాజీ పడకుండా పోరాడిన మహిళకు మరో గండం ఎదురవుతుంది. అదేమంటే రెండు పెళ్లిళ్లను రుజువుచేయడం, మొదటి, రెండో వివాహంలో కూడా సప్తపది. అగ్నిసాక్ష్యం, హోమం, అరుంధతీ నక్షత్ర దర్శనం వంటి తంతులన్నీ జరిగినట్టు రుజువు చేయాలి. ఇది సాధ్యమా? ఏ పురోహితుడయినా వచ్చి, తాను చేయించిన పెళ్లి సాక్ష్యం చెప్తాడా? ప్రభుత్వం ప్రాసిక్యూషన్ చేస్తుందని పేరుకే గాని అసలు పని అంతా ఫిర్యాదు దారయిన రెండో భార్య లేదా మొదటి భార్య, ఆమె తరపు బంధువులు చేయవలసిందే కాని ఎవరూ సహాయానికి రారు. రెండు వివాహాలు చట్టబద్ధంగా రుజువుచేసే లోగా కనీసం ఒక దశాబ్దం జరిగిపోతుంది.

ఈ లోగా ఫిర్యాదు చేసిన భార్యపై పగబట్టి ఆ మగవాడు మరో భార్యతో కాపురం చేస్తూ, పిల్లలను కంటూ, వారిని పోషిస్తూ కాలం గడుపుతూ ఉంటాడు. ఒకవేళ రుజువైనా అప్పీలు ఉండనే ఉంది. ఆ పైన మరో అప్పీలు ఉండకపోదు. అన్నింటినీ మించిన మరో అన్యాయం ఏమంటే ఫిర్యాదు చేయని భార్య, తనకు అతనితో పెళ్లి కాలేదని ఊరికే అతనితో స్నేహంగా ఉంటున్నానని కోర్టులో సాక్ష్యం చెప్తుంది.

మొదటి భార్య తన భర్తకు రెండో పెళ్లి చేసుకోవడానికి అనుమతిస్తే సరిపోతుందా అని అడుగుతుంటారు. ఆ అనుమతి రెండో పెళ్లిని చట్ట బద్ధం చేయదు. రెండో పెళ్లిని కొందరు మగవారు ఒక హోదా అనుకుంటే అంతకన్న హీనమయిన స్థితి మరొకటి ఉండదు. ఆడవారు రెండో పెళ్లి వారిని ఎంచుకుంటే అది దాదాపు ఆత్మహత్యా సదృశమని గమనించాలి.

*- మాడభూషి శ్రీధర్*

Printed & published by Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Editor : Phani Kumar

సంపూర్ణ పారిశుద్ధ్యంపై
వర్క్‌షాప్ -

వార్త 28వ పేజీలో. . .



సాక్షర భారత్‌పై వర్క్‌షాప్

వార్త 28వ పేజీలో. . .



అపార్డును సందర్శించిన
శ్రీ జె. ఎమ్. ఫాతక్

వార్త 27వ పేజీలో. . .



Sthanika Palana RNI No. APTEL / 2009/27888

